SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 7
December-2022, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2022
వెల రూ. 20/-
పుటలు-56



ధనుర్మాసం ప్రారంభం
(17-12-2022)

హైదరాబాదులో 11-10-2022 నుండి 15-10-2022 వరకు జరిగిన

## శ్రీవేంకటేశ్వరవైభవోత్సవాల దృశ్యమాలిక

ఈ ఉత్సవంలో తెలంగాణ రాష్ట్రగవర్నర్ గౌ॥ డా॥ తమిళిసై సౌందరరాజన్,
తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.
























# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయం।
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః॥

**శ్లో :** యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యు: తన్మే క్షేమతరం భవేత్ ॥ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 45, 46వ శ్లోకాలు)

**ప్రతిపదార్థం:** అహో= అయ్యో!; బత= ఎంత దారుణం!!; వయం= మనము; మహత్ పాపం= మహాపాపమును; కర్తుం= చేయడానికి; వ్యవసితాః= పూనుకున్నాం; యత్= ఏదైతే; రాజ్యసుఖలోభేన= రాజ్యసుఖలోభంతో; స్వజనం= బంధువులను; హంతుం= చంపుటకు; ఉద్యతాః= పూనిన వారమైయ్యాం; యది= ఒకవేళ; అశస్త్రం= నిరాయుధుడైనట్టి; అప్రతీకారం= ప్రతీకారం చేయనట్టి; మాం= నన్ను; శస్త్రపాణయః= శస్త్రధారులైన; ధార్తరాష్ట్రాః= దుర్యోధనాదులు; రణే= యుద్ధంలో; హన్యుః= చంపినప్పటికీ; తత్ మే= అది నాకు; క్షేమతరం= క్షేమమే; భవేత్= అవుతుంది.

**భావం:** అయ్యో! మనం రాజ్యసుఖలోభంతో బంధువులను చంపటానికి పూనుకొన్నవారమై,ఈ మహాపాపానికి ఒడిగట్టుచున్నాము– ఇది ఎంత దారుణం? ఎదిరించకుండా, నిరాయుధుడై ఉన్న నన్ను శస్త్రధారులైన దుర్యోధనాదులు చంపినా చంపవచ్చు గాక! అది నాకు మిక్కిలి క్షేమకరమే అవుతుంది.

---

## మిన్నక వేసాలుమాని మేలుకో స్వామి!


మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీయోగనిద్ర చాలు మేలుకోవయ్యా

ఆవులు పేయలకుఁగా నఱచీఁబిదుకవలె
గోవిందు డ యింక మేలుకొనవయ్యా
ఆవలీవలి పడుచు లాటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా

వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడఁ
గూడియున్నారిదే మేలుకొనయ్యా
తోడనే యశోద గిన్నెతోఁ బెరుగు వంటకము
యీడకుఁ దెచ్చి పెట్టె నిఁక మేలుకోవయ్యా

పిలిచీ నందగోపుఁడు పేరుకొని యదె కన్నుఁ
గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రిమీఁది బాలకృష్ణ
యిల మామాటలు వింటి విఁక మేలుకోవయ్యా

(సంపుటం-1, సంకీర్తన-374)



అన్నమాచార్యులవారు చెప్పిన సరళమైన ఈ మేలుకొలుపు కీర్తనలో శ్రీవేంకటేశ్వరుని బాలకృష్ణునిగా భావించి *"ఓ బాలకృష్ణా! ఊరకనే దొంగవేషాలు వేసి నిద్రపోయినట్లు నటిస్తున్నావు. యోగనిద్రపోతూనే లోకాలను గమనిస్తున్నావు. నిద్రచాలించి మేలుకో! ఆవులు వాటి దూడలకోసం అంబారావాలు చేస్తున్నాయి. దూడల్ని వదిలి వాటి కడుపు నిండాకగాని గోమాత పాలు మనం తాగరాదు. దూడల్ని వదలాలి కదా! లే నాన్నా! నిద్ర లే! నీవు ఎవరివి? గోవిందుడవు. ఇక మేలుకోవయ్యా! అక్కడ ఇక్కడ నీతోటి సహవాసగాళ్లు, పడుచుకుర్రాళ్లు నీతో ఆటలు మరిగి దోవకాచుకొని ఉన్నారు. పాపం పొద్దుపోయింది. నిద్రమేలుకో! రా!!*



*గోపవాడల్లోనుంచి గోపికలు నిన్ను పట్టుకుని, ముద్దుల్లో ముంచెత్తాలని, మూకుమ్మడిగా కూడియున్నారు. నిద్రమేలుకొనవయ్యా! నీకు నిద్రలేవగానే ఆకలేస్తుందనే గొప్ప ఆదుర్దాలో తనతో పాటు పెరుగు వంటకము ఇక్కడికే తీసుకువచ్చి నీకోసం నిరీక్షిస్తోంది మీ అమ్మ యశోద. మేలుకొనరాదా తండ్రీ!*

*అదిగో మీ నాన్న నందగోపుడు కన్నయ్యా! అని పేరుపెట్టి పిలుస్తున్నాడు. ఇకనైనా మేలుకో! నా మాట అబద్ధమైతే నీ కనుకొలుకుల లోంచి నీవే చూడు. శ్రీవేంకటాద్రి పై వెలసిన వేంకటకృష్ణుడవైన బాలకృష్ణా! మా మొరవిని నిద్రమేలుకొని మమ్మల్ని రక్షించు!" అని కీర్తిస్తున్నాడు.*

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

## ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.
తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న సప్తవర్ణ 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

సెప్టెంబరు, 2022 నుండి
'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక వెలలో మార్పు అమలులోకి వచ్చింది.
ఇది నూతన చందాదారులకు
మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.



### చందా వివరాలు

విడిప్రతి- రూ.20/-
సంవత్సర చందా- రూ.240/-
జీవిత చందా(12 సం॥లకు మాత్రమే)- రూ.2400/-
విదేశాలకు సంవత్సర చందా- రూ.1030/-




శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి!

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి!!

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
చందాకట్టండి! చందాకట్టించండి!!

వివరాలకు: ప్రధాన సంపాదకుడు,
తి.తి.దే.ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి-517 507.
ఫోన్: 0877-2264363, 2264543

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 డిసెంబరు, 2022 సంచిక : 07



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| తిరుమలలో తిరుప్పావై | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 07 |
| పరోపకారమే పరమావధి | శ్రీ కె.లక్ష్మీనారాయణ | 10 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ఈ.జి.హేమంతకుమార్ | 12 |
| పంచాయుధం శిరసా నమామి! | డా॥ అద్దంకి శ్రీనివాస్ | 15 |
| మహాయోగి గర్గ మహర్షి | సద్గురు డా॥ కె.శివానందమూర్తి | 18 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 21 |
| వేదార్థసాధనాలు 'వేదాంగములు' | ఆచార్య రేమిల్ల వేంకటరామకృష్ణ శాస్త్రి | 22 |
| తిరుకపిస్థలమ్ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| తిరుప్పావై సౌరభం | డా॥ ఎం.వేంకటాచార్యులు | 27 |
| తిరుప్పావైలో.. క్షేత్రాల ప్రశంస | డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు | 31 |
| వీరమాత 'విదుల' | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 34 |
| శ్రీకృష్ణామృతం.. | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 35 |
| కృత్తికా దీపోత్సవం | శ్రీ జె.అనిల్‌కుమార్ | 36 |
| శ్రీవేణుగోపాలస్వామివారిఆలయం,కార్వేటినగరం | శ్రీ ఇటుగుళ్లపాటి హర్షవర్ధన్ | 37 |
| యువతలో భక్తి-మౌలిక శక్తి | శ్రీమతి గంగవరం శ్రీదేవి | 39 |
| ధనం దాచుకోగూడదు (విశ్వదాభిరామం) | కీ.శే. విద్వాన్ కట్టానరసింహులు | 40 |
| తిరుమంగై-తిరుప్పాణ్-తొండరడిప్పొడి ఆళ్వార్ల రచనావిశిష్టత | శ్రీమతి ఈ.విజయలక్ష్మి | 41 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 43 |
| చేయూత ఇచ్చిన శ్రీనివాసుడు | శ్రీ పంగులూరి శేషగిరిరావు | 44 |
| సర్వకార్యానుకూలతను ప్రసాదించే 'హనుమద్వ్రతం' | శ్రీమతి కె.విజయలక్ష్మి | 46 |
| తిరుప్పావై జీయర్ (చిత్రకథ) | కథ: డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| అతడికి నువ్వేమి ఇవ్వగలవు? | శ్రీమతి వి.స్వర్ణలత | 50 |
| బాలవినోదం } | నిర్వహణ- డా॥ ఏ.సంధ్య | 51 |
| క్విజ్ (05) } | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : గోదాదేవి అలంకారంలో గోవిందుడు, తిరుమల
వెనుకచిత్రం : పార్థసారథిగా శ్రీనివాసుడు, తిరుమల


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ ఏ.సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.


24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333




వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# సాధనలకు ఫలితమిచ్చే 'ధనుర్మాసం'

'మాసానాం మార్గశీర్షాహం' అంటాడు కృష్ణభగవానుడు. మార్గశీర్షం అంటే మార్గాలలో శ్రేష్ఠమైనదనీ, ఉపయోగకరమైనదనీ అర్థం. మార్గశీర్ష మాసానికే మరొక పేరు 'ధనుర్మాసం'.

ముక్తికి మార్గం... మార్గశిరం. శ్రీమన్నారాయణుడి ఆరాధనతోపాటు పలు పర్వదినాల సమాహారం మార్గశిర మాసం. మహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైన ఈ మాసంలో చేసే లక్ష్మీపూజలూ, ఉండే ఉపవాసాలతో సకల శుభాలు కలుగుతాయని చెబుతున్నాయి శాస్త్రాలు. కార్తికేయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడుతోపాటూ భగవద్గీత అవతరించిన మాసం కూడా ఇదే కావడం విశేషం.

ఉత్తరాయణ ప్రారంభమైన మకరసంక్రాంతికి ముందు, దక్షిణాయనానికి చివర వచ్చే 'ధనుర్మాసం'– 'సంవత్సరానికి తెల్లవారుజాము'లాంటిది. 'ధనువు' అంటే యోగశాస్త్ర పరిభాషలో "వెన్నెముక". అంటే ఇది ఒక యోగసాధన. ధ్యానమే ధనుర్మాసవ్రతం. ధనుర్మాసవ్రతాన్ని ఆచరించింది విష్ణుచిత్తుని దత్తపుత్రిక 'ఆండాళ్'. తమిళంలో 'కోదై' అనే పేరుపొందిన ఈ తల్లి 'గోదాదేవి'గా విఖ్యాతి చెందిన భూమాత అవతారం. ఈ నెల రోజులూ గోదాదేవి పాడిన పాటలే 30 పాశురాలుగా 'తిరుప్పావై' దివ్యప్రబంధంగా ప్రసిద్ధం.

ధనుర్మాసం ఆచరించే 30 రోజులూ గోదాదేవి బ్రాహ్మీమయ ముహూర్తంలో నిదురలేచి, తోటి స్నేహితురాండ్రను నిదురలేపుతూ, అందరితో కలసి స్నానమాడి, కృష్ణకీర్తనతో, కృష్ణధ్యానంతో ఆయనతో కలసిపోయే లక్ష్యంగా సాగించిన వ్రతమే **'తిరుప్పావై' (శ్రీవ్రతం)**.

తోటి స్నేహితురాండ్రను మేల్కొలపడం అంటే మనలోని భక్తిభావాలను, సాత్త్విక ప్రవృత్తులను జాగృతం చేసి, ఏకీకృతం చేయాలి. వారందరితో కలసి స్నానమాచరించడం అంటే భగవద్భావనలో, సంకీర్తనలో మన భావాలన్నీ మునకలు వేయాలి. ఓలలాడాలి. గోదాదేవి పాశురాలను పరికిస్తే– జాగృతమైన భావనలన్నీ కలసి అంతరంగధామంలోనున్న పరమాత్మ చైతన్యాన్ని ఆవిష్కరించుకొని తాదాత్మ్యం చెందడమనే సాధనక్రమం, సిద్ధి కనిపిస్తాయి. మన తిరుమల శ్రీవారిఆలయంలో కూడా ఈ ధనుర్మాసంలో ఆండాళమ్మ సాయించిన తిరుప్పావైను 30 రోజులు సుప్రభాతసేవకు బదులుగా అనుసంధానం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది.

ఇక సర్వమానవాళికి వ్యక్తిత్వ వికాసాన్ని బోధించే తరగని గని 'గీత'. స్వయంగా శ్రీకృష్ణుని ముఖతః వెలువడిన 'గీత' మార్గశిర శుద్ధ ఏకాదశినాడే వెలుగు చూసిందని ఆర్యోక్తి. అందుకే మార్గశిర శుద్ధ ఏకాదశికి **'గీతాజయంతి'** అని పేరు. ఈ వేళ భగవద్గీతను పారాయణం చేయడం లేదా అందులోని కొన్ని శ్లోకాలను కంఠస్థము చేసి వాటిలోని సారాన్ని గ్రహించే ప్రయత్నం చేయడం ఫలప్రదం.


ఈ మాసంలోనే త్రిమూర్తుల అంశావతారం, అత్రి– అనసుయాదేవిల పుత్రుడు అయిన దత్తాత్రేయుని జయంతి కూడా. కేవలం స్మరణ మాత్రాన ప్రసన్నుడయ్యే దత్తాత్రేయుడు ఆర్తత్రాణ పరాయణుడు, భక్త సులభుడు. దత్తజయంతినాడు అతని నామస్మరణ చేయడం సత్ఫలితాలనిస్తుంది. ఈవిధంగా ఆయా పండుగలు, పర్వదినాల వైశిష్ట్యాన్ని, ప్రాశస్త్యాన్ని గ్రహించి, అనువైన వాటిని సాధన చేసి ఆచరించడం శ్రేయోదాయకం, ముక్తిదాయకం.

*ఓం నమో వేంకటేశాయ*

సంపాదకీయం

# తిరుమలలో... తిరుప్పావై

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం



ఆర్తత్రాణ పరాయణుడైన ఘనవేంకటగిరిపతికి ప్రతినిత్యం సుప్రభాతం మొదలుకొని, ఏకాంతసేవవరకు నిత్యోత్సవాలు జరుగుతాయి. ఇవేగాక వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా తిరుమల స్వామివారికి జరుగుతాయి.

ఇలా ఎన్నో సేవలు జరుగుతున్నప్పటికీ ప్రతిదినం శ్రీవేంకటేశ్వరస్వామి వారి దినచర్య "*కౌసల్యా సుప్రజారామా! పూర్వా సంధ్యా ప్రవర్తతే*" అను సుప్రభాతస్తవంతోనే ప్రారంభమవుతుంది. అయితే ఏడాదిలో **'ధనుర్మాసం'** ఒక్క నెలరోజుల పాటుమాత్రం తిరుమల స్వామివారికి సుప్రభాతానికి బదులుగా గోదాదేవి (ఆండాళ్) కీర్తించిన **"తిరుప్పావై"** పఠనం జరుగుతుంది. ఈ ధనుర్మాసం సాధారణంగా మార్గశిర, పుష్యమాసాల్లో వస్తుంది. అంటే సౌరమానం ప్రకారం డిసెంబరు 15 లేదా 16 తేదీతో ప్రారంభమై జనవరి 14 లేదా 15న ముగుస్తుంది.

తమిళసాహిత్యంలో నాలుగువేల పాటలు (పాశురములు) గల "నాలాయిర దివ్యప్రబంధం" చాలా ప్రసిద్ధమైంది. దీనిని వైష్ణవ భక్తాగ్రేసరులయిన పన్నెండుమంది ఆళ్వారులు చెప్పారు. వీరినే 'దివ్యసూరు'లనీ, 'పరమయోగు'లనీ అంటారు. తమిళ శ్రీవైష్ణవ సాహిత్యంలో ఈ పరమయోగులు పరవశించి పాడిన పాశురప్రబంధాలు వేదాలవలె అత్యంత పవిత్రమైనవిగా పరిగణన పొందుతున్నాయి. అందులో **"తిరుప్పావై"** అనే ముప్పది పాశురముల కర్త **గోదాదేవి**. ఈమె 'పెరియాళ్వారు' అని ప్రసిద్ధి పొందిన విష్ణుచిత్తుని పెంపుడుబిడ్డ, తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరులోని వటపత్రశాయి అయిన శ్రీమహావిష్ణువునకు విష్ణుచిత్తుడు కైంకర్యం చేస్తున్న పూలమాలల్ని ముందుగా తాను ధరించి, మళ్లీ వాటినే స్వామివారి కైంకర్యానికి పంపినందు వల్ల, ఈమెకు "ఆముక్తమాల్యద" అని "చూడికొడుత్త నాచ్చియార్" అని ప్రసిద్ధమైన పేర్లు వచ్చాయి. ద్వాపర యుగంలో శ్రీకృష్ణభగవానుణ్ణి భర్తగా పొందవలె ననే ఉద్దేశంతో గోపికలు కాత్యాయనీవ్రతాన్ని మార్గశిరమాసంలో చేశారు. అలాగే, గోదాదేవి కూడా తనను తాను గోపికగా భావించుకొని ధనుర్మాసంలో (మార్గళి) ఆ వ్రతాన్ని భక్తితో ఆచరించింది. నెల రోజులపాటు ప్రతిదినం వేకువజామునే శ్రీవిల్లిపుత్తూరులో వేంచేసియున్న వటపత్రశాయి అయిన శ్రీమహావిష్ణువును గూర్చి రోజుకొక్కపాశురాన్ని పరవశించి పరమగానం చేసింది. ఈ వ్రతం ముప్పైరోజులపాటు చేసి చివరకు శ్రీరంగనాథుణ్ణి పరిణయమాడి **"ఆండాళ్"**గా ప్రసిద్ధి పొందింది. 'ఆండాళ్' అనగా భగవంతుణ్ణి వశం చేసుకొన్న స్త్రీ అని అర్థం. **'కోదా'** అంటే మాలిక. పాశురములనే మాలికలచేత భగవంతుని కీర్తించినది గనుక

**ధనుర్మాస ప్రత్యేకం**

'ఆండాళ్' అనగా భగవంతుణ్ణి వశం చేసుకున్న స్త్రీ అని అర్థం

ఆమె **'గోదాదేవి'**. ఆనాటి నుండి ప్రతి ధనుర్మాసంలో శ్రీరంగం లోనే గాక వైష్ణవాలయాలన్నిటిలోను తిరుప్పావైపఠనం అనూచానంగా వస్తున్నది.

ఆళ్వారులు చాలామంది దర్శించి కీర్తించిన ప్రధాన వైష్ణవక్షేత్రాల్లో తిరుమల చాలా ప్రసిద్ధమైంది. పొయ్‌గై ఆళ్వారు, తిరుమళిశైఆళ్వారు, నమ్మాళ్వారు మున్నగువారు శ్రీవేంకటాచలపతిని దర్శించి అనేక రీతుల కీర్తించి గానం చేశారు.

ఏకైక స్త్రీ ఆళ్వారుగా ప్రసిద్ధి పొందిన ఆండాళ్ కూడా తిరుమలప్పను దర్శించి–

**"వెయ్యదోర్ తళలు మిళ్ శక్కెరక్కై**
**వేంగడ పర్సైన్ని విదికిత్తియే"**

వేయి వెలుంగులతో ప్రకాశిస్తున్న శంఖచక్రాలను ధరించిన తిరువేంకటపతికి నేను పూర్తిగా అంకితమైనానని "నాచ్చియార్ తిరుమొళి"లో విన్నవించుకుంది. గోదాదేవి చెప్పిన ఈ అంకితభావాన్ని దృష్టిలో ఉంచుకుని భగవద్రామానుజుల వారు తిరుమల–తిరుపతి ఆలయాల్లో "తిరుప్పావై" పఠనను ప్రతి ధనుర్మాసంలో అనుష్ఠింపజేశారు. గోదాదేవి అన్నా, ఆమె చెప్పిన 'తిరుప్పావై' అన్నా రామానుజాచార్యులకు అత్యంత భక్తి ప్రపత్తీ కూడ.

## సర్వవేదాలసారం

ఆండాళ్ పాడిన 'తిరుప్పావై' సర్వవేదాలసారమనీ, ఆండాళ్ సాక్షాత్తు లక్ష్మీదేవియనీ, ఆమె చెప్పిన పాశురాలతో, మనమంతా గోపికలమని భావించి పురుషోత్తముడైన శ్రీకృష్ణుణ్ణి కీర్తించినట్లయితే సంపత్కరములైన సర్వశుభములు కలుగునని వ్యాఖ్యానించి ప్రచారం చేసినందువల్ల శ్రీభగవద్రామానుజుల వారికి **"తిరుప్పావై జీయర్"** అనే ప్రసిద్ధి ఏర్పడింది.

తిరుమలక్షేత్రంలో శ్రీస్వామివారి సుప్రభాతానికి బదులుగా ధనుర్మాసంలో నెలరోజులపాటు రోజుకొక్క పాశురంగా **"తిరుప్పావై"** పఠనను అనుష్ఠింపజేయడమేగాక ఆ ధనుర్మాసంలోనే గోదానీరాట్టోత్సవాన్ని, సంక్రాంతి పండుగ మరునాడు కనుమ పండుగరోజు శ్రీగోదాకల్యాణాన్ని ఏర్పాటు చేసినవారు భగవద్రామానుజులవారే. అంతేగాక నాటి నుంచి ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవంలో



గరుడోత్సవంనాటికి తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరునుండి గోదాదేవికి ధరింపచేసిన పూలమాలను తెచ్చి తిరుమలస్వామివారికి ధరింపజేయడమనే సంప్రదాయం నేటికీ కొనసాగుతున్నది.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి వైఖానస ఆగమం ప్రకారం పూజలు జరుగుతాయి. ధనుర్మాసంలో శ్రీస్వామి వారి వక్షఃస్థలంలోగల లక్ష్మీదేవిని ఆండాళ్‌గా భావించి అలంకరిస్తారు. ఎర్రనిరాళ్ళు పొదిగిన బంగారుచిలక బొమ్మను వక్షఃస్థలంలోని అమ్మవారికి అమరుస్తారు. అలాగే స్వామివారి హృదయంలో ఎడమపార్శ్వంలో పూలతో తయారుచేసి చిలుక బొమ్మను అమరుస్తారు. ఈ నెలంతా తెల్లవారుజామున ఆండాళ్– తిరుప్పావును పఠిస్తారు. తదనంతరం స్వామివారికి తోమాలసేవ, అర్చన, ఆరగింపు జరిగిన తర్వాత ఆనాటి పాశురాన్ని రెండుమార్లు చెప్తారు. ధనుర్మాసం ముప్పైరోజులు శ్రీవేంకటేశ్వరస్వామిని శ్రీకృష్ణునిగా భావించి అర్చిస్తారు. అన్ని ప్రధాన పూజా నివేదనలన్నీ శ్రీకృష్ణస్వామి విగ్రహానికే అర్పిస్తారు. ఈ నెలంతా ప్రతి రాత్రి శ్రీకృష్ణస్వామి విగ్రహానికి వేడినీటితో అభిషేకంచేసి, అలంకరించి ఏకాంత సేవాభాగ్యాన్ని కలుగజేస్తారు. బెల్లపుదోసె, పొంగలి, చక్కెరపొంగలి వగైరా ప్రసాదాలు నివేదిస్తారు.

ధనుర్మాసం ప్రవేశించిన వెంటనే తిరుమలలో ఆలయ శుద్ధి జరిగిన తర్వాత ధనుర్మాసపు పూజ, శ్రీస్వామివారికి అర్చన, నివేదన అనంతరం తొలి పాశుర పారాయణ చేస్తారు. ఇలా రోజుకొకటివంతున ముప్పై పాశురాలు ముప్పైరోజులు వరుసగా పఠిస్తారు.

ఇలా, ఈ ధనుర్మాసంలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని శ్రీకృష్ణునిగాను, ఆయన వక్షఃస్థలంలోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని శ్రీగోదాదేవిగాను భావించి, ఈ నెలంతా రోజుకొక్క పాశురంగా "తిరుప్పావై"ని వినిపిస్తారు. ఈ "తిరుప్పావై"-

పాతకజ్గళ్ తీర్కుమ్ పరమనడి కాట్టుమ్
వేదమనైత్తుక్కుమ్ విత్తాహుమ్- కోదై తమిళ్
ఐయ్యైన్దుమ్ ఐన్దుమ్ అరియాద మానిడరై
వైయ్యమ్ సుమప్పదుమ్ వమ్బు

సర్వవేదాలసారం కలిగి బీజప్రాయమైన ఈ "తిరుప్పావై పారాయణ" మహాపాతకాలను నశింపజేసి, భగవంతునిదరికి నడిపిస్తుంది. అంటే మోక్షాన్ని కలిగిస్తుంది. అందరికి అర్థమయ్యేలాగ సరళమైనభాషలో రచించిన ఈ ముప్పదిపాశురాల "తిరుప్పావై"ని గూర్చి తెలియని మానవుడు ఉండడు. ఒకవేళ తెలియనివాడు ఎవడైనా ఉన్నట్టయితే, వానిని భరించడానికి భూదేవి చాల వేదన పడుతుందని పై పాటకు అర్థం.

## తిరుప్పావై మహిమ

పూర్వం శివభక్తుడైన ఉగ్రాస్యుడనే రాజు "తిరుప్పావై" పఠనజేసి శంకరదత్తుడనే పుత్రుణ్ణి పొందుతాడు. జన్మతో శైవుడైన శంకరదత్తుడు విష్ణుద్వేషియై, వైష్ణవరాజైన వైకుంఠనగర రాజు గోవిందునిపైకి దండెత్తి, విధివశాత్తు ఓడిపోతాడు.

శంకరదత్తుడు దిక్కుగానక తిరుగుతూ, తిరుమలక్షేత్రం చేరి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించి, అక్కడి పాండవతీర్థంలో ఒక వైష్ణవ ఆచార్యునిచే వైష్ణవమతాన్ని స్వీకరించి, "వేంకటదాసు"గా పేరు మార్చుకుంటాడు. గురువుగారి ఆనతిపై వేంకటదాసు ఒక సంవత్సరంపాటు 'తిరుప్పావై'ని నిత్యం తిరుమలలో పారాయణం చేస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామి సంతృప్తి చెంది, గోవిందుని కలలో కనపడి ఇతనిరాజ్యం ఇతనికి ఇప్పిస్తాడు. అప్పటి నుంచి గోవిందుడు, వేంకటదాసు (శంకరదత్తుడు) ఇద్దరూ తిరుప్పావై మహిమను అనేక విధాలుగా ప్రచారం చేశారని "గురుపరంపరా ప్రభావం" అనే తమిళ గ్రంథంలో పేర్కొనబడింది.

తిరుమలకు- తిరుప్పావునకు అత్యంత సన్నిహిత సంబంధాన్ని తెలిపే ఈ ప్రాచీన గాథ "తిరుప్పావై" మహిమను వేనోళ్ల చాటుతూ ఉంది. శ్రీలక్ష్మీదేవి స్వరూపురాలైన శ్రీగోదాదేవి రచించిన "తిరుప్పావై"స్తుతిని భక్తిపూర్వకంగా నిత్యమూ పారాయణ చేసి తిరుమల గోవిందుడైన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి అనుగ్రహానికి పాత్రులై ఇష్టార్థాల్ని పొందగలరుగాక!

గోదాదేవి ఉపదేశించిన ఈ "తిరుప్పావు" వ్రతమే ఆంధ్రదేశంలో రూపాంతరం చెంది "గొబ్బిళ్లు"గా తెల్లవారు జామున ఇదే మాసంలోనే కన్యలచేత ఆచరింపబడుతున్నదని పండిత ప్రభాకరులు కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అభిప్రాయం. తెలుగు సాహిత్యంలో "మేలినోము" అనీ, "సిరినోము" అని, "సువ్రత"మనీ 'తిరుప్పావు'ను పండితులు తెనిగించారు, వ్యాఖ్యానించారు.

*శ్రీగోదాచరణౌ శరణం ప్రపద్యే*

## చక్రతీర్థముక్కోటి ఉత్సవం

**తిరుమలక్షేత్రం ఏన్నోతీర్థాలకు, పుష్కరిణిలకు నిలయము. అలాగే చక్రతీర్థం అనే పవిత్రతీర్థం తిరుమలకు వాయవ్యమూలంలో సుమారు 5 కి.మీటర్ల దూరంలో వుంది. ఈ తీర్థంలో శ్రీసుదర్శన భగవానులు, శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీఆంజనేయస్వామి విగ్రహ మూర్తులు అక్కడి కొండకు మలచబడి ఉన్నాయి. గతంలో ఎందరో రాక్షసులను సంహరించిన సుదర్శన భగవానుడు నేటికీ ఈ తీర్థంలో తేజోరూపంతో తిరుగుతూ ఉంటాడని పురాణప్రసిద్ధి. ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం వృశ్చికమాసం అనగా మార్గశిరమాసం శుద్ధ ద్వాదశి రోజున శ్రీవారి ఆలయంలో చక్రతీర్థముక్కోటి ఉత్సవం జరుగుతుంది. ఆనాడు శ్రీవారి ఆలయంలో ఉదయం, మధ్యాహ్నం నాటి పూజలు, నివేదనలు పూర్తి అయిన తర్వాత శ్రీవారి ఆలయం నుండి అర్చకులు, వేదపండితులు, అధికారులు, మంగళవాయిద్యాలతో పూజాద్రవ్యాలతో, శ్రీచక్రతీర్థం చేరుకుంటారు.**



**అక్కడ వేంచేసి ఉన్న శ్రీసుదర్శన భగవానునికి శ్రీలక్ష్మీనరసింహస్వామికి, ఆంజనేయస్వామికి అభిషేక అర్చన, అలంకార, నివేదనలు ఘనంగా నిర్వహించిన పిదప అక్కడ చేరిన భక్తులందరికీ ప్రసాదవితరణ చేస్తారు.**

# పరోపకారమే పరమావధి

– శ్రీ కె.లక్ష్మీనారాయణ

మనకు లభించిన సిరిసంపదలు, శక్తియుక్తులు, ఇంకా... ఇతర సామర్థ్యాలు కానీ, శక్తులు కానీ... ఏమైనా సరే, వాటిని ప్రజాశ్రేయస్సుకు, పరోపకారానికి మాత్రమే వినియోగించాలి. అలాకాకుండా, తన శక్తికి తానే మురిసిపోతూ, గర్వంతో కన్నుమిన్ను చూడకుండా ప్రవర్తించేవారికి గర్వభంగం తప్పదు. ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించే సందర్భం మహాభారతంలో ఉంది.

కృష్ణపరమాత్మ పాండవుల రాయబారిగా హస్తినాపురానికి వచ్చి, యుద్ధం వల్ల నష్టమే తప్ప లాభం లేదని చెబుతూ, పాండవులతో సంధి చేసుకోవాలని సలహా ఇస్తాడు. అందుకు దుర్యోధనుడు ఏమాత్రం అంగీకరించకపోవడంతో కృష్ణుడు యుద్ధం తప్పదంటూ వెనక్కి వెళ్ళిపోతాడు. ఈ సందర్భంలో దుర్యోధనుడిని కలుసుకున్న పరశురాముడు, జరిగిన విషయం అంతా తెలుసుకుంటాడు. దుర్యోధనుడికి ఎలాగైనా నచ్చజెప్పి, యుద్ధాన్ని నివారించాలని ప్రయత్నం చేస్తాడు.

అప్పుడు పరశురాముడు దుర్యోధనుడితో ఇలా అంటాడు. "నాయనా దుర్యోధనా! నీకు, నీ వారికి మేలుచేసే కథ చెబుతాను. జాగ్రత్తగా విను... అంటూ కథ చెప్పటం ప్రారంభిస్తాడు.

పూర్వం దంభోద్భవుడు అనే పేరుగల రాజు ఉండేవాడు. భుజబలంలో కానీ, పరాక్రమంలో కానీ అతడికి సాటిరాగల వారెవరూ లేరు. అంతగొప్ప పరాక్రమశాలిగా పేరుపొందాడు దంభోద్భవుడు. అతడు రోజూ ఉదయాన్నే లేచి, కాలకృత్యాలు ముగించి, బాగా అందంగా అలంకరించుకుని, రత్నకిరీటం ధరించి, కోడెత్రాచు వంటి ఖడ్గాన్ని చేతితో పట్టుకుని, సభకు వచ్చి తన సింహాసనం మీద కూర్చొనేవాడు.

వందిమాగధులు తన బలపరాక్రమాలను కీర్తిస్తుంటే విలాసంగా వింటూ దంభోద్భవుడు ఆనందించేవాడు. రోజూ సభాసదులను చూస్తూ "ఈ భూలోకంలో ఎవడైనా నాతో యుద్ధం చేయగల మహావీరుడున్నాడా? గదా ఖడ్గ ప్రాసాది ఆయుధాలతో కానీ, ఆగ్నేయ, వారుణ, వాయవ్యాది అస్త్రాలతో కాని నన్ను ఎదుర్కోగల వీరుడుంటే చెప్పండి. అంతేకాదు మల్లయుద్ధం చేయగల వీరుడున్నా వాడిని ఇట్టే కడతేరుస్తాను" అంటూ బలగర్వంతో విర్రవీగేవాడు. అయితే దంభోద్భవుడి బలపరాక్రమాలు తెలిసిన రాజులెవ్వరూ అతడితో యుద్ధానికి దిగేవారు కాదు. దీంతో దంభోద్భవుడిలో అహంకారం రోజు రోజుకీ పెరుగుతూవచ్చింది. దానికితోడు అనుచరులు కూడా అనుక్షణం దంభోద్భవుడి బలం గురించి పొగుడుతూ ఆ గర్వాన్ని మరింత పెంచారు.

ఒకరోజు దంభోద్భవుడి దర్బారుకు దూరదేశం నుండి కొందరు విప్రులు వచ్చారు. వారు ఈ తతంగమంతా చూసి, "మహారాజా! మీరు నిజంగా మహావీరులు, బలపరాక్రమ సంపన్నులు అయితే గంధమాదన పర్వతం మీద నరనారాయణులనే ఇద్దరు వ్యక్తులు నియమనిష్ఠలతో తపస్సు చేసుకుంటున్నారు. వారిని జయించగల వీరులు మూడు లోకాల్లో లేరని విన్నాం. తమకు యుద్ధం చేయాలనే కోరికగా ఉంటే వారితో యుద్ధం చేయవచ్చు" అన్నారు.

విప్రుల నోట తనకంటే వీరుల గురించి మాట వినబడగానే దంభోద్భవుడికి పట్టరాని కోపం వచ్చింది. "నన్ను మించిన వీరులా" అంటూ కత్తి ఝళిపించి యుద్ధానికి సన్నద్ధమయ్యాడు. సేనలతో సహా 'గంధమాదన పర్వతం' చేరుకున్నాడు. ప్రశాంతమైన వాతావరణంలో తపస్సు చేసుకుంటున్న నరనారాయణులను చూసి తొడగొట్టి, యుద్ధానికి పిలిచాడు. అయితే నరనారాయణులు తమ ఆశ్రమానికి వచ్చిన రాజుకు అతిథిసత్కారాలు జరుపబోయారు. "అవన్నీ అనవసరం యుద్ధం... యుద్ధం" అని అట్టహాసం చేశాడు దంభోద్భవుడు.


రాజు మాటలనువిన్న నరనారాయణులు "మహారాజా... ఎవరితోనూ సంబంధంలేకుండా, కళ్ళు మూసుకుని ఈ ప్రశాంత ప్రదేశంలో తపస్సు చేసుకునే మునులం. మాతో



రాజు ప్రజల శ్రేయస్సే పరమావధిగా రాజ్యాన్ని పరిపాలించాలి

యుద్ధం చేయాలనే కోరిక నీకెందుకు కలిగింది'' అన్నారు. అయినా, రాజు మునుల మాటలను వినలేదు. తనతో యుద్ధం చెయ్యాల్సిందే అంటూ పట్టు బట్టాడు. విల్లు ఎక్కుపెట్టాడు. రాజు గర్వాన్ని గ్రహించిన నరుడు నవ్వుతూ, ఒక దర్భను తీసుకుని, "ఇదిగో రాజా... ఈ గడ్డిపరక ఒక్కటి చాలు. నీ సైన్యాన్ని నిలబెడుతుంది" అంటూ వదిలాడు.

ఆ రాజు బాణవర్షం కురిపించాడు. ఆ గడ్డిపరక అన్ని బాణాలనీ ముక్కలు ముక్కలు చేసింది. సైనికులందరూ ముక్కులూ చెవులూ తెగిపోయి బాధతో తీవ్రంగా అరవటం ప్రారంభించారు. రాజుకి తల తిరిగింది. సేనలు పలాయనం ప్రారంభించాయి. అది చూసిన రాజుకి గుండె జారింది. వీరు సామాన్యులు కాదని గ్రహించిన రాజు ఆయుధాలు కింద పడేసి, నరనారాయణులపాదాలపై వాలిపోయాడు. "ఆర్యా! నన్ను క్షమించి అనుగ్రహించండి. నా గర్వం తొలగిపోయింది. నన్ను క్షమించండి" అంటూ దీనంగా ప్రార్థించాడు.




అప్పుడు నరనారాయణులు నవ్వుతూ "మహారాజా! సిరి సంపదలు కలిగినవారు పేదసాదలకు దానధర్మాలు చేసి గొప్పవారు కావాలి. అలాగే, బలపరాక్రమాలు ఉన్నవారు దుర్మార్గుల బారినుండి సజ్జనులను రక్షించడానికి తమ శక్తిని ఉపయోగించాలి. అంతేకాని అహంకారంతో విర్రవీగడం మంచిది కాదు. ఇరుగు పొరుగులకు ఉపకారం చెయ్యనివాడి జన్మ వ్యర్థం" అంటూ ఉపదేశించారు.. దీంతో దంభోద్భవుడు తన అహంకారం విడిచిపెట్టి, ప్రజల శ్రేయస్సే పరమావధిగా రాజ్యాన్ని పరిపాలించాడు. అనేక దానధర్మాలు చేస్తూ కాలానికి అతీతమైన కీర్తి సంపాదించాడు. కాబట్టి, దుర్యోధనా! నువ్వు కూడా నీ అనుచర గణం చేస్తున్న పొగడ్తలకు లొంగిపోవద్దు. వాస్తవాన్ని గమనించు. అహంకారం, బలగర్వం ఎప్పటికీ నిలిచేవి కావు. అవి మనల్ని నాశనం చేసే తీయని కత్తులు..." అంటూ పరశురాముడు దుర్యోధనుడికి నీతి బోధించాడు.

ఈ బోధనలు అప్పటికీ, ఎప్పటికీ మంచిమాటల మూటలు. మహాభారతం కేవలం కథల సమాహారం మాత్రమే కాదు. కథల చాటున మనకు నీతిధర్మాలను బోధించే సద్గురువు. అందుకు భారతాన్ని చదివి విడిచిపెట్టకుండా, అందులోని నీతిని, ధర్మాన్ని ఆచరించే ప్రయత్నం చేద్దాం.

# శ్రీమద్భగవద్గీత

## 18వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్



ధారావాహిక

*అక్టోబరు, 2022 సంచిక తరువాయి భాగం...*

న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః।
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే॥ 11

పరంతపా! పార్థా! దేహధారియైన జీవుడెవడూ ఏ పనీ చేయకుండా ఉండలేడు. సర్వకర్మలను చేస్తూ కర్మఫలాన్ని విడిచిపెట్టగలవాడే 'త్యాగి' అని పిలువబడుతున్నాడు. ఇష్టం, అనిష్టం, ఇష్టానిష్టం అని కర్మ మూడువిధాలు. కర్మఫలమూ అంతే. సమస్తకర్మలూ చక్కగా నెరవేరటానికి ఐదుకారణాలను సాంఖ్యసిద్ధాంతం ప్రతిపాదిస్తున్నది. అవి 1)శరీరం 2)జీవాత్మ 3)కరణాలు లేక పరికరాలు 4)చేష్టలు 5)దైవం. జీవుడు త్రికరణాలతో (మనస్సు, వాక్కు, శరీరం) చేసే ఏ కర్మకయినా ఈ ఐదే కారణాలు. కార్యం చేయాలని తెలుసుకొన్నవాడు ఆత్మను కర్తగా తలుస్తున్నాడు. అట్టివానికి మిగతా మూడూకూడా సాధనాలుగా ఉపకరిస్తున్నాయి. మొదటి నాల్గుకారణాలున్నప్పటికీ ఐదవదైన భగవత్సంకల్పం లేకుండా ఏ కార్యమూ జరుగదనే విషయాన్ని మరవకూడదు. నేను కర్తను అనే అహంకారాన్ని విడిచి ఫలాన్ని కోరనివాడు ఎందర్ని సంహరించినా వాడు చంపనివాడే. వానికే పాపం కల్గదు. నీవటువంటివాడవు. కనుక యుద్ధం చెయ్యి. కర్మాచరణకు ముందు మానసికజ్ఞానం అవసరం. అది లేకపోతే కర్మ చెయ్యటానికి సాధ్యంకాదు. మనసులోని ఆలోచనల్ని క్రియారూపంలో పరిణమించడానికి చేసే వ్యాపారాల్ని కర్మలంటాము. అర్జునా! జ్ఞానం, కర్మ, కర్త అనేవి గుణప్రాధాన్యాన్ని బట్టి మూడువిధాలుగా చెప్పబడింది. వాటి స్వరూపాన్ని ప్రత్యేకలక్షణాలను నీకిపుడు వివరిస్తాను.

సకలప్రాణులలోని ఆత్మ ఒక్కటే. అదినిత్యంగా ఉంటుందనే జ్ఞానమే సాత్త్వికజ్ఞానం. ఆవిధంగాకాకుండా వేరువేరు ప్రాణుల్లోని ఆత్మలను వేరువేరుగా ఉంటుందని గ్రహించడమే రాజసజ్ఞానం. పరమాత్మ ఒక్కడే అనే జ్ఞానంలేకుండా, శరీరాన్నే ఆత్మ అనుకోవడం తామసజ్ఞానం.

ధర్మబద్ధంగా, రాగద్వేషాలులేకుండా, ఫలాపేక్ష లేకుండా చేయబడే కర్మ సాత్త్వికకర్మ. ఏదో ఒక ఫలాన్ని కోరి, అహంకారంతో, చాలా క్లేశాలుపడుతూ చేసే కర్మ రాజసకర్మ. తన శక్తిసామర్థ్యాలను తెలుసుకోకుండా, అనాలోచితంగా, అజ్ఞానంతో చేసే కర్మ తామసకర్మ అవుతుంది.

జ్ఞానం, కర్మ త్రివిధాలైనట్లుగానే కర్తకూడా మూడు మార్గాలలోను ఉంటాడు. నేను చేస్తున్నాననే కర్తృత్వాహంకారం లేకుండా, సంతోష, శోకాలకు లొంగకుండా, లాభాన్ని ఆశించకుండా, కార్యం సిద్ధించినా, సిద్ధింపకున్నా మనసు చలింపనివాడు 'సాత్త్వికకర్త'.

పేరు ప్రతిష్ఠలకోసం కర్మఫలాపేక్షతో అపవిత్రుడై ఇతరులను హింసించే స్వభావంకలవాడు, సుఖదుఃఖాలకు బందీ అయినవాడు 'రాజసకర్త'.

ఏ నీతినియమాలు లేనివాడు, చపలచిత్తుడు, వంచకుడు, వివేకరహితుడు, ఎప్పుడూ విషాదంతో ఉండేవాడు, పేరాశతో పనిచేసేవాడు 'తామసకర్త'.

ధనంజయా! ఈవిధంగానే బుద్ధియందు, ధైర్యమునందూకూడా మూడుగుణాలచే భేదాలున్నాయి. వాటిని వేర్వేరుగా విపులీకరిస్తాను. విని తెలుసుకో.

ఏ బుద్ధి ధర్మమందు ప్రవృత్తిని, అధర్మమందు నివృత్తిని పొంది ఉండి, చేయదగినపనులు, చేయకూడని పనులు,

భయపడవలసినవి, నిర్భయంగా ఉండవలసినవీ, బంధానికి హేతువులు, మోక్షానికి సాధకాలు వీటి తత్త్వాన్ని తెలుసుకోవడమే **'సాత్త్విక బుద్ధి'.**

ధర్మాధర్మస్వరూపం, కర్తవ్యం, నిషేధం తెలియకుండా సందిగ్ధంగా ప్రవర్తించేది రజోగుణ ప్రధానమైన **'రాజసబుద్ధి'.**

అజ్ఞానంచేత కప్పబడి అధర్మాన్ని ధర్మంగా, ధర్మాన్ని అధర్మంగా, అలాగే అన్ని విషయాల్లోనూ విపరీతంగా ఊహించే బుద్ధి **'తామసబుద్ధి'.**

అర్జునా! అనన్యమైన యోగంద్వారా మనస్సును నిశ్చలం చేసి, ఇంద్రియాలను నిగ్రహంతో ఉంచేది **'సాత్త్విక ధృతి'.** (ధైర్యం).

సుఖాలయందాసక్తితో, ఫలాపేక్షతో, ధర్మార్థకామాలను జీవితలక్ష్యంగా గ్రహించే స్థైర్యం **'రాజసం'.**

ఎవడు నిద్రను, భయాన్ని, చింతను, శోకాన్ని, మదాన్ని విడిచిపెట్టడో అది **'తామసధృతి'** అని చెప్పబడుతుంది.

అర్జునా! కర్మఫలం వల్ల వచ్చే సుఖంకూడా మూడు విధాలుగా ఉంటూ ఉంది. ఏది మొదట్లో విషం లాగా కష్టంగా కనిపించినప్పటికీ కాలక్రమేణ అభ్యాసం చేయగా అమృతం వలె అవుతుందో అది **'సాత్త్వికసుఖం'.** బుద్ధిని నిర్మలంగా ప్రసన్నంగా ఉంచడంవల్లనే ఈ సాత్త్వికసుఖం సాధ్యం.

ఏ సుఖం విషయేంద్రియ సంబంధం వలన మొదట్లో అమృతం లాంటి ఆనందం కల్గించి, కాలం గడవగా విషతుల్యంగా దుఃఖాన్ని కలిగిస్తుందో అది **'రాజససుఖం'.**

ఏది మొదట్నుంచీ చివరిదాకా ఆత్మను అజ్ఞానంలో పెట్టి దుఃఖాన్ని కలిగించి నిద్ర, సోమరితనంతో ఉంచుతుందో అది **'తామససుఖం'.** వివేకవంతుడు సాత్త్వికసుఖాన్నే కోరుకుంటాడు. రాజస– తామససుఖాలను దరిచేరనీయడు.

అర్జునా! ప్రకృతి సంబంధమైన ఈ మూడుగుణాలతో కూడి ఉండని వస్తువు ఈ భూలోకమందుగానీ, స్వర్లోకమందు గానీ, దేవతల్లోగానీ ఎక్కడాలేదు. ఈ మూడుగుణాలచేత విడువబడిన జీవి ఏదీ లేదు. అందరూ బద్ధులే. పార్థా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాలవారికి వారి వారి స్వభావం వల్లనే కర్మలు ప్రకృతినుంచే వస్తున్నాయి.

ఇంద్రియ నిగ్రహం, తపస్సు, పరిశుభ్రత, ఓర్పు, కపటం లేకపోవడం, శాస్త్రజ్ఞానం, వేదాలపై నమ్మకం ఇవన్నీ బ్రాహ్మణునికి స్వభావసిద్ధమైనకర్మలు. శౌర్యం, ప్రకాశం, ధైర్యం, కార్యదక్షత, యుద్ధంలో వెన్నుచూపకుండుట, దాన గుణం, ప్రజాపాలనం క్షత్రియుడికి సహజసిద్ధమైన కర్మలు. వ్యవసాయం, గోసంరక్షణ, వ్యాపారం వైశ్యునికి స్వాభావిక కర్మలు. సేవచేయడం శూద్రునికి సహజమైన కర్మ. స్వభావ సిద్ధమైన కర్మయందు ఆసక్తికల మానవుడు మోక్షాన్ని పొందుతాడు. తన వృత్తిధర్మాన్ని సక్రమంగా నిర్వహించడమే అందుకు మార్గం. ఈ ప్రపంచమంతా ఎవరినుండి పుట్టిందో, ఎవరిచేత వ్యాపింపబడి ఉందో, ఎవ్వడు భూతకోటినంతా ఉత్పత్తి చేసి, దాని యందే ఉంటున్నాడో అలాంటి పరమాత్మను ఆరాధిస్తూ తన కర్మల్ని తాను నిర్వర్తిస్తూ ఉండే వాడు పరమసిద్ధిని పొందుతున్నాడు.

**శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।**
**స్వభావం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47**

అర్జునా! ఇతరుల ధర్మాన్ని, వృత్తిని ఆచరించడం కంటే కూడా, ఎంత నీచంగా ఉన్నా, నింద్యంగా కనబడినా ఎవరి ధర్మాన్ని వారు వదలకుండా ఆచరించడమే మంచిది. స్వాభావికమైన కర్మల్ని ఆచరించటం వల్ల ఏ పాపం అంటదు. స్వభావ సిద్ధమైన కర్మను దోషయుతమైనా వదలిపెట్ట కూడదు. ఎందుకంటే పొగలేని నిప్పు లేనట్లే కళంకంలేని కర్మకూడా ఉండదు. ఎవడు అన్ని విషయాల పట్ల ఆసక్తివదలి, నిగ్రహంతో మనస్సును జయించి, భోగవాసనలు వర్జించి, ఆశారహితుడై కర్తృత్వ భోక్తృత్వ అభిమానాలను సన్న్యసిస్తాడో వాడు నైష్కర్మ్య స్థితిని పొందుతున్నాడు. నైష్కర్మ్యం అంటే కర్మల్ని విడవడం కాదు. కర్మఫలాన్ని ఆశించకపోవడం.

**అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమ శ్శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥ 53**

ఏకాంతంగా ఉంటూ, మితాహారం కలిగి, మనోవాక్కాయాలను స్వాధీనంలో ఉంచుకొని, కామ, క్రోధ, బల, అహంకార, గర్వాల్ని విసర్జించి, ధ్యానయోగంలో ఉంటూ శాంతచిత్తుడైన మహనీయుడు బ్రహ్మజ్ఞాని అవడానికి సమర్థుడవుతున్నాడు. ఇట్టి బ్రహ్మజ్ఞాని నా యందు పరాభక్తిని పొందుతూ, నన్ను తెలుసుకుంటూ నాలో ఐక్యాన్ని పొందుతాడు. అందుకు అనన్యభక్తి అవసరం. నా మీద నమ్మకం కలిగి ఉండాలి. అలా కాకుండా అహంకారంతో గర్వంతో నా సదుప

దేశాన్ని వినకుండా ప్రవర్తిస్తే కనుక నీ స్వభావ సిద్ధమైన కర్మకు బద్ధుడవై యుద్ధం చెయ్యి. యుద్ధం చెయ్యకుండా ఉండటం నీ క్షత్రియ ధర్మానికే విరుద్ధం అని మరువకు.

ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి ।
భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥ 61

అర్జునా! ఈశ్వరుడు సర్వభూతముల హృదయాలలో అంతరాత్మగా ప్రకాశిస్తున్నాడు. అతడు తన మాయా ప్రభావం చేత యంత్రము మీదకెక్కించి నడిపేవానివలె ప్రాణులను త్రిప్పుతున్నాడు. కనుక అట్టి భగవంతుని శరణువేడి మోక్షాన్ని పొందు. అర్జునా! ఈ విధంగా అతిరహస్యమైన జ్ఞానాన్ని నీకు వివరించాను. ఇప్పుడు నీ బుద్ధితో బాగా విచారణ చేసి తర్వాత నీ చిత్తం వచ్చినట్లు నీ కేది ఎట్లా ఇష్టమైతే అట్లా చరించు. నీవు నాకు మిక్కిలి ప్రియుడవు కనుక నీ కీ హితం చెబుతున్నాను.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు।
మా మేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే॥ 65

నాకు భక్తుడవు కమ్ము. నా యందే మనసు నిల్పి నాకు నమస్కరింపుము. నన్నే ఆరాధిస్తూ ఉంటే నీవు తప్పకుండా నన్నే పొందుతావు. ఇది ముమ్మాటికీ సత్యం. ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను. అది కూడా నీవు నా కత్యంత ప్రియమైన వాడవు కనుకనే ప్రేమతో ఈ ఒక్కమాట అంటున్నాను.



సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥ 66

ధర్మాధర్మ విమర్శల నన్నిటినీ వదలి నన్నొక్కడినే శరణు పొందుము. నేను నిన్ను సకల పాపాలనుంచీ విముక్తుణ్ణి చేస్తాను. నిశ్చింతగా ఉంచుతాను.

అర్జునా! ఈ గీతా శాస్త్రాన్ని తపస్సు చెయ్యనివానికి, భక్తి విశ్వాసాలు లేనివానికి, వినాలనే కోరిక లేనివానికి, నన్ను సామాన్య మానవునిగానే తలచి ద్వేషించువానికి, గురు శుశ్రూషాది సేవ యొనర్పని వానికి చెప్పరాదు. అయితే ఎవడు దీనిని నా భక్తులకు ఉపదేశిస్తాడో వాడు నా యందలి భక్తిచేత నన్నే పొందుతాడు. అట్టివాని కంటె పరమ ప్రీతిపాత్రుడు నాకు ఈ లోకంలో లేడు.

అర్జునా! ఈ గీతా బోధను నీవు అనన్యమనస్కుడవై ఏకాగ్రంగా విన్నావు కదా! అజ్ఞానంవలన కలిగిన భ్రమలు తొలగినవా? నీ సందేహం తీరిందా? అని కృష్ణపరమాత్మ ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు అర్జును డిలా సమాధాన మిస్తున్నాడు.

## అర్జునుడంటున్నాడు

కృష్ణా! నీ అనుగ్రహంచేత నా భ్రమ తొలగింది. అజ్ఞానం నశించింది. జ్ఞానం కలిగింది. సందేహాలు తీరిపోయాయి. నీ ఆజ్ఞను నెరవేరుస్తాను. నీ మాట ప్రకారమే నడుచుకుంటాను.

## సంజయుడంటున్నాడు

ధృతరాష్ట్ర మహారాజా! వ్యాసమహర్షి అనుగ్రహంతో యోగేశ్వరుడగు కృష్ణభగవానుడు స్వయంగా ఉపదేశించిన ఈ శాస్త్రాన్ని వినగల్గాను. పరమాద్భుతం, ఆశ్చర్యకరమైన విశ్వ రూపాన్ని దర్శించాను. నా మనస్సు ఆనందాంబుధిలో ఓలలాడు తున్నది. నేను ధన్యుడనైనాను.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః।
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ॥ 78

ఎక్కడ యోగేశ్వరుడగు కృష్ణుడునూ ధనువును ధరించిన అర్జునుడునూ ఉంటారో అక్కడ సంపద, విజయం, ఐశ్వర్యం, నీతి స్థిరంగా నెలకొని ఉంటాయి. ఇది నా నిశ్చితాభిప్రాయం.

శ్రీమద్భగవద్గీత సారసంగ్రహం సమాప్తం.
శ్రీకృష్ణార్పణమస్తు.
హరిః ఓమ్ తత్సత్.




శ్రీమన్నారాయణుడు లోకరక్షకుడు. దీనులలో వ్యాపించిన భయాందోళనల్ని నాశనంచేసి మానసికమైన ధైర్యాన్ని, శాంతిని కలుగజేసే దయాస్వరూపుడు. దనుజుల్ని సంహరించి మునిజనులను, దేవతలను, సజ్జనులనుపాలించే పంచాయుధధారి.

భీతిల్లినమనసులకు స్వామి పంచాయుధాల్ని ధరించి అభయప్రదాతగా దర్శనమిస్తాడు. అందుకే విష్ణుస్తోత్రాలలో కూడా ఆయుధరూపధారియైన మూర్తికే ప్రాధాన్యం ఎక్కువ.

సశంఖచక్రంసకీరిటకుండలం సపీతవస్త్రంసరసీరుహేక్షణం
సహారవక్షస్థలశోభికౌస్తుభం నమామివిష్ణుంశిరసాచతుర్భుజం.

అని మొట్టమొదట శంకచక్రాల్ని ధరించినవాడుగా ప్రస్తుతింపబడ్డాడు.

నారాయణుడు ధరించే రూపంగానీ, విధానంగానీ భిన్నంగా ఉంటుంది. ఏదిఏమైనా దీనజనసంరక్షణేస్వామికి ధ్యేయం.

'జలేరక్షతు వరాహః స్థలే రక్షతు వామనః
అటవ్యాం నారసింహశ్చ సర్వతః పాతు కేశవః'

ఈ శ్లోకం నారాయణుని సర్వసమర్థమైన రక్షణశీలాన్ని ప్రస్ఫుటంచేస్తుంది.

జలగాములైనవారికిగానీ లేదా ఆకస్మికంగావరదలు ఉప్పెనలవల్ల సంభవించే ఉపద్రవాలనుండి గానీ, లేక జల జంతువుల నుండి గానీ రక్షించేవాడు వరాహరూపధారియైన ఆది వరాహవిష్ణువు. వరాహరూపధారియై జలధిలో మునిగిన భూగోళాన్ని ఏ విధంగా అయితే సముద్ధరించి రక్షించాడో ఆ వరాహస్వామి జలసంబంధితమైన ఆపదావస్థల్నుండి ఒడ్డుకు చేర్చగలిగే దయాసముద్రుడు.

భూభాగాన్ని మొత్తం తనమూడడుగులతోఆక్రమించి, మూడువైపులా విశేషంగా వ్యాపించి స్థలాన్ని మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకొని వామనావతారమూర్తియై శ్రీమహావిష్ణువు స్థలభాగంపై సంభవించే విపత్తులకు విమోచనాన్ని కలుగజేసే త్రివిక్రమస్వరూపునిగారక్షణాభారాన్నివహిస్తూ భయార్తులకు అభయహస్తాన్నిస్తున్నాడు.

ఘోరారణ్యనివాసిత క్రూరజంతువులనుండి సంభవించే సంక్షోభాలని సంహరించేస్వరూపుడు ఉగ్రనరసింహరూపధారి అయిన శ్రీమహావిష్ణువు ప్రహ్లాదుని వాత్సల్యంతో రక్షించిన కరుణాంతరంగుడు. జలస్థలఅటవ్యాదులుగాక మిగిలిన సర్వ ప్రదేశాలలోనూ వెన్నంటి రక్షించేవాడు కేశవుడే.

శ్రీహరి సర్వజీవులను శిక్షించాలన్నా, రక్షించాలన్నా కేవలం మనోసంకల్పం చేతనే గావించగల మహిమాన్వితుడు. కానీ భక్తులకు అభయత్వాన్ని ప్రసాదించడానికి, చూడగానే సర్వభయాలు దూరంగా తొలగిపోవడానికీ మహామహిమోపేతాలైన పంచాయుధాలను ధరించి భక్తుల హృదయాలకు స్వస్థతను చేకూరుస్తాడు.

## స్వామి ధరించే పంచాయుధాలు

1) చక్రం - దీనికే సుదర్శనం అని పేరు.
2) శంఖం - దీనికే పాంచజన్యం అని పేరు.
3) గద - దీనికే కౌమోదకీ అని పేరు.
4) ఖడ్గం - దీనికే నందకం అని పేరు.
5) ధనువు - దీనికే శార్ఙ్గం అని పేరు.


**01) చక్రం:** విష్ణుహస్త ప్రచలితమైనదీ విరాజమానమైనదీ చక్రం. శ్రీమహావిష్ణువు పంచాయుధాలలో ప్రథమమైనది. సర్వా

యుధాలకూ అధిదేవతగా స్వామివారి కుడిచేతి యందు నివసించే భాగ్యం కలది. దీనికి **'సుదర్శనం'** అనిపేరు.

శ్రీమహావిష్ణువు కార్యసంకల్పానికి ఆచరణరూపమైనది సుదర్శనం. గజేంద్రునిరక్తాన్ని పీల్చి బాధించిన నక్రాన్ని, భగవ త్తత్త్వాన్ని అవలోకింపక శ్రీకృష్ణుని తూలనాడిన శిశుపాలుని వధించి స్వామివారికీర్తిని ఇనుమడింపజేసింది. అంబరీషునిపై అకారణ ఆగ్రహాన్ని దురాధిక్యాన్ని ప్రదర్శించిన దుర్వాసమహా ముని గర్వాన్ని అణచివేసింది.

క్షీరసాగరంలో వచ్చిన అమృతాన్ని మోహినీరూపంలో శ్రీమహావిష్ణువే తొలుత దేవతలకు పోస్తూండగా, దేవతల కన్నుగప్పి అమృతాన్ని సేవించిన రాహుకేతువుల కంఠాల్ని త్రుంచాడు సుదర్శనుడు.

శ్రీపంచాయుధస్తోత్రం సుదర్శన చక్రస్వరూపాన్ని ఈ విధంగా తెలియజేస్తోంది.




**స్ఫురత్సహస్రారశిఖాతితీవ్రం సుదర్శనం భాస్కరకోటితుల్యం।**
**సురద్విషాంప్రాణవినాశి విష్ణోః చక్రం సదా౽హం శరణం ప్రపద్యే॥**

వేవేల అగ్నిజ్వాలలో తీవ్రంగా జ్వలిస్తూ ప్రకాశిస్తూ ఉన్న కోటికాంతులసమాహారమై విరాజమానమైఉన్న, దేవతలకు శత్రువులైన దైత్యుల ప్రాణాల్ని హరింపజేసే సమర్థతగల, విష్ణువుకు ప్రధానాయుధమైన సుదర్శనచక్రం సదా నన్ను రక్షించుగాక!

**02) శంఖం:** శ్రీమన్నారాయణుని చేతి శంఖానికే **'పాంచజన్య'** మని పేరు. పంచజనుడనే రాక్షసునికి గుర్తుగా శ్రీహరి ధరించడంవల్ల దానికా పేరు వచ్చింది.

'పాంచజన్యధ్యానధ్వాస్తపాతకసంచయమ్' అని వ్యవ హరించడంవల్ల పాంచజన్యంనుండి ఉద్భవించిన ధ్వని వీనులకు సోకినట్లయితే సర్వపాపాలు హరిస్తాయని తెలుస్తోంది. ఈ పాంచజన్యం ధార్తరాష్ట్రుల హృదయాల్ని చీల్చి వేసిందట.

శ్రీమన్నారాయణుడు సర్వగంధ, సర్వరసస్వరూపునిగా ప్రసిద్ధిగాంచాడు. ఈ రస, గంధ శబ్దాలు రెండూవేదాలలో పర మాత్మకు విశేష్యవాచకాలై ఉన్నాయి. శ్రీహరి గంధస్వరూపుడు కావడంవల్ల అతని ముఖంనుండి వెలువడే వాయువుకూడా సుగంధభరితమైనది.

విశిష్టాద్వైతంలో పరమభాగవతోత్తములుగా భావించ బడిన ద్వాదశాళ్వారులలో ఆద్యులైన 'పొయిగై ఆళ్వార్' ఈ పాంచజన్యంయొక్క అంశతోనే జన్మించారని విష్ణుతత్త్వజ్ఞుల అభిమతం.

శ్రీపంచాయుధస్తోత్రం సకలశుభప్రదమైన పాంచ జన్యాన్ని ఈ విధంగా ప్రస్తుతిస్తోంది.

**విష్ణోర్ముఖోత్థానిలపూరితస్య యస్య ధ్వనిర్దానవదర్పహంతా।**
**తం పాంచజన్యం శత కోటిశుభ్రం శంఖం సదా౽హం శరణం ప్రపద్యే॥**

శ్రీమహావిష్ణువు దివ్యాస్త్రంనుండి వెలువడిన వాయువు చేత పూరింపబడిన ఆ శంఖధ్వని నిశాచరుల దర్పాన్ని మర్ది స్తుంది. అంతేకాదు కోటిచంద్రులకాంతితో సమానమైన ధవళ కాంతులతో ప్రకాశించే శంఖం సదా నన్ను రక్షించాలని శరణు వేడుతున్నాను.


శ్రీహరి ముఖంనుండి వెలువడే వాయువు కూడా సుగంధభరితమైనది

**03) గద:** శ్రీమన్నారాయణుని గదాయుధానికి **'కౌమోదకి'** అని పేరు. కౌమోదకి బుద్ధికి చిహ్నమైనది. విష్ణువును ఆశ్రయించిన వారి విరోధులను సంహరించే స్వభావంకలది. భగవంతుని హస్తస్థితమై రక్షణా విధినిర్వహణలో ప్రముఖమైన పాత్ర వహిస్తుంది.

పూర్వం సాళ్వనామధేయుడైన ఒకరాక్షసుడు కామ గమనంగల తనపట్టణంతో సహా మధురానగరంపై విరుచుకు పడి, అందరినీ హింసించుచుండగా శ్రీకృష్ణపరమాత్మ 'కౌమోదకి' అనే ఈ గదను శిష్టజనరక్షణార్థం ప్రయోగించాడు. అపుడు ఆ నగరం కౌమోదకియందు తొడిగిన కంకణాలలో ఒకటిగా మమైక్యం చెందింది.

ఆళ్వారులలో సుప్రసిద్ధులైన 'పూదత్తాళ్వార్' ఈ కౌమోదకీ అంశతోనే జన్మించారు.

శ్రీపంచాయుధస్తోత్రం కౌమోదకీ స్వరూపాన్ని ఈవిధంగా అభివర్ణిస్తోంది.

**హిరణ్మయీం మేరుసమానసారాం కౌమోదకీం దైత్యకులైకహంత్రీం।**
**వైకుంఠవామాగ్రకరాగ్రమృష్టాం గదాం సదాఽహం శరణం ప్రపద్యే॥**

'కాంచనయుతమై, మేరుపర్వతంతో సమానమైన తేజో వంతమై, రాక్షస మస్తకభేదకమై, వైకుంఠుని వామహస్తభూషితమై అలరారు కౌమోదకీ అనే గదను శరణు వేడెదను'.

**04) ఖడ్గం:** దీనికి **'నందక'**మని వ్యవహారం. 'నందయతీతి నందకః' అంటే విష్ణుపదారవింద నిత్యాశ్రితులను సంరక్షించడం కోసం శత్రుసంహారం గావించి ఆనందాన్ని కలుగచేస్తుంది. కాబట్టి దీనికి నందకమని సార్థకనామధేయం.

ఇది జ్ఞాన స్వరూపాత్మకమై విజ్ఞానానికి చిహ్నంగా అలరారుతోంది. దీని 'ఒర' అజ్ఞానానికిగుర్తు. ఖడ్గం ఎంత ప్రకాశవంతమైనదైనప్పటికీ, అది 'ఒర'లో నిక్షిప్తమై ఉండునంత కాలమూ దాని ప్రకాశం వ్యక్తం కాదు. అలాగే స్వతః జ్ఞానం కలిగి ఉన్నప్పటికీ జీవుడు అజ్ఞానం అనే ఒరలో చిక్కుకొని ఉండడంవల్ల జ్ఞానమనే ఖడ్గజ్యోతి (కాంతి) ప్రకాశించదు. 'ఒర' నుండి బైటకు తీసిన ఖడ్గంవలే అజ్ఞానం తొలగిపోగా జీవుడు జ్ఞానంతో ప్రకాశించును. అందుకే నందకం జ్ఞానానికి చిహ్నమైనది.

ఆళ్వారులలో తృతీయునిగా ప్రసిద్ధి వహించిన 'పేయాళ్వారులు' ఈ నందకాంశతో అవతరించారని ప్రతీతి.

శ్రీపంచాయుధస్తోత్రం నందకాన్ని ఈ విధంగా అభివర్ణిస్తోంది.

**'రక్షోఽసురాణాం కఠినోగ్రకంఠచ్ఛే దక్షరత్ క్షోణిత దిగ్ధసారామ్।**
**తం నందకం నామ హరేః ప్రదీప్తం ఖడ్గం సదాఽహం శరణం ప్రపద్యే॥**

'రాక్షసుల యొక్క కఠినమైన కంఠాలను ఛేదించి శోణితాలంకృతమై ప్రదీప్తమైన నందకమనే ఖడ్గాన్ని శరణువేడుతున్నాను.'

**05) ధనుస్సు:** శ్రీమన్నారాయణుని హస్తభూషణమై ఉన్న ధనువుకే **'శార్‌ఙ్గ'**మని వ్యవహారం. ఇది ఇంద్రియం మొదలయిన తామసమైన అహంకారాలకు చిహ్నభూతమైనది. ఈ ధనువు తామసాహంకారం కాగా, ధనువునుండి ఉద్భవించు బాణాలే తామసాహంకార యుక్తమయిన పంచకర్మేంద్రియాలు. దుర్విదగ్ధతలో శత్రువులపైకి తమంత తాముగా వెళ్ళేవారి ధర్మాన్ని హరించి వారిని నశింపజేసేవే ఈ అస్త్రాలు.

ఆళ్వారులలో చివరివారైన 'తిరుమంగయాళ్వారు' ఈ శార్‌ఙ్గం యొక్క అంశతో జన్మించారని ప్రతీతి. శార్‌ఙ్గంను పంచాయుధస్తోత్రంలో–

**యజ్జ్యానినాదశ్రవణాతురాణాం చేతాంసి నిర్ముక్త భయానిసద్యః।**
**భవంతి దైత్యాశనిబాణవర్షైః శార్‌ఙ్గం సదా హం శరణం ప్రపద్యే॥**

'తన గుణనిక్వణంచేత సురలహృదయాల్లోని భయాన్ని తొలగించి, బాణవర్షంచేత దైత్యులను సంహరించే శార్‌ఙ్గం ఎల్లప్పుడూ నన్ను రక్షించుగాక' అని శార్‌ఙ్గ వైభవాన్ని వివరిస్తోంది.

పంచాయుధాల్ని ధరించిన శ్రీమహావిష్ణువును శరణు కోరడం అత్యుత్తమమైన భయనాశకమైన మార్గం. సర్వాయుధాల్ని ధరించిన విష్ణువును నిత్యం స్తోత్రం చేయడం ద్వారా సర్వపాపాలనూ, భయాలను పోగొట్టుకొని, సుఖశాంతులతో జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి **'విష్ణుసహస్రనామ స్తోత్రం'** పంచాయుధాలతో కూడిన శ్రీమన్నారాయణుని శరణు కోరే తారక శ్లోకాన్ని భక్తులకు అందిస్తోంది. ఈశ్లోకాన్ని నిత్యం స్మరిస్తూ భగవంతునిపాలనలో సుఖంగా సుభిక్షంగా శాంతి యుతంగా, దుష్టశక్తులనుండి రక్షణ పొంది జీవనాన్ని సాగిద్దాం.

**వనమాలీ గదీ శార్‌ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ।**
**శ్రీమాన్నారాయణోవిష్ణుః వాసుదేవోఽభిరక్షతు॥**

మన మహర్షులు

# మహాయోగి గర్గ మహర్షి

– సద్గురు డా॥ కె.శివానందమూర్తి

గర్గమహర్షి యదుకులానికి ఆచార్యుడు. ఈతడి వంశం గురించి **'గర్గసంహిత'** తెలియజేస్తోంది. బృహస్పతి – మమతలకు భరద్వాజుడు పుట్టాడు. ఆతడికి వితథుడు అని పేరు. అతడిని దేవతలు పెంచి దుష్యంతుడి పుత్రుడైన భరతుడికి ఇచ్చారు. ఈ వితథుడికి మన్యుడు, అతడికి బృహత్ క్షత్రుడు, అతడికి జయుడు, ఆతడికి గర్గుడు జన్మించారు. గర్గుని సోదరుడు నరుడు అనేవాడు. అతడి పుత్రుడే ప్రసిద్ధుడైన రంతిదేవుడు. గర్గుడు బాల్యావస్థలో ఉన్నప్పుడే శివభక్తుడు. శివుణ్ణే తన గురువుగా భావించాడు. అతడికి శివుడే సమస్తవిద్యలూ ఇచ్చాడు. ఆయన కీర్తి లోకమంతా వ్యాపించి, మహాత్ముడని పేరువచ్చింది. వేలకువేలమంది శిష్యులు వచ్చారు. ఆయన వారికి వేదశాస్త్రాలన్నీ బోధించాడు. హైహయ వంశస్థులు వచ్చి గర్గుడిని తమకు కులగురువుగా ఉండమని అర్థించారు. ఆ విధంగా అనేక క్షత్రియవంశాలకు ఈయన కులగురువుగా ఉన్నారు. గర్గుడికొక పుత్రుడు జన్మించిన తర్వాత, అతడు సన్యసించాడు. గర్గమహర్షి యాదవులకూ గురువయ్యాడు.

కృష్ణావతారకాలం. కృష్ణుడు జన్మించాడు, పిల్లవాడిగా ఉన్నాడు. రేపల్లెలో పెరుగుతున్నాడు. గర్గమహర్షి అక్కడికి వచ్చాడు. ఆ సమయంలో యశోదాదేవి కృష్ణుణ్ణి లాలిస్తోంది. గర్గుడిని చూచి ఆమె నమస్కరించి, "అనుగ్రహించి తమరెవరో చెప్పండి స్వామీ!" అని అడిగింది. అందుకు బదులుగా ఆయన ఆమెతో, "నన్ను గర్గుడు అంటారు తల్లీ! వసుదేవుడి పురోహితుణ్ణి నేను. మీరనుకున్నట్టు ఈ పిల్లవాడు మీ సొంత కొడుకు కాదు. వసుదేవుడి కొడుకు. రోహిణి కుమారుడైన బలదేవుడు ఈయనకు అన్న. కంసుడి భయంతో వసుదేవుడు ఇతడిని రహస్యంగా తెచ్చి ఇక్కడ మీ కుటుంబంలో ఉంచాడు. అప్పుడు మీకు ఒక ఆడపిల్ల కలిగిందమ్మా! ఆయన ఆ శిశువును మధురకు తీసుకెళ్ళాడు. ఈ పిల్లవాడు ఎవరోకాదు, సాక్షాత్తు శ్రీమహావిష్ణువే! పరబ్రహ్మ వస్తువు. రాధేశ్వరుడైన శ్రీకృష్ణుడు, గోలోకాధిపతి. భార్గవుడు, శివుడు, నారాయణుడు, నరనారాయణులు, కపిలాది నారాయణావతారములు అన్నీ కలిపి ఇతడు. ఈతడిలోలేని అంశలేదు. కపిల, శివ, నారాయణాంశలతో కూడిన ఈతడు గోలోకాధిపతి అయిన మాధవుడే! ఇదే అతడిని గురించిన పరమరహస్యం" అని చెప్పాడు.

ఆయన ఇంకా కృష్ణుణ్ణి గురించి, "ఇతడు పుట్టిపుట్టగానే దేవకీ వసుదేవులకు మాత్రమే నిజస్వరూపం చూపించాడు. ఇతడికి ప్రతీయుగంలోనూ వర్ణభేదము, నామభేదము ఉంటాయి. కృతయుగంలో శ్వేతవర్ణుడుగాను, త్రేతలో రక్తవర్ణుడుగాను, ద్వాపరంలో పీతవర్ణుడుగానూ ఉంటాడు. ఈ ద్వాపరంలో కృష్ణవర్ణం దాల్చటంచేత కృష్ణుడని పేరు వచ్చింది" అని చెప్పాడు.

ఈ కృష్ణవర్ణంలో ఈ నామం అర్థమేమంటే – 'క'కారం బ్రహ్మవాచకం, 'రు'కారమేమో అనంత వాచకం, 'ష'కారమేమో శంకరవాచకం, 'ణ'కారమేమో ధర్మ వాచకం, 'అ'కారమేమో విష్ణువాచకం, 'వి'సర్గము నరనారాయణార్థ వాచకం. ఇదీ అతడి నామముయొక్క నిర్మాణము. కృష్ అనే శబ్దానికి కర్మను నిర్మూలన చేస్తుందనే అర్థం కూడా ఉంది. నకారమేమో దాస్యవృత్తిని చెపుతుంది. దాసోహం అని ఈశ్వరుడి దగ్గర చెప్పటం. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని చెప్పబడింది కాబట్టి, 'కృషి' అంటే కర్మనిర్మూలనం; అకారమేమో ప్రాప్తి. ఆ కోరుకున్నది పొందటానికి అకారశబ్దం వర్తిస్తుంది. ఈ ప్రకారంగా సర్వశక్తివంతమైన 'కృష్ణ' శబ్దానికి ఉన్న అర్థం

## అక్టోబరునెల క్విజ్–3 సమాధానాలు

**అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానం – శ్రీమణవాళమహాముని**

**సరైన సమాధానాలు వ్రాసినవారు–**


1) పిట్టల వర్షిణి, 7వ తరగతి, నంద్యాల.
2) పుప్పాల నాగవెంకటమాధవ్‌శ్రీరాం, 6వ తరగతి, ప్రకాశంజిల్లా.
3) పప్పల ధనశ్రీ నాగహర్షిక, 8వ తరగతి, ఏలూరు జిల్లా.
4) శ్రీవేంకటసాయి రామసాత్విక్, 5వ తరగతి, హైదరాబాదు.
5) మామిళ్లపల్లి వెంకటసాయిచిన్మయ్, 9వ తరగతి, కడప జిల్లా.
6) కె.సరయు, 9వ తరగతి, తిరుపతి.
7) కొత్తపల్లి శేషాద్రి కార్తికేయ, 8వ తరగతి, కర్నూలు.

వివరించాడాయన. ఆ నామం ఉచ్చరిస్తేనే అధిక మైన ఫలం లభిస్తుంది.

ఆ బాలుడికి నామకరణం చేయమంటే; కృష్ణుడు, కంసధ్వంసి అని ఇతర పేర్లు కూడా చెప్పాడు గర్గమహర్షి. జాతకం వేయమని అడిగితే, గర్గుడు కృష్ణుడి జాతకం వేసినట్లు ఉంది భాగ వతంలో ఒకచోట. గర్గుడు చెప్పిన కృష్ణనామాలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు, పీతాంబరుడు, కంసధ్వంసి (చేయబోయే పనులప్పుడే చెప్పేస్తున్నాడు), విష్ట రశ్రవుడు, దేవకీనందనుడు, శ్రీమంతుడు, యశోదానందనుడు, హరి, సనాతనుడు, అచ్యు తుడు, విష్ణువు, సర్వేశ్వరుడు, సర్వరూపధరుడు, సర్వాధారుడు, సర్వగతి, సర్వకారణకారణుడు, సంపూర్ణతముడు, పరబ్రహ్మ, గోవిందుడు, గరుడధ్వజుడు, రాధాబంధుడు, రాధికాంతరాత్మ, రాధికాజీవనుడు మొదలైనవి. ఈ పేర్లన్నీ కూడా వేదంలో ఉన్నవని చెప్పాడు ఆయన. ఈ నామా లన్నీ కూడా సర్వమంగళ ప్రదమైనవని కూడా చెప్పాడు. సర్వపాపాలు నాశనంచేసే మహత్తరమైన నామములివి.

"ఇక నీ జ్యేష్ఠకుమారుడైన బలరాముడు గర్భసంకర్షణం చేత కలగడం వలన, అతడికి సంకర్షణుడని పేరొచ్చింది. ఇతడికి అంతులేక పోవడంచేత వేదాలలో 'అనంతుడు' అని, అపరి మితబలం ఉండటంచేత 'బలదేవుడు', హలాన్ని ధరించడం చేత 'హలి', నీలచేలధారి కనుక 'నీలాంబరుడు', ముసలం ధరించటం చేత 'ముసలి' అనే పేర్లు అతనికి ఉన్నవి. రౌహిణే యుడు అని, రేవతీనాథుడు అనికూడా అతడికి పేర్లు ఉన్నాయని గర్గుడు చెప్పాడు.

బలరామకృష్ణుల జాతకర్మలన్నీ శుభ ముహూర్తంలో రహస్యంగా గర్గుడు జరిపించాడు. అనేకమంది యాదవులు ఆ కృష్ణమందిరానికి వచ్చి నందుడింట్లో ఉన్న గర్గుడికి నమస్కరించారు.




వాళ్ళను ఆయన ఆశీర్వదించాడు. ఆయన శ్రీకృష్ణుణ్ణి ఏకాంతానికి తీసు కెళ్ళి, అతడికి ప్రదక్షిణం చేసి నమస్కరించి స్తోత్రంచేశాడు. "నీ దివ్య పాదార్చన, దర్శనం కోసమని జీవిస్తున్నాను నేను. నా తపస్సు ఫలంగా నీ దర్శనం కలిగింది. నేను కోరింది నీ దర్శనమే! ఇంకేమీ లేదు. బ్రహ్మ గానీ, రుద్రుడుగానీ, వాళ్ళు సంపాదించిన శక్తులు నీ అనుగ్రహంతో సంసాదించినవే! ధర్ముడు(అంటే ధర్మదేవత)కూడా నీ పాదాలను ధ్యానిస్తేనే ధర్మదేవత అయినాడు. ధర్మదేవతకు సమస్తధర్మములూ నీ పాదార్చనవలన తెలిసినవే" అని గర్గుడి స్తోత్రసారాంశం. ఆయన ఇంకా కృష్ణుడిని ఒకటే కోరిక కోరాడు. "నా అంతఃకరణలో ఎప్పుడూ కూడా నీ పాదదర్శనం అవుతూ ఉండాలి. నీ పాదపద్మాలను ఎల్లప్పుడూ ధ్యానించే శక్తి నాకు ప్రసాదించు" అని అడిగాడు.

ఆ తర్వాత కొంతకాలం వరకు గర్గుడు తపస్సుచేసి, కంసవధ తర్వాత కృష్ణబలరాములిద్దరికీ ఉపనయనం చేశాడు. దేవకీవసుదేవులు గాయత్రీ మంత్రోపదేశం చేశారు. మధురలో ఉపనయనం జరిగిందన్నమాట. బలరామకృష్ణులను సాందీపని మహర్షి వద్దకు విద్యాభ్యాసానికై పంపినవాడు గర్గుడే.

నక్షత్రశాస్త్రమంతా ఆయనకు తెలుసు. ఏ నక్షత్రంలో పుడితే ఏం ఫలితమో, ఏ దోషాలు వస్తాయో అవి అన్నీ చెప్పాదు ఆయన.

**గర్గుడు పరివేష్టిత మునివర్గుడు సంపాదిత వర్గుడు భవ నై**
**సర్గుడు పరతత్త్వ కళామార్గుడు రక్షించుగాత మమ్మెల్లపుడున్!**

ఆయనను గురించిన విష్ణుపురాణవాక్యం అది. కాలజ్ఞానం ఆయనకు కరతలామలకంగా ఉండేది. ఆయన పాండవులకుకూడా అనేక బోధలుచేసి, వాళ్ళను అనుగ్రహించి నట్లు; భారతకాలంలో అనేక పనులు చేసినట్లు ఆయన చరిత్ర చెపుతున్నది.

కంసవధానంతరం ఉగ్రసేనుడు అశ్వమేధయాగం చేయడం మొదలైన కథలన్నిటితో సహా, కృష్ణ-బలరామ-ప్రద్యుమ్న- అనిరుద్ధులు అవతారాలు చాలించిన తరువాత వజ్రనాభుడికి గర్గమహర్షి వివరించాడు. ఇదే **'గర్గసంహిత'** పేరుతో ప్రసిద్ధి చెందింది. (అనిరుద్ధుని కుమారుడు, ప్రద్యుమ్నుని మనుమడు ఈ వజ్రనాభుడు.) ఈ గాథ మధురాపట్టణంలో జరిగింది.

ఈ గర్గసంహితలోని **'శ్రీకృష్ణసహస్రనామావళి'** సుప్రసిద్ధం. ఇందులో **'భాష్యకారః'** అనే నామంలో కృష్ణుణ్ణి **'పతంజలి'** స్వరూపంగా వర్ణించడం జరిగింది. అంతేగాక, **'పాణినిః'** అనే పేరుకూడా ఈ సహస్రనామాలలో ఉంది. వేదాంగాలలోని ఛందశ్శాస్త్రకర్త అయిన **'పింగళః'** (పింగళమహర్షి) అనే నామంకూడా ఈ సహస్రంలో ఉంది. ఇదంతా గర్గమహర్షి బోధయే. ఇంకా, పాణినీయ వ్యాకరణానికి వార్తికాన్ని రచించిన **'కాత్యాయనః'**(కాత్యాయనుడు) అనే నామంకూడా ఇందులో ఉంది. విశేషమేమంటే, ఈ **'శ్రీకృష్ణసహస్రనామావళి'**లో **'గర్గః'** అనే నామంకూడా ఉంది. అనగా, శ్రీకృష్ణతత్త్వంలోని మహాయోగియే గర్గుడని భావం.

## మంత్రస్మరణ వైశిష్ట్యం


**మననం చేసే కొలదీ రక్షించేది మంత్రం, మనస్సును రక్షిస్తుంది. కనుక మంత్ర మనే అన్నారు. స్పష్టాక్షరమైన పలుకే మంత్రం. దేవతలు మంత్రాలకు అధీనులు. మంత్రాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. మంత్రాన్ని ఉచ్చరించేటప్పుడు స్వరపేటిక, దానికి సంబంధించి నరాలు ఒక నిర్ణీతరీతిలో పనిచేస్తాయి. ఇందువల్ల ఉచ్చారణ సరిగ్గా ఉంటుంది. నాలుక స్పష్టంగా చలిస్తుంది.**

**ఒక శబ్దాన్ని ఉచ్చరించాలంటే 72 స్నాయువులు పని చేస్తాయి. ఏయే రీతిలో స్నాయువులు పనిచేస్తే ఆయా శబ్దాలవల్ల ఆయానరాలు ఉత్తేజితాలవుతాయి. ఇవి సంస్కృతభాష వల్లనే సాధ్యం.**



**మంత్రోచ్చారణతో జనించే శబ్దతరంగాలు చెవిపైనా, దాని ద్వారా ఇతర నరాల పైనా మంచి ప్రభావం చూపుతాయి. మంత్రనాదం వింటుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఇందువల్ల వాక్శక్తి పెరుగుతుంది. అనువాదాలు మంత్రాలు లేవు. మంత్రాల్లోని ఒక్కొక్క అక్షరమూ ఒక దేవతాశక్తికి బీజమే! మంత్రాల అర్థం ఏదైనా కావచ్చు. కానీ వాటిల్ని ఆపద్ధతి ప్రకారం ఉచ్చరిస్తూంటే దేహంలో విద్యుత్తు ఉత్పాదనం జరుగుతుంది. ఇందువల్ల శరీరం మిక్కిలి చైతన్యవంతమై-పవిత్రవంతమవుతుంది. కనుక మంత్రతస్మరణవల్ల మనస్సు, బుద్ధి, చిత్తం, హృదయం, ముఖం, శరీరం పరిశుద్ధమవుతాయి. వాక్కు శక్తిమంతమవుతుంది.**

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల–తిరుపతి ఐతిహ్యమాల)


తెనుగు అనువాదకులు:

కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,

కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు


*అక్టోబరు, 2022 సంచిక తరువాయి భాగం...*

పిమ్మట అందరును ఈ భగవదనుగ్రహమును విని సంతుష్టులై యుండిరి. అప్పుడు వేంకటేశ్వరుని దివ్యహృదయమునకు అంతరంగ కింకరుడగు బింబాధరుడను ఒక అర్చకుడు శ్రీశఠకోపమునెత్తి అందరి శిరములపై నుంచి 'పరమ ఋషులగు పెక్కురు భాగవతులచే ఈ స్థలమున అనుష్ఠింపబడి శ్రీనివాసునకు మిక్కిలి సంతృప్తికరమైన ఈ ఆచారమర్యాదను ఈ తిరుమలయందు అనుష్ఠించువారు శ్రీభగవద్రామానుజులకు అంతరంగులు. అనుష్ఠింపనివారు స్వామివారి దివ్యాజ్ఞారూపమగు వేదమునకు బాహ్యులు' అని ఒక దివ్యాజ్ఞ నిడగ ఎల్లవారును అంగీకరించిరి.

ఇట్లు భగవదాజ్ఞాసిద్ధములైన సదాచారవిశేషములను సకల జనులును అనుష్ఠించుచుండగ శ్రీశైలపూర్ణుల శిష్యుడగు ఒక శ్రీ వైష్ణవుడు ప్రకృతి వశ్యుడై 'మాకు పరిమళద్రోహము చేసినాడు' అని తెలుపగ తిరుమలనంబి విని మేల్కొని 'దివ్యమాలికలందు ఏ ఒక్కటినిగాని ఎవ్వరికిని ఈయరాదు. కలికాలదోషముచే మంచివారియందును పాపపుతలంపులు పుట్టును గావున నా విన్నపము సత్యమగులాగున సంకల్పించి యనుగ్రహింపవలెను' అనగా–

స్వామియు ఈ వృత్తాంతము విని అర్చకముఖముగా 'మేము అర్చావతారము స్వీకరించుట ఆశ్రితుల యభీష్టములను నెరవేర్చుటకే కావున, మీకు ప్రియమగునట్లుగ నేడు మొదలుకొని మేము ధరించిన మాలిక మున్నగువాటిని ఎవ్వరికైనను ఇవ్వబోము' అని పలికెను. ఈ సమాచారమంతయు శ్రీరామానుజాచార్యులు విని మనసున ముదమొంది, ఇట్లు క్షేత్రమాహాత్మ్యసిద్ధమై భగవదనుగ్రహ మూలమగులాగున నడచునట్లుగ కట్టడచేసి ఈ ధర్మములను భవిష్యత్కాలమందును పరిపాలనము చేయుచుండుటకొరకునై.


"వర్ణినో నైష్ఠికీ బుద్ధి ర్వైరాగ్యే యది దృశ్యతే,
సంకల్ప్య బుద్ధిం తాం ధీరః కాషాయం ధారయే త్వటమ్."

(బ్రహ్మచారికి నిష్ఠాసక్తమగు బుద్ధి వైరాగ్యమందున్నట్లు కన్పించుచో ఆ బుద్ధిని చక్కగానెరిగి ఆతనిచే కాషాయ వస్త్ర ధారణము చేయింపవలెను.)

అనెడు ఈశ్వరసంహితా వచనానుసారము బ్రహ్మచారి ఇతరాశ్రమములందు విరక్తుడై, జితేంద్రియుడై మంత్రపురస్సరముగా కాషాయవస్త్రము ధరించినవాడు నైష్ఠికబ్రహ్మచారి యగుటచేత, అట్టి యోగ్యత గలవానిని సంపాదించి అతనికి శ్రీస్వామివారి శ్రీశఠకోపము, పరివట్టము (శేషవస్త్రము) మున్నగు బహుమానములు ప్రసాదించి శ్రీవేంకటాచలపతి కైంకర్యమున నియమించెను. *(ఇంకా ఉంది)*

**శ్రీవారిఆలయంలో స్వామిని మనసులో 'గోవింద..! గోవింద..!!' అని స్మరిస్తూ దర్శించాలి.**

# వేదార్థసాధనాలు 'వేదాంగములు'




– ఆచార్య రేమిల్ల వేంకటరామకృష్ణశాస్త్రి

భారతీయవాఙ్మయసర్వస్వమునకు మూలకందములు 'వేదములు'. **'విద జ్ఞానే'** అనుధాతువునుండి పుట్టినది వేద శబ్దము. వేదమనగా జ్ఞానము. ఈ జ్ఞానము భౌతికము, అభౌతికమైన ఆధ్యాత్మికమని రెండు విధములు. ఈ రెండిటిని తెలియజేయునదే వేదము. వేదములు అపౌరుషేయములు. అనగా పురుషనిర్మితములుకావని అభిప్రాయము. కాలక్రమంలో ఇందలి భాష, మంత్రముల అర్థము తెలుసుకొనుటకు సాధన ములుగా ఆరుఅంగములు చెప్పబడినవి. వీనిని **'వేదాంగము లని'**, **'షడంగములని'** వ్యవహరింతురు. **'అంగ'** మనగా ఉపకారకము అని అర్థము. అవి ఆరు–

**శిక్షా వ్యాకరణం ఛందః నిరుక్తం జ్యౌతిషం తథా।**
**కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణః॥**

ఈ శిక్షాది షడంగములను వేదపురుషుని శరీరావయ వములుగా చెప్పబడినవి –

**ఛందః పాదౌ తు వేదస్య, హస్తౌ కల్పోథ పఠ్యతే**
**జ్యోతిషామయనం చక్షుః, నిరుక్తం శ్రోత్రముచ్యతే।**
**శిక్షాఘ్రాణం తు వేదస్య, ముఖం వ్యాకరణం స్మృతమ్**
**తస్మాత్ సాఙ్గమధీత్యైవ బ్రహ్మలోకే మహీయతే॥**

వేదపురుషునికి **ఛందస్సు** పాదములు, **కల్పము** చేతులు, **జ్యౌతిషము** కన్ను, **నిరుక్తము** చెవి, **శిక్ష** ముక్కు, **వ్యాకరణం** ముఖం– అని చెప్పబడింది. మంత్రోచ్చరణ రూప మగు నడక ఛందస్సుపై ఆధారపడి ఉంటుంది, కాబట్టి పాదములని చెప్పారు. వేదవిహితకర్మలన్నియు ఆచరించు విధానము కల్పసూత్రములందు చెప్పబడుటచే కల్పమును చేతులతో పోల్చారు. సూర్యచంద్రాదులన్నియు జ్యోతిస్స్వరూప ములై కంటిచే చూడబడుచున్నవి కావున జ్యోతిషమును నేత్రముతో పోల్చారు. వేదము లకు శ్రుతులని పేరు. చెవితో వినబడునవి కాబట్టి శ్రుతులనే పేరు వచ్చింది. నిరుక్తము వేదశబ్దములను నిర్వచించునదగుటచే వినుటద్వారా శబ్ద స్వరూపము తెలియ బడుచున్నది కావున నిరుక్తమును చెవితో పోల్చారు. శిక్షలో వర్ణోచ్చరణవిధానాదులు చెప్పుటచే, ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలు, శబ్దోచ్చారణలో కీలకపాత్ర వహించుటచే శిక్షను నాసికతో పోల్చారు. సర్వశాస్త్రములకు వ్యాకరణము మూలము కాబట్టి శరీరావయవములలో ముఖము ప్రధానము కాబట్టి, వ్యాక రణమును వేదపురుషునికి ముఖముగా చెప్పారు. ఈవిధంగా ఆరు అంగాలు వేదార్థజ్ఞానానికి ఉపకారకములుగా చెప్ప బడ్డాయి. వేదాంగాలతోపాటు వేదాధ్యయనం చేసినవాడు బ్రహ్మలోకంలో గౌరవింపబడతాడనిచెప్పారు.

క్రమంగా ఈ షడంగాలను గూర్చి సంగ్రహంగా తెలిసికుందాం–

**01)శిక్ష –** శిక్ష 'విద్యోపాదానే' అను ధాతువునుండి శిక్షా శబ్దం పుట్టింది. స్వరవర్ణాదివిజ్ఞానమును తెలియజేసేదే శిక్ష. ప్రాచీన కాలంలో ప్రతివేదానికి వేరువేరుగా అనేక శిక్షాగ్రంథా లుండేవి. నేటికి కూడ పలుశిక్షాగ్రంథాలున్నాయి. వ్యాసశిక్ష, లక్ష్మీశిక్ష, భారద్వాజశిక్ష, శమ్భుశిక్ష, ఆపిశలిశిక్ష, పాణినీయశిక్ష, కౌహలశిక్ష, వాసిష్ఠశిక్ష, కౌండిన్యశిక్ష మున్నగునవి ఉన్నట్లు తెలుస్తోంది. ఇందలో కొన్ని అలభ్యాలు.

శిక్షాగ్రంథములలో పాణినీయశిక్ష చాల ప్రసిద్ధమైనది. ఇందులో– 1)వాగుత్పత్తిప్రకారము, 2)అచ్చులు, హల్లులు మొదలగు వర్ణములు, 3)వర్ణభేదములు, 4)వర్ణముల ఉత్పత్తి స్థానములు, ఆంభ్యంతరబాహ్యప్రయత్నములు, 5)పాఠక గుణములు, 6)పాఠకదోషములు, 7)వర్ణోచ్చారణవిధి(సామ),

8)ఉచ్చారణదోషాలు అను ఎనిమిది అంశములు వివరింపబడి నవి. వేదమంత్రోచ్చారణకు ఈ శిక్షాగ్రంథాధ్యయనము మిక్కిలి అవసరము.

**02)వ్యాకరణము–** 'వ్యాక్రియన్తే శబ్దాః అనేన ఇతి వ్యాకరణమ్'. శబ్దములను వ్యాకరించునది వ్యాకరణము. వాక్యమును పదములుగా, పదమును ప్రకృతిప్రత్యయములుగా, వానిని వర్ణములుగా వివరించి చెప్పుటయే వ్యాకరించుట.

పాణినికి పూర్వం ఐంద్ర, చాంద్ర, కాశకృత్స్న, ఆపిశల, శాకటాయన, అమర, జైనేంద్ర, కాతంత్రాది వ్యాకరణాలు ఉన్నాయి. కాని వైదిక లౌకిక సంస్కృతభాషకు సమగ్రమైన వ్యాకరణము పాణినీయవ్యాకరణమే. పాణిని అష్టాధ్యాయి అను పేరుగల ఎనిమిది అధ్యాయముల సూత్రగ్రంథం రచించాడు. దానికి పూరణాత్మకంగా కాత్యాయనుడు వార్తికగ్రంథాన్ని, ఈసూత్ర వార్తికములకు పతంజలి విపుల వ్యాఖ్యారూపంగా మహాభాష్యం రచించారు. ఈ విధంగా పాణిని కాత్యాయన పతంజలుల సూత్ర– వార్తిక– భాష్యములకు మూడింటికి కలిపి **'పాణనీయ వ్యాకరణ'**మని చెప్పబడింది.

'పదము' సాధారణంగా సుబంతము, తిజంతము అని 'సుప్తిఙన్తమ్ పదమ్' అని సూత్రముచే పాణిని చెప్పెను. వాక్యము నందు సాధారణంగా ఒక క్రియాపదమే ఉండును. తక్కినవన్నియు నామపదము (సుబంతము)లే అగును. క్రియాపదము మూలధాతువునుండి ఏర్పడును. క్రియను చెప్పు శబ్దస్వరూపమును ధాతువని అందురు. ఈ క్రియలు భూత భవిష్యద్వర్తమానములను మూడుకాలములలో ఆజ్ఞా, ప్రార్థనా, విధ్యాది అర్థములలో పదిలకారములుగా చెప్పబడినవి. ఎక్కువ చదువు కోకపోయినా కనీసం వ్యాకరణం చదువుకోమని ప్రాచీనులు చెపుతూండేవారు. అందుకే 'ముఖం వ్యాకరణం స్మృతమ్' అని చెప్పబడింది.

**03)ఛందము–** 'ఛాదయతీతి ఛన్దః'. 'ఛదిర్ ఆవరణే' అనే ధాతువునుండి ఛందశ్శబ్దం ఏర్పడింది. మంత్రార్థాన్ని కప్పి ఉంచేది అని అర్థం. ప్రప్రథమముగ పింగళుడు వేదాంగ ఛ్ఛందమును రచించెను. ఇందు ఎనిమిది అధ్యాయములు ఉన్నాయి. మొదటి నాలుగధ్యయములలో వైదికచ్ఛందస్సులు, తరువాతి నాలుగధ్యాయములలో లౌకికచ్ఛందస్సులు చెప్పబడినవి. గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతీ, పంక్తి, త్రిష్టుప్, జగతి, అతిజగతి, శక్వరి, అతిశక్వరి, అష్టి, అత్యష్టి, ధృతి, అతిధృతి, కృతి, ప్రకృతి, ఆకృతి, వికృతి, సంకృతి, అభికృతి, ఉత్కృతి... అని 21 రకాల ఛందస్సులు చెప్పబడ్డాయి. 24 అక్షరాలనుండి 104 అక్షరాలవరకు ఇవి విస్తరించి ఉన్నాయి.

**04)నిరుక్తము–** ప్రాచీనకాలమున వృషాకపి అనునతడు వైదిక శబ్దములకు నిఘంటువును రచించెను. ఆ నిఘంటువు ఇప్పటి



నిఘంటువులవంటిది కాదు. అది కేవలము వైదికములగు పర్యాయపదములను, నానార్థపదములను కోశముగా వ్రాయ బడిన గ్రంథము. యాస్కమహర్షి ఆ నిఘంటువును స్వీకరించి అందలి పదములకు వ్యుత్పత్తులను చెప్పుచు అర్థమును నిర్వ చించెను. అట్లు నిర్వచింపబడిన గ్రంథమగుటచే దీనిని నిరుక్త మనిరి. వైదికపదార్థజ్ఞానమునకు ఈ నిరుక్తమెంతో ఉపయోగ కరము. ఇది వ్యాకరణమునకు సమగ్రతను చేకూర్చునది.

**05)జ్యౌతిషము–** 'ద్యోతతే ఇతి జ్యోతిః'. 'ద్యుత దీప్తౌ' అను ధాతువునుండి జ్యోతిశ్శబ్దమేర్పడినది. అనగా ప్రకాశించునది అని అర్థము. గ్రహములు, నక్షత్రములు జ్యోతిశ్శబ్దముచే చెప్ప బడును. అఖండమైన కాలమును గ్రహనక్షత్రాదుల గమనముచే పరిచ్ఛిన్నము గావించి దిన, పక్ష, మాస, ఋతు, అయన, సంవత్సర యుగాత్మకముగా విభజించి లెక్కించిరి. వేదవిహిత ములైన కర్మలన్నియు ఈ గ్రహనక్షత్రాదుల గమనముపై ఆధారపడియున్నవి. సూర్యగమనముననుసరించి సౌరమానము, చంద్రగమనముననుసరించి చాంద్రమానము, నక్షత్రగమనము ననుసరించి నక్షత్రమానము చెప్పబడినవి. వేదాంగజ్యోతిష మును **లగధుడు** రచించెను.

**06)కల్పము–** వేదవిహిత కర్మాచరణమునకు కల్పసూత్రములు మిక్కిలి ఆవశ్యకములు. ఇవి నాలుగు విధములుగా కలవు. 1)శ్రౌతసూత్రములు 2)గృహ్యసూత్రములు 3)ధర్మసూత్రములు 4)శుల్బసూత్రములు.

**01) శ్రౌతసూత్రములు–** శ్రుతి(వేద) ప్రతిపాదితము లైన కర్మలను వివరించిన సూత్రములు. ఆశ్వలాయన, శాంఖా యన, కాత్యాయన, బోధాయన, ఆపస్తంబ శ్రౌతసూత్రములు ప్రసిద్ధములైనవి.

**02) గృహ్యసూత్రములు–** గృహస్థాశ్రమమున నిర్వ హింపవలసిన కర్మలను వివరించు సూత్రములు. ఆశ్వలాయన, శాంఖాయన, పారస్కర గృహ్యసూత్రములు ప్రసిద్ధమలైనవి.

**03) ధర్మసూత్రములు–** సాధారణముగ అందరును ఆచరింపవలసిన కర్మలను వివరించు సూత్రములు. చాతుర్వర్ణ్య ధర్మములు, చతురాశ్రమ ధర్మములు ఇందు విపులముగ చెప్ప బడినవి. దాయవిభాగము, స్త్రీవిద్య, నిత్యనైమిత్తికకర్మలు, గృహస్థుని దినచర్య ఇందు చెప్పబడినవి.

**04) శుల్బసూత్రములు–** యజ్ఞశాలాదినిర్మాణ విధా నమును వివరించు సూత్రములు.


ఈ విధంగా వేదసాహిత్యాన్ని వెన్నంటి ఉన్న వేదాం గాలను కూడ అధ్యయనం చేయడంవల్ల వేదార్థాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోగలం.

# భాస్కరశతకం

స్థానము తప్పివచ్చునెడఁ దా నెటువంటి బలాఢ్యుఁడున్ నిజ
స్థానికుఁడైన యల్పునికంతంబున నైనను మోసపోవుఁగా
కానలలోపల న్వెడలి గంధగజం బొకనాఁడు నీటిలోఁ
గానక చొచ్చినన్ మొసలికాటుకులోఁబడదోటు భాస్కరా!

**ఎంత బలము గలవాడైనా, తన స్థానము విడిచి వేరొక చోటికి వెళ్లినప్పుడు, స్థానబలము గల ఒక అల్పుని చేత మోసగింపబడవచ్చు. పూర్వము ఒక ఏనుగు కొలనులో నీరు త్రాగబోయి ఒక మొసలి చేత చిక్కుపడెను కదా!**

– కవి మారన



### 108 దివ్యదేశాలు

# తిరుకపిస్థలమ్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

పరమపురుషుడైనటువంటి శ్రీమన్నారాయణుడు శాపగ్రస్తులైన ఇంద్రద్యుమ్నునికి, హూహూ అనేటువంటి ఒక రాక్షసునికి శాపవిమోచనాన్ని కలిగించి మోక్షాన్ని ప్రసాదించినటు వంటి దివ్యదేశమే ఈ 'తిరుకపిస్థలం'. అలాగే కపి వానరం. హనుమంతునికి ఈ దేవదేవుడు రాముడిలాగా దర్శనభాగ్యాన్ని కల్గించినందువల్ల ఈ స్థలాన్ని 'కపిస్థలమ్' అని కూడా వ్యవహరిస్తారు. గజేంద్రమోక్షవృత్తాంతం ఎన్నోపురాణాలలో, ఆళ్వారుల యొక్క శ్రీసూక్తములో కూడా కన్పిస్తూంటాయి. ఈ కపిస్థలక్షేత్రాణ్ణి ఒకే ఒక ఆళ్వారు అంటే తిరుమళిశైఆళ్వారు వారు మాత్రమే మంగళాశాసనం చేసి ఉన్నారు.

ఈ క్షేత్రం కావేరీనదీతీరంలో దాదాపు 0.35 ఎకరా స్థలంలో పెద్దప్రాకారంతో, రాజగోపురంతో, శిల్పకళానైపుణ్యంతో విరాజిల్లుతున్నది. కుంభకోణం నుండి తిరువైయ్యార్ వెళ్లేటు వంటి మార్గంలో పాపనాశం రైల్వేస్టేషన్‌కి మూడుకిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం అమరియున్నది. 'తిరుకపిస్థలమ్', 'కృష్ణా రణ్యక్షేత్రమ్' అని కూడా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఉన్నటువంటి స్వామి 'గజేంద్రవరదుడు'. 'కణ్ణన్' అని కూడా ఈ స్వామిని కీర్తిస్తూంటారు. అమ్మవారు 'రమామణివల్లి'.

ఈ ఆలయం యొక్క విమానం గగనాకారవిమానం. తూర్పుముఖం, భుజంగశయనం. హనుమంతునకు గరుత్మంతు నికి కూడా ప్రత్యక్షం. తిరుమళిశైఆళ్వార్ కీర్తించినటువంటి క్షేత్రమిది. 108 దివ్యదేశాలలో 5 క్షేత్రాలకు కృష్ణారణ్య క్షేత్ర మనేటువంటి వ్యవహారం కలదు. ఆ అయిదు కూడా *'తిరు కణ్ణంగుడి', 'తిరుకణ్ణమంగై', 'తిరుకణ్ణపురం', 'తిరుక్కోవిలూర్'* అలాగే ఈ క్షేత్రం *'తిరుకపిస్థలమ్'.* ఈ అయిదు క్షేత్రాలు కృష్ణా రణ్యక్షేత్రంగా వ్యవహరింపబడుతుంది.

## స్థలపురాణం

భక్తియోగంచేత భగవదనుగ్రహం లభిస్తుందని శాస్త్రం. ఈ భక్తియోగాన్ని అవలంబించినటువంటి పాండ్యదేశరాజు ఇంద్రద్యుమ్నుడు అతని యొక్క చరిత్రయే గజేంద్రమోక్షం అని చెప్పబడుచున్నది. పాండ్యరాజు ఇంద్రద్యుమ్నుడు శ్రీమన్నా రాయణునియందు అమితమైనటువంటి భక్తి కలవాడు. సర్వ దేశసర్వకాల సర్వావస్థలయందు కూడా ఆ శ్రీమన్నారాయణుణ్ణి ధ్యానిస్తూనే ఉంటాడు. అంచేత ఇతడి రాజ్యం సుభిక్షంగా ఉండేది. శ్రీమన్నారాయణుడు ఇంద్రద్యుమ్నుడికి మోక్షాన్ని ప్రసాదించాలి అనేటువంటి ఉద్దేశ్యంతో ఒక చిన్ననాటకాన్ని ఆడుతాడు.

అందులో ఒకానొక సందర్భంలో ఇంద్రద్యుమ్నుడు దేవదేవుణ్ణి ధ్యానం చేస్తున్నటువంటి సందర్భంలో దుర్వాస మహర్షి అచటికి వచ్చాడు. ఈ రాజు భక్తివిశేషం చేత ఎవ్వరిని కూడా చూడలేదు. ధ్యాన మగ్నుడైయున్నాడు. ఈ భక్తియోగంలో ఉన్నటువంటి రాజు తన యొక్క కళ్ళను మూసుకోకుండా అలాగే తెరిచి ధ్యానం చేస్తూ ఉన్నాడు. ఇది చూసినటువంటి దుర్వాస మహర్షి తాను వచ్చినా కూడా చూడనట్టు ఇతడు ఇలా ఉన్నాడా? లేక ధ్యానం చేస్తున్నట్టు నటిస్తున్నాడా? సందేహించి తనను అవమానించినటువంటి ఇంద్రద్యుమ్నుణ్ణి ఒక ఏనుగుగా మారమని శాపం ఇచ్చాడు. భగవంతునియందు ఉన్మత్తుడైనటు వంటి రాజు తనయొక్క తప్పును తెలుసుకుని ఆ దుర్వాస మహర్షిని 'స్వామీ! మీరు శాపమిచ్చారు. నన్ను ఏనుగుగా అవమన్నారు. నాది ఒకే ఒక కోరిక. ఈ ఏనుగు జన్మలో కూడా నేను దేవదేవుణ్ణి ఎల్లప్పుడూ స్మరించేటట్టు అనుగ్రహించ మని' వేడుకోగా ఆశ్చర్యంతో దుర్వాసమహర్షి 'ఆహా! శాప విమోచనం ఏమిటి? అని అడగకుండా ఈ రాజు నేను భగవంతుణ్ణి ఎల్లప్పుడు కూడా సేవించుకుంటూ ఉండాలి' అని



అడిగాడే, ఎంత దుఃఖం కలిగినా కూడా భగవంతుణ్ణి వదిలి పెట్టనటువంటి భక్తి ఇతనికి ఉన్నదని చాలా సంతోషపడి, "నీవు అనుకున్న విధంగా జరుగును" అని చెప్పి, "మొసలిబారినపడి నటువంటి నిన్ను శ్రీమన్నారాయణుడే రక్షిస్తాడని, లక్ష్మీవల్లభుడు నీ ఎదురుగా వచ్చి నిన్ను అనుగ్రహిస్తాడు" అని మహర్షి శాపమిమోచనమార్గాన్ని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ సమయంలోనే 'హూహూ' అనేటువంటి ఒక రాక్షసుడు తామరపుష్పాలతో నిండినటువంటి ఒక కొలను లోపల ఉండి, ఆ కొలనులో ఎవరైతే స్నానానికి వస్తారో వారి కాళ్ళను పట్టుకొని హింసించడం మొదలుపెట్టాడు. ఈ ప్రకారంగా అందరిని హింసిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతూఉన్నాడు. ఇలా ఉన్నటువంటి సందర్భంలో అగస్త్యమహర్షి ఆ తటాకానికి రావడం, అతణ్ణి కూడా హింసించడం, ఆ మహర్షి నీవు ఒక మొసలిగా మారిపొమ్మని శాపమివ్వడం జరిగింది.

ఆ 'హూహూ' తాను చేసినటువంటి తప్పును తెలుసు కొని, అగస్త్యమహర్షిని శాపవిమోచనాన్ని వేడుకోగా, మహర్షి కూడా ఈ తామర తటాకంలో తామరపుష్పాన్ని కోయడానికి భగవంతుని యందు అమితమైనటువంటి భక్తి కలిగినటువంటి ఒక గజేంద్రుడొస్తాడు. ఆ గజేంద్రుణ్ణి నీవు పట్టుకుంటే నీకు శాపం తీరుతుంది అని చెప్పడం జరిగింది.

శ్రీహరియొక్క భక్తుడైనటువంటి గజేంద్రుని రాక కొరకు ఆ మొసలి (హూహూ) ఎన్నో సంవత్సరాలు కాచుకొని ఉన్నది. ఈ శాపంచేత ఏనుగుగా మారినటువంటి ఇంద్ర ద్యుమ్నుడు, భగవంతునికి పుష్పాన్ని సమర్పించాలనేటువంటి ఉద్దేశ్యంతో ఈ తటాకానికి రావడం జరిగింది. ఆ సమయంలో



అందలి మొసలి ఈ ఏనుగుయొక్క కాళ్ళను గట్టిగా పట్టుకొన్నది. ఏనుగుకు స్థలంలో బలం, మొసలికి జలంలో బలం. మొసలి బలంగా జలానికి ఏనుగుని లాగుతుంటే, ఏనుగు బలంగా ఆ జలంనుండి స్థలానికి లాగుతున్నది. ఇలా వేల సంవత్సరాలు ఏనుగుకి మొసలికి యుద్ధం జరిగింది. తర్వాత ఏనుగు అశక్తుడై తనను కాపాడేటువంటి దైవం భగవంతుడొక్కడే అని తెలుసుకొని ఆ గజేంద్రుడు అతణ్ణి 'అనంతా! గోవిందా! నన్ను కాపాడవా! నన్ను రక్షించవా!' అని ఎలుగెత్తి పిలువగా, ఆ ఏనుగు యొక్క అవస్థను చూసినటువంటి భగవంతుడు, తన భక్తుణ్ణి రక్షించా లనేటువంటి ఉద్దేశ్యంతో గరుత్మంతుని పై వచ్చి వెంటనే చక్రా యుధాన్ని ప్రయోగించి మొసలి తలను నరికి, ఏనుగును కాపాడి, తన నిజస్వరూపంతో స్వామి ఏనుగుకి ప్రత్యక్ష మయ్యాడు. అందువల్ల 'గజేంద్రవరదః' అని ఈ స్వామికి పేరు. గజేంద్రుణ్ణి రక్షించాడు కనుక 'గజేంద్రవరదుడు' అనే పేరు కల్గింది. ఏనుగుకు, మొసలికి కూడా మోక్షాన్ని ప్రసాదించినటు వంటి దేవదేవుడు గనుక ఈ 'కపిస్థలమ్' చాలా ప్రసిద్ధమైనది. కనుక ఎవరైతే ఈ దివ్యదేశానికి వచ్చి ఆ స్వామిని వేడు కుంటారో, వారి మనోరథాలనంతా కూడా స్వామి పూర్తి చేస్తాడు. రమామణివల్లితాయార్ సమేతుడై నటువంటి గజేంద్రవరదుణ్ణి సేవించి మనం దేవదేవుని యొక్క కృపాకటాక్షములకు పాత్రులౌతాం.

*శ్రీమద్గజేంద్ర సరసీ కపిలాఖ్య తీర్థ ।*
*సంశోభితే శుభ కపిస్థల దివ్యదేశే।*
*దేవ్యా రమామణిలతాహ్వయయా సమేతో।*
*దేవో గజేంద్ర వరదో భుజగేంద్ర శాయీ।*
*వైమానమస్య వర కారక నామధేయం।*
*దేవేశ దిగ్వదన సంస్థితి శోభమానః।*
*నాగాధిరాజ మరుదాత్మజ సేవిత్గాఙ్గః*
*శ్రీభక్తిసారమునిరాజ నుతో విభాతి ।*

*పా॥ కూ్ట్రముమ్ శారా కొడువినై యుమ్ శారా; తీ*
*మాట్రముమ్ శారా వగై అఱిన్దేన్- ఆట్రం*
*కరై కిడక్కుమ్ కణ్ణన్ కడల్ కిడక్కుమ్, మాయన్*
*ఉరైక్కిడక్కుమ్ ఉళ్ళత్తెనక్కు.*
*(తిరుమళిశై ఆళ్వార్-నాన్ముగన్ తిరువన్దాది 50 పా.)*



కపిస్థలదివ్యక్షేత్రంలో స్వామిని 'గజేంద్రవరదుడు'- అమ్మవారిని 'రమామణివల్లి' అని పిలుస్తారు

# తిరుప్పావై సౌరభం

- డా॥ ఎం. వేంకటాచార్యులు



గోదాదేవి శ్రీకృష్ణుని అనుగ్రహం కోసం "తిరుప్పావై" వ్రతాన్ని శ్రీవిల్లిపుత్తూరులోని తన స్నేహితురాండ్రతో కలిసి ఆచరించి, తాను ఆచరించిన ఆ వ్రతవిధానాన్ని మనకు తెలియజేసింది. అదే "తిరుప్పావై" ప్రబంధం. తిరుప్పావై ప్రబంధంలో 30 పాశురాలు ఉన్నాయి.

ఈ 30 పాశురాలలోని భావాల పరిమళాలను
మన 'సప్తగిరి' పాఠకులకోసం అందిస్తోంది.
ఆస్వాదిస్తాం. రండి.....!!!



**మొదటి పాశురం- మార్గళి...**

రేపల్లెలోని కన్నియలారా! ఇది మార్గశిరశుక్లపక్షం. మనం నారాయణస్వరూపుడైన శ్రీకృష్ణుని ఆరాధిస్తే, అతడు మన వ్రతానికి కావలసిన 'పఱై' అనే వాద్యాన్ని ఇస్తాడు. రండి..

**రెండవ పాశురం- వైయత్తు...**

ఈ వ్రతసమయంలో నియమంగా ప్రతిరోజూ ప్రాతః కాలంలోనే స్నానం చేద్దాం. మనం పాలను తాగవద్దు. కాటుకను, పూలను ధరించవద్దు. పరుషమైన మాటలను పలుకవద్దు. పెద్దలను సత్కరిద్దాం. భిక్షను పెడదాం.

**మూడవ పాశురం- ఓంగి...**

త్రివిక్రమస్వామిని మనం ఉషఃకాలంలో స్నానం చేసి కీర్తిస్తే, నెలకు మూడు మార్లు వర్షాలు కురుస్తాయి. ఏనాడు తరగని సంపద లభిస్తుంది.

**నాలుగవ పాశురం- ఆళిమళైక్కణ్ణా!...**

ఓ మేఘమా! నీవు సముద్రంలోని నీటిని తాగి, ఆకాశంలోకి వచ్చి, మా వ్రతానికి కావాల్సిన వర్షాన్ని బాగా కురిపించవా!

**ఐదవ పాశురం- మాయనై...**


మధురాధిపతి, గొల్లకులానికి మంగళదీపమైన శ్రీకృష్ణుని స్తుతించి, పూలను సమర్పించి, ధ్యానించి, వ్రతం చేస్తే, మన పాపాలన్నీ నిప్పులో పడిన దూది వలె నశిస్తాయి.

**ఆరవ పాశురం- పుళ్ళుమ్...**

బాలికా! పక్షులు కూస్తున్నాయి. దేవాలయంలో శంఖ ధ్వని వినిపిస్తోంది. పూతన పాలను తాగిన భగవంతుని తమ హృదయంలో ధ్యానిస్తూ యోగులు పలికే హరినామం స్పష్టంగా వినబడుతోంది. లేచి రా.

**ఏడవ పాశురం- కీశు కీశు...**

ఓ పిచ్చిపిల్లా! భరద్వాజపక్షులు చేసే 'కీచు కీచు' శబ్దాలు వినబడ్డం లేదా? రేపల్లెలోని గృహిణులు నిద్రలేచి పెరుగును చిలికే ధ్వనిని వినలేదా? కేశవుని మనం కీర్తించాలి. లేచి రా.



ఎనిమిదవ పాశురం- **కీళ్వానమ్...**

బాలికా! తెల్లవారింది. గేదెలు పచ్చికను మేయడం కోసం పోతున్నవి. గోపికలంతా శ్రీకృష్ణుని కీర్తించడం కోసం వెళుతున్నారు. నీకోసం వారిని పోకుండా నిలిపాను. దేవాధి దేవుని కీర్తిస్తే, ఆ స్వామి మనపై దయ చూపుతాడు రా!

తొమ్మిదవ పాశురం- **తూమణి మాడత్తు...**

మణిమయభవనంలో దీపాల మధ్య నిద్రపోయే మేన మామ కూతురా! లేచి రా.అత్తా! నీవైనా ఈమెను నిద్ర లేపు. నీ కూతురు మూగదా? లేక, ఆమెకు చెవుడా? మాధవుని నామా లను మేమందరం కలిసి కీర్తించాలి. ఆమెను రమ్మని చెప్పు.

పదవ పాశురం- **నోత్తు...**

బాలికా! తలుపు తీయకపోయినా, కనీసం సమాధాన మైనా చెప్పవా? నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుని మనం కీర్తిస్తే, మనకు వాద్యాన్ని ఇస్తాడు. కుంభకర్ణుడు చనిపోతూ తన గాఢనిద్ర నీకు ఇచ్చాడా. ఏమి? తలుపు తెరువు.

పదకొండవ పాశురం- **కట్రు క్కఱవై...**

గోసంపదను కలిగిన, పాలను తీయడంలో సమర్థు డైన, గోపాలకుని వంశంలో మెరిసే బంగారుతీగా! మన సఖులు అందరూ వచ్చి, నీ వాకిట నిలుచున్నారు. శ్రీకృష్ణుని కీర్తించినా, నీవు లేచి రావడం లేదే! దీని అర్థమేమి?

పన్నెండవ పాశురం- **కనైత్తు...**

శ్రీకృష్ణుని సేవలో గోరక్షణను కూడా మరచే గొప్ప భగవత్కైంకర్య సంపదను కలిగిన గోపాలుని చెల్లెలా! మన మనసుకు భోగ్యుడైన స్వామిని కీర్తించినా, నీవు నోరు తెరవడం లేదే! నిద్రలే!

పదమూడవ పాశురం- **పుళ్ళిన్ వాయ్...**

బకాసురుని, రావణుని వధించిన స్వామిని పాడుతూ గోపికలంతా వ్రతస్థలాన్ని చేరారు. అందమైన కన్నులను కల గోపికా! లేచి రా, మాతో చేరు.

పధ్నాలుగవ పాశురం- **ఉంగళ్ పుళైక్కడై...**

ఓ గోపికా! నీ పెరటిబావిలో ఎర్రతామరలు పూచాయి. కలువలు ముడుచుకున్నాయి. సన్యాసులు భగవత్సేవ కోసం ఆలయానికి వెళ్తున్నారు. ఇంకా నిద్రపోతున్నావా! భగవంతుని కీర్తిద్దాం. లేచి రా!

పదిహేనవ పాశురం- **ఎల్లే!**

లేత చిలుకవంటి గోపికా! లేచి రా. నీవు మాటల్లో చాలా సమర్థురాలవని తెలుసు. తోటి గోపికలంతా వచ్చారు. శ్రీకృష్ణుని మాతో కలసి కీర్తించాలి. రండి!



పదహారవపాశురం- *నాయక నాయ్...*

నందగోపాలుని గృహాన్ని రక్షించేవాడా! మణిమయ కవాటాలను తెరువు. చిన్న గొల్ల పిల్లలం. మాకు శ్రీకృష్ణుడు వాద్యాన్ని ఇస్తానని మాటిచ్చాడు. మమ్మల్ని లోపలకు పంపించు.

పదిహేడవ పాశురం- *అంబరమే...*

వస్త్రాలను, నీటిని, అన్నాన్ని దానం చేసే నందగోపాలా! స్త్రీకులానికి చిగురు, గోపకులానికి దీపం అయిన యశోదా! ముల్లోకాలను కొలిచిన స్వామీ! అందమైన ఎర్రని కడియాలను ధరించిన బలరామా! నిద్రలేవండి!

పద్దెనిమిదవ పాశురం- *ఉందు మదకళిత్తన్...*

గజసంపద కలిగిన, అపజయాన్ని తెలియని నందగోపాలుని కోడలా! నీళాదేవీ! నిద్రలే! కోళ్లు, కోయిలలు కూస్తున్నాయి. స్వామిని కీర్తించ వచ్చాం. ద్వారంతెరచి మమ్మల్ని ఆహ్వానించు.

పందొమ్మిదవ పాశురం - *కుత్తువిళక్కు...*

గుత్తిదీపాలు వెలుగుతూ ఉండగా, మెత్తని పాన్పుపై నీళాదేవితో కలిసి నిద్రించే స్వామీ! ఒక మాటైనా పలుకు. నీళా దేవీ! ఒక్క క్షణమైనా నీవు పతివిరహాన్ని మాకోసం సహించ లేవా? ఇది తగదు సుమా!

ఇరవైయవ పాశురం- *ముప్పత్తు...*

దేవతల భయాన్ని తీర్చే బలశాలీ! విమలుడా! అందమైన వక్షస్సును కల నీళాదేవీ! నిద్ర లేవండి. మా వ్రతానికి సామగ్రిని ఇచ్చి, మా వ్రతాన్ని పూర్తి చేయించు.

ఇరవై ఒకటవ పాశురం- *ఏత్త కలంగళ్...*

నందగోపుని కుమారా! శ్రీకృష్ణా! నిద్ర లే! నీ శత్రువులు బలాన్ని అంతా కోల్పోయి, నిన్ను స్తుతించేటట్లు, మేము కూడా మా దురభిమానాన్ని వదలి నిన్ను కీర్తించడానికి వచ్చాము.

ఇరవైరెండవ పాశురం- *అంగణ్ మాజ్ఞాలమ్...*

ఈ భూమిని పాలించిన రాజులందరూ అభిమానాన్ని పోగొట్టుకొని, నీ దగ్గరకు వచ్చి చేరినట్లుగా, మేము కూడా మీ పాదాల దగ్గరకు చేరాము. స్వామీ! ఎర్రని, సూర్యచంద్రుల వంటి నీ నేత్రాలతో కటాక్షించు. మా శాపం తీరిపోతుంది.

ఇరవైమూడవ పాశురం- *మారి మలై ముళైంజిల్...*

వర్షాకాలంలో పర్వత గుహలో నిద్రించే వీరసింహం గుహనుండి బయటకు వచ్చినట్టు, కృష్ణా! నీవు నీ భవనంనుండి వచ్చి, సభలో సింహాసనంలో కూర్చుండి, మా విన్నపాన్ని విను.

ఇరవైనాలుగవ పాశురం- **అన్రివ్వులకమ్...**

ఆ నాడు లోకాలను కొలిచిన స్వామీ! నీ పాదాలకు, నీ బలానికి, నీ కీర్తికి మంగళం. నీ వాత్సల్యగుణానికి, నీ వేలాయుధానికి మంగళం అని నిన్ను స్తుతించి, నీ దగ్గర వాద్యాన్ని పొందాలని నీ దగ్గరకు వచ్చాం. స్వామీ! దయ చూపు..

ఇరవైఅయిదవ పాశురం- **ఒరుత్తి...**

ఒకే రాత్రిలో దేవకికి పుత్రుడవై, యశోద బిడ్డవై రహస్యంగా పెరిగే నిన్ను వధించాలని ప్రయత్నించిన కంసుని కడుపులో నిప్పువలె నిలిచిన కృష్ణా! వాద్యాన్ని మాకనుగ్రహించు. నీ వీరచరిత్రలను గానం చేసి, మా శ్రమను తీర్చుకుంటాం.

ఇరవైఆరవ పాశురం- **మాలే...**

భక్తులపై ప్రేమను కల మణివణ్ణా! ఈ వ్రతాన్ని మేము చేయడం కోసం మాకు నీ పాంచజన్యంవంటి శంఖాలు, పెద్ద 'పఱై' అనే వాద్యం, పల్లాండు పాడేవారు, అందమైన దీపం, ధ్వజం, వితానం అనే వీటిని మాకు అనుగ్రహించు.

ఇరవైఏడవ పాశురం- **కూడారై...**

కూడనివారిని జయించే గోవిందా! నిన్ను కీర్తించి, మేము పొందే గొప్ప సన్మానం ఏమంటే, నీ చేతులద్వారా పలు ఆభరణాలను అలంకరించుకుని, చక్కని వస్త్రాలను ధరిస్తాం. పాలతో, నేతితో నిండిన పాయసాన్నాన్ని నీతో కలిసి భుజిస్తాం.

ఇరవైఎనిమిదవ పాశురం- **కఱవైగళ్...**

గోవులను వనంలో మేపి, జీవించే మేము ఏ జ్ఞానం లేని గొల్లపిల్లలం. అయినప్పటికీ, నీవు మా కులంలో పుట్టడం అనే భాగ్యాన్ని పొందాము. గోవిందా! నీతో మాకు ఉన్న బంధం ఏనాడు నశించనిది. ఏమీ తెలియనివారం. మమ్మల్ని మన్నించి, వాద్యాన్ని అనుగ్రహించు.

ఇరవైతొమ్మిదవ పాశురం- **శిట్రమ్ శిఱుకాలే...**

గోవిందా! గొల్లకులంలో పుట్టిన నీవు, మా సేవలను స్వీకరించక తప్పదు. ఏడేడు జన్మలకు మాకు నీతో సంబంధాన్ని కలిగేటట్లు, దాస్యాన్ని చేసేటట్లు మమ్ములను అనుగ్రహించు.

ముప్పైయవ పాశురం- **వంగక్కడల్...**

మాధవుడు, కేశవుడు అయిన శ్రీకృష్ణుని అందమైన గొల్ల కన్యలు స్తుతించి, ఆ స్వామి వల్ల తాము కోరిన ప్రయోజనాన్ని పొందిన వృత్తాంతాన్ని శ్రీవిల్లిపుత్తూరులోని భట్టనాథుల పుత్రిక 'గోదాదేవి' 30 ద్రావిడపాశురాల్లో తెలియజేసింది. వీటిని అనుసంధించేవారు శ్రీపతి అనుగ్రహాన్ని ఇహపరాల్లో పొందుతారు.



# తిరుప్పావైలో.. క్షేత్రాల ప్రశంస


- డా।। ఈ.ఏ. శింగరాచార్యులు

**"వేదమనైత్తుక్కుమ్విత్తాహుమ్కోదైతమిళ్ళైయెన్దు మైన్దుమ్" (సమస్తవేదమునకు సంగ్రహరూపము గోదాదేవి అనుగ్రహించిన ముప్పదిపాశురాల తిరుప్పావై) అనే సుప్రసిద్ధమైన సూక్తి తిరుప్పావై దివ్యప్రబంధము గొప్పతనమును సూక్ష్మముగా తెలియజేయుచున్నది. అత్యంతసంగ్రహము, అతి విస్తృతమును కాని ఈ దివ్య ప్రబంధానికి నాలాయిరదివ్య ప్రబంధములలో సాటి వేరొకటిలేదు అని పూర్వాచార్యులందరు ఏకకంఠముగా పలికారు. అందుకనే పలువురు మహనీయులు ఇందలి అనర్ఘములైన రత్నములవంటి విశేషాలను తమ వ్యాఖ్యలద్వారా లోకానికి అందించారు. అంతేకాక, ఈ ప్రబంధానికి లోకంలో ఉన్న ప్రచారము, ప్రశస్తి వేరొక ప్రబంధానికి లేదనడం అందరికి తెలిసిన సత్యము. ఇట్టి ప్రబంధంలో గోదాదేవి ఆయా పాశురాలలో దివ్యదేశాల ప్రస్తావన గూఢముగా చేశారని కీర్తి మూర్తులు, మహావిద్వాన్ *ప్రతివాదిభయంకర అణ్ణంగరాచార్య* స్వామివారు అభిప్రాయపడ్డారు. వారి సూక్తిని అనుసరించి ఈ అంశం ఇచట స్థాలీపులాక న్యాయముతో ప్రస్తుతింపబడుతున్నది.**

**'తిరుప్పావై' సూక్తి మాలికలోని 30పాశురాల్లో 30 దివ్యక్షేత్రాలు ప్రశంసించ బడ్డాయి. విష్ణుక్షేత్రాలు అన్నిటిలో శ్రీరంగం, తిరుమల, కంచి, తిరునారాయణపురం (మేల్కోట) అనే నాలుగు ప్రధానక్షేత్రాలను *"శ్రీరంగమంగళ మణిం కరుణానివాసం, శ్రీవేంకటాద్రిశిఖరాలయ కాలమేఘమ్, శ్రీహస్తిశైలశిఖరోజ్జ్వల పారిజాతం, శ్రీశం నమామి శిరసా యదుశైల దీపమ్"* అనే సుప్రసిద్ధమైన శ్లోకం సూచిస్తున్నది. ఈ నాలుగుదివ్యక్షేత్రాలు ఏ విధంగా తిరుప్పావైలో సూచింపబడినవో చూద్దాం...**

## శ్రీరంగం


ఈ దివ్యదేశం తిరుప్పావైలోని "మాఱిమలైముళ్ఞల్" అనే 23వ పాశురంలో ప్రస్తావింపబడినది. ఇందులోని "కోయిల్నిన్దుఇజ్ఞనేపోన్దరుళి" అనే ప్రయోగంవల్ల ఈ విషయం స్పష్టపడుతున్నది. శ్రీవైష్ణవసంప్రదాయంలలో 'కోయిల్' అనే పదం శ్రీరంగక్షేత్రానికి వాచకంగా ప్రయోగింపబడుతున్నది. ఈ పాశురంలో భగవానుని గమన సౌందర్యం ప్రధానమైన అంశం. "స్వామీ! ప్రావృట్కాలలో కొండగుహలో నిద్రించే సింహం, ఆ కాలం తీరగానే, నిద్రనుండి లేచి, నిప్పులు కురిసేటట్లు చూస్తూ, సహజమైన సుగంధాన్నికల్గిన జూలును విదల్చుకొని, పైకిలేచి, శరీరాన్ని సాగదీస్తూ, బద్ధకాన్ని తీర్చుకొని, గర్జిస్తూ, ముందుకు గంభీరంగా సాగిపోయేటట్లు, నీవు నిద్రామందిరంనుండి లేచి, సింహగమనంతో వేంచేసి, సభను ప్రవేశించి, అందమైన సింహాసనాన్ని అధిష్ఠించి, మా కార్యాన్ని సఫలం చెయ్యి" అని ఈ పాశురంలో గోపికలు శ్రీకృష్ణుని ప్రార్థిస్తున్నారు. అందువల్ల. ఈ పాశురంలో భగవానుని సింహగతి వర్ణింపబడినది. ఈ విధమైన గమనంతో స్వామి వేంచేసే పద్ధతి శ్రీరంగంలోని ప్రత్యేకతలలో ఒకటి. "శ్రీరంగంలో 'నడైఅళకు', కంచిలో 'కొడైఅళకు', తిరుమలలో 'వడఅళకు' " అనే సామెత ఈ అంశాన్ని బలపరుస్తున్నది. గజగతి, సింహగతి, వృషభగతి– సర్వగతులలో శ్రీరంగంలోని శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి (నంబెరుమాళ్) వేంచేయడం



ఈ నాటికీ ప్రత్యక్షంగా కానవచ్చే విషయం. ఈ విధంగా తిరుప్పావైలోని 23వ పాశురంలో శ్రీరంగక్షేత్రప్రస్తావన ఉన్నదని చెప్పవచ్చును.

## తిరుమల

ఈ క్షేత్రం "కూడారైవెల్లుమ్" అనే 27వ పాశురంలో ప్రస్తావింపబడినది. పాశురంలోని మొదటి, చివరిపాదాలు ఇందుకు ప్రమాణం. వాటిలో క్రమంగా విరోధనిరసనము ('కూడారైవెల్లుమ్' అనుటచే), కలిసి, చల్లగా ఉండడం ('కూడియిరున్దుకుళిరు' అనుటచే) తెలియజేయబడింది. భగవద్రామానుజులకాలంలో తిరుమలఆలయంలోని మూర్తి సుబ్రహ్మణ్య స్వామి అనికొందరు, మరికొందరు శక్తి అని, కొందరు శ్రీమహావిష్ణువు అని వాదించేవారు. పూర్వము స్వామి తనభక్తుడైన తొండమానుకు యుద్ధంలో సహాయపడుటకై తన శంఖచక్రాలను ఇవ్వడంవల్ల శంఖచక్రాలు లేకపోవటంతో ఇట్టి వివాదాలకు అవకాశమేర్పడింది. అపుడు దేశాధిపతి అందరి వాదాలను విని, తానొక నిర్ణయాన్ని గైకొనేందుకు ముందు పెద్దలమాటలను వినుట భావ్యమని తలచెను. ఆ సమయంలో శ్రీవిష్ణుతత్త్వప్రతిష్ఠాపకులుగా జగద్విఖ్యాతినిగాంచి, శ్రీరంగంలో నివసించుచున్న భగవద్రామానుజులను ఆహ్వానించి, వారి అభిప్రాయాన్ని అర్థించారు. అపుడు రామానుజులు అష్టాదశపురాణ వృత్తాంతాలను, ఆళ్వారులసూక్తులను, ఇంకను శిష్టాచార్యులను పెక్కింటిని ఉదహరించి, తిరుమలలోని స్వామి శ్రీమహావిష్ణువేనను వాదమును స్థాపించిరి. అప్పటికిని సంశయించువారికి నమ్మకమును కల్గుటకై రామానుజులొక ఉపాయమును తెలిపిరి. ఆ రాత్రి ఆలయాన్ని మూయడానికి ముందు గర్భాలయంలో శివసూచక చిహ్నములైన త్రిశూలము, డమరు మొదలగు ఆయుధములను, విష్ణుసూచకములైన శంఖచక్రాలను ఉంచి, తలుపును మూయవలెనని, మరునాటి ఉదయమున స్వామి ఏ ఆయుధములను స్వీకరించునో చూచి, స్వామి ఎవరో నిర్ణయించాలనే మాటకు రాజుతోపాటు అందరూ అంగీకరించిరి. రామానుజులు చెప్పిన ఉపాయం యథాతథంగా అనుష్ఠింపబడింది. మరునాటి ఉదయం అందరూ ఆలయం తలుపులను తీసి చూడగా, స్వామి శంఖచక్రధారియై సాక్షాత్కరించెను. స్వామి రూపము శ్రీమహావిష్ణువే అని నమ్మారు. భవిష్యత్తులో జరుగబోయే ఈ వృత్తాంతమును ప్రస్తుతపాశురములోని "కూడారైవెల్లుమ్" అను విశేషణం ద్వారా గోదాదేవి సూచించెను.



ఇక, చివరిపాదములోని "కూడియిరున్దుకుళిర్న్దు" అను ప్రయోగాన్ని తిరుమలనుసూచిస్తుంది. తిరుమలకొండ చల్లని కొండ. వాగులకు, నిరంతర ధారాపాత వర్షమునకు ప్రసిద్ధమగుటచే ఈ ప్రయోగము సముచితమే!

## కంచి (తిరువత్తియూర్) (హస్తిగిరి)

ఈ క్షేత్రము "కీళ్వానమ్" అను 8వ పాశురమున ప్రస్తుతము. ఇందు "దేవాదిదైవనైచ్చెనామ్సే విత్తాల్" అను ప్రయోగం గమనింపదగింది. హస్తిగిరిక్షేత్రములోని స్వామి "దయినాయకన్" (దేవనాయకుడు) అను పేరుతో ప్రసిద్ధుడు. కావున ఈ ప్రయోగము ఆ స్వామిని సూచిస్తున్నది. తిరుప్పావై ప్రబంధంలో 6వ పాశురంనుండి 15వ పాశురంవరకు 10 పాశురములలో పదిమంది ఆళ్వార్లను గోపికలవ్యాజమున గోదాదేవి నిద్రలేపుచున్నదని పూర్వాచార్యుల అభిప్రాయం. ప్రస్తుతపాశురమునగల "కీళ్వానవ్వెళ్లెన్రు", "కోదుకుల ముడైయ" ఇత్యాది ప్రయోగములు నమ్మాళ్వార్లు అనబడు శఠకోపసూరిని సూచించుచున్నవి. అట్లే "దేవాదిదేవ నైచ్చెను" అను ప్రయోగమును ఆ ఆళ్వార్లను సూచించునదియే. శఠకోపసూరి తమ ప్రథమప్రబంధమగు 'తిరువిరుత్తమ్' ప్రారంభంలో...



"ఇమైయోర్గలైవా" (దేవతల ప్రభూ!)అని, చరమప్రబంధమగు తిరువాయ్‌మొళి ప్రారంభంలో "అమరర్కళ్ అధిపతి" (అమరులకు అధిపతి) అని కంచి వరదరాజ స్వామిని సూచించు నామములను అనుసంధించుట ఇచట స్మరింప తగినది.



## తిరునారాయణపురము(మేల్కోట)

ఈ క్షేత్రప్రస్తావన "ఏత్తకలళ్" అను 21వ పాశురంలో ప్రస్తావించారు. ఈ పాశురంలో "పెరుమ్పశుక్కళ్ ఆత్తపడైత్తాన్మగనే" అను ప్రయోగము స్మరణీయము. ఇచట "పెరుమ్పశుక్కల్ ఆత్తపడైత్తాన్" (గొప్ప పశువులను గొప్పగా కల్గినవాడు) అని పల్కుట భగవద్రామానుజులను సూచిస్తుంది. పశు అనుపదము సంస్కృతమున గోవును తెలుపును. గోవు అమృతమువంటి పాలను నిరంతరము ఇచ్చునట్లే, వీరు అమృతతుల్యములైన అర్థవిశేషములను నిరంతరము అనుగ్రహిస్తారు. కావున పశు శబ్దముచే సచ్ఛిష్యులును తెలియచేయబడింది. భగవద్రామానుజుల శిష్యులగు కూరేశులు, దాశరథి, గోవిందభట్టర్ మొదలగు ఆచార్యులు ఎందరో సదాచారనిష్ఠులై, తమ ఆచార్యులనే మఱపించు జ్ఞానవైభవమును కలవారైయుండి రనుట చరిత్ర ప్రసిద్ధము. ఆ రామానుజులకు "మగనే" అనగా యతిరాజసంపత్కుమారులుగా పేరు పొందిన తిరునారాయణ పురక్షేత్ర స్వామియే. అట్లే, ఈ పాశురంలో "ఉలగినిల్తోత్త మాయ్ప్పుళ్ళశుడరే" అను సూక్తియు ఇచట స్వామిని నిర్దేశిస్తుందని చెప్పవచ్చు. ఈ క్షేత్రంలోని స్వామి శ్రీరామానుజులకాలంన పుట్టలోనుండి బయటపడిన వృత్తాంతం ఇందు గూఢముగా సూచింపబడినది.

భగవద్రామానుజులు చోళరాజులవలన కల్గిన ఉపద్రవ కారణముగా మేల్నాడులో (కర్ణాటకప్రాంతమున) నివసించేటప్పుడు ఒకానొక సమయములో తిరునామమును ధరించుటకు అవసరమైన శ్వేతమృత్తిక (తిరుమణ్) దొరకలేదు. శ్వేత మృత్తికను సంపాదించుట ఎట్లు అని చింతించుచు రామానుజులు నిద్రింపగా, ఆనాటి రాత్రి తిరునారాయణపురస్వామి స్వప్నమున సాక్షాత్కరించి "ఇచటికి సమీపమునగల యదుగిరిపై ఉన్న నేను మీరాకకై వేచియున్నాను. మీకు అవసరమైన శ్వేతమృత్తికయూ లభ్యమౌతుంది. వెంటనే ఇక్కడకు రండు" అని పల్కెను. రామానుజులు నిదురలేచి, ఆ విషయమును తమ శిష్యులకు తెలిపిరి. వారు ఆ ప్రాంతమును పాలించు విష్ణు వర్ధనరాయల సహాయముతో వనమును ఛేదించుచు క్రమముగా యదుగిరిని రామానుజులతోపాటు చేరారు. కాని, అక్కడ తిరు నారాయణపురస్వామి కనుపించకపోవటంతో రామానుజులు చింతాక్రాంతులయ్యారు. మళ్లీ ఆనాటిరాత్రి రామానుజులకు స్వప్నమున కనిపించినస్వామి "ఇచటికి దగ్గరలోగల కల్యాణ సరస్సునకు నైఋతిదిశలో సంపంగివనమునకు సమీపమునగల తులసిచెట్టుక్రిందగల పుట్టలో మేము ఉన్నాము. మీరు కోరిన శ్వేతమృత్తిక సరస్సునకు వాయవ్యమున గలదు. మా ఆజ్ఞవలన గరుత్మంతుడు శ్వేతద్వీపమునుండి మృత్తికనుతెచ్చి, ఇచట నిక్షిప్తముచేసెను. మా అనుగ్రహమువలన దానికి తరుగులేదు. దుఃఖింపకుడు" అని పల్కెను. రామానుజులు ఆ విధముగానే కల్యాణసరస్సునకు సమీపములోని తులసివృక్షంక్రింద మట్టిని తొలగింపగానే "కమపి యదుగిరిస్థం కాంతి సింధుం దదర్శ" అనురీతిలో అపూర్వమైన కాంతిసముద్రమనదగిన స్వామి మూర్తిని దర్శించారు. పిమ్మట ఆ విగ్రహమును అచట ప్రతిష్ఠించి, ప్రభుసహాయముతో ఆలయమును నిర్మింపచేశారు. ఈ వృత్తాంతమంతయు యాదవగిరి మాహాత్మ్యమను గ్రంథమున విశదముగా వర్ణింపబడింది. ఇక, "శుడరే" అనుటకు "శ్రీశం నమామి శిరసా యదుశైల దీపం" అను సూక్తి స్మరణీయము.


ఈ విధముగా మిగిలినపాశురములలో కూడ చేయబడిన క్షేత్రముల ప్రస్తావనవివరణసాపేక్షమగుటచే, అవకాశమును అనుసరించి ప్రధానములైన పై నాల్గుక్షేత్రముల ప్రస్తావన మాత్రయే ఇందు వివరింపబడినది.

గృహలక్ష్మి

# వీరమాత 'విదుల'

- ఆచార్య కోలవెన్ను మలయవాసిని

మహాభారతంలో పాండవులు మాయాజూదంలో ఓడిపోయి పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం విజయవంతంగా పూర్తి చేశారు. ఏర్పాటు చేసుకున్న నియమం ప్రకారం పాండవులకు దుర్యోధనాదులు వారి రాజ్యాలు వారికి ఇవ్వవలసి ఉంది. కానీ వాళ్ళు అలాంటి ప్రయత్నం ఏమీ చేయలేదు. ఆ సందర్భంలో పాండవులు శ్రీకృష్ణుని కౌరవుల వద్దకు రాయబారిగా పంపారు. రాయబారం వెళుతూ పాండవుల, ద్రౌపది అభిప్రాయం తెలుసుకున్నాడు శ్రీకృష్ణుడు. ధర్మరాజు అయిదు ఊళ్ళు ఇచ్చినా చాలు సంధి



చేసుకు రమ్మన్నాడు. ద్రౌపది మాత్రం తన పరభవాగ్ని చల్లారాలంటే యుద్ధం జరగవలసిందే భీముడు చేసిన ప్రతిజ్ఞలు తీరవలసిందే అంది.

శ్రీకృష్ణుడు హస్తినాపురానికి రాయబారిగా వచ్చాడు. శ్రీకృష్ణుని హితవచనాలు కౌరవులకు నచ్చలేదు. సంధి జరిగే అవకాశమే లేదు అన్నారు.

ఈ పరిస్థితిని శ్రీకృష్ణుడు తన మేనత్త కుంతీదేవికి వివరించాడు. కుంతి పాండవులు అరణ్య- అజ్ఞాత వాసాలు చేసినంత కాలం హస్తినాపురంలోనే ఉంది.

ఆ సందర్భంలో కుంతి శ్రీకృష్ణునికి విదుల వృత్తాంతం చెప్పి- ధర్మరాజుకు ఈ కథ చెప్పు అంది.

పూర్వం ఆత్మాభిమానవంతురాలు, విద్యావంతురాలు అయిన ఒక క్షత్రియ వనిత ఉండేది. ఆమె పేరు విదుల. ఒక మహావీరుని భార్య ఆమె. వారికి ఒక కుమారుడు. అతడు పేరు సంజయుడు.

ఒకప్పుడు సంజయుడు సింధుదేశపురాజుతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఆ యుద్ధంలో సంజయుడు సింధురాజు చేతిలో చిత్తుగా ఓడిపోయాడు. పరాజితుడై వచ్చి నిరాశతో దుఃఖించసాగాడు.

కొడుకు పరిస్థితిని విదుల గమనించింది. కొడుకును ఉద్దేశించి- ఇలా ప్రబోధించింది.

"నేను కన్నవాడా! ఇప్పుడు నువ్వు నాకు ఆనందాన్ని కలిగించని విధంగా ప్రవర్తిస్తున్నావు. అంతేకాదు శత్రువులకు సంతోషం వృద్ధి పొందిస్తున్నావు. నువ్వు నాకు పుట్టిన వాడివేనా? నీలో పౌరుషం ఏమైంది? ఈ రోజు నువ్వు ఎవరో కొత్త వాడిలా కనిపిస్తున్నావు నా కంటికి. నాయనా! నిన్ను నువ్వు తక్కువ చేసుకోకు. అల్ప విషయంతో సరి పెట్టుకోవడానికి ప్రయత్నించకు. మనస్సు దిట్ట పరుచుకో. భయం వదిలిపెట్టు. ఓడిపోయి వచ్చి ఇలా శవంలా పడుకొని- ఆత్మాభిమానం లేనివాడవై ప్రవర్తించకు" అంది.

మాతృదేవి వాక్కులు ప్రేమపూరితాలయితే చాలదు. ఆమె సంకల్పం గంభీరం కావాలి. ఉద్గమన శీలమైన బుద్ధిని నీకు అందించాలి.



మాతృదేవి వాక్కులు ప్రేమపూరితాలయితే చాలదు

'చూడు కుమారా! శత్రువుల చేతిలో ఓడిపోయి- ఇలా చప్పగా చల్లారి పోయావేమిటి? నీలాంటి వీరుడు ఇది కాదు చేయవలసింది. లే! పూనిక వహించు! తిందుకం అనే కర్రలా- నిప్పు రవ్వల చిమ్ముతూ భగ్గుమని ముహూర్తం కాలం పాటైనా మండు. అంతేకానీ- ఊకనిప్పులా చాలా సేపు పొగ చిమ్ముతూ మంట లేకుండా- ఎలాగో అలా జీవిస్తే చాలులే అన్నట్లుగా జీవించకు' అంటూ-

'ప్రియ పుత్రా! నీకు మీ తండ్రి నేను కలసి ఆలోచించి ఎంతో ప్రేమతో సంజయుడు అని పేరు పెట్టుకున్నాం. దాని అర్థం- పూర్తిగా జయశీలం కలవాడని కదా! కానీ ఇప్పుడు నీలో నాకు ఆ లక్షణాలేవీ కనబడటం లేదు. మేం పెట్టిన పేరు వృథా చేయకు. సార్థకం చేసుకో. మాకు సంతోషం కలిగించు.

సంజయో నామతశ్చ త్వం న చ పశ్యామి తత్త్వయి।
అన్వర్థనామా భవ మే పుత్ర మా వ్యర్థనామకః ॥
(మహాభారతం ఉద్యోగ-134-7)

'ఒకసారి ఓడిపోయాను కదా! అని నిరాశలో కూరుకు పోకు. ఇతర రాజులను కూడగ కట్టుకో. మంచిధైర్యంతో ఉండు. జయించగలను అనే నమ్మకం కలిగి ఉండు. దీని కోసం కృషి చేయి. ఏ కోరికా లేకుండా ఉండకు. క్షత్రియుడయిన వాడు యుద్ధోన్ముఖుడు కావాలి. లే! బయలుదేరు. నన్ను వీరమాతగా నిలబెట్టు' అంటూ ప్రబోధించింది.

ఆ మాతృమూర్తి ఉత్సాహపూరిత వచనాలు విని సంజయుడు- 'తల్లీ! నీమాటలతో నాకు ధైర్యం, ఉత్సాహం కలిగాయి. ఇదుగో యుద్ధానికి సిద్ధమై వెళ్తున్నాను. దీవించు' అని నమస్కరించాడు. విదుల 'విజయోస్తు!' అని దీవించింది. సంజయుడు శత్రుసంహారం చేసి విజయుడై తిరిగి వచ్చాడు. విదుల పరమానందభరితురాలైంది. వీరమాతను అని గర్వ పడింది. అని కథ ముగించి- 'కృష్ణా! ఏ క్షత్రియ స్త్రీ అయినా ఎప్పుడైనా-కంటే సంజయుని వంటి వీరపుత్రుణ్ణి కనాలి అనుకుంటుంది.' అని ధర్మరాజుకు చెప్పానని చెప్పు అనికోరింది. కుంతీమాత సందేశంలో ఆంతర్యం గ్రహించి ధర్మరాజు యుద్ధం చేసి విజయుడయ్యాడు. విదులవంటి వీరమాతలు పుట్టిన పుణ్యభూమి భరతభూమి.

# శ్రీకృష్ణామృతం..



గోకుల కృష్ణుని కథనాలూ
కదురమ్యాలూ ఆనందాలూ

నోట భువనమట ఔరా ఔరా
నుదువు గీతయట ఔరా ఔరా
నిగమ వేణువట ఔరా ఔరా
నిగ్గు హసితమట ఔరా ఔరా

మల్లయోధుడట ఔనా ఔనా
ముదితవలువ దోచెనట ఔనా ఔనా
మెండు వెన్నదొంగయట ఔనా ఔనా
మెఱయు ముద్దుమోముయట ఔనా ఔనా

గరుడగమనుడట చిత్రములేగా
గిరిని ఎత్తెనట చిత్రములేగా
గజమదమునణచెనట చిత్రములేగా
గండములెన్నొదాటెనట చిత్రములేగా

పిలువ పలుకునట మోదములేగా
పడితే విడువడట మోదములేగా
పట్టుగట్టిదట మోదములేగా
పదమె ముక్తియట మోదములేగా

గోకులకృష్ణుని కథనాలూ
కదురమ్యాలూ ఆనందాలూ

- 'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు


# కృత్తికా దీపోత్సవం

**- శ్రీ జె. అనిల్‌కుమార్**

### కోటిదివ్వెలకాంతుల్లో తిరుమలకొండలరాయని ప్రాంగణం!

ఏడుకొండల స్వామికి ఏటా జరిగే వార్షిక ఉత్సవాలు ఎన్నెన్నో! వాటిల్లో అద్భుతమైన ఆనందకరమైన వార్షిక ఉత్సవం 'కృత్తికా దీపోత్సవం'. ప్రతి సంవత్సరం తమిళ కార్తిక పున్నమి వేళ సాయం సంధ్యాసమయంలో తిరుమలేశుని ప్రాంగణంలో కొనసాగే నేతి దీపాల ప్రజ్వలన వేడుక చాల రమణీయంగా, కమనీయంగా కొనసాగుతుంది.

ఆనాడు సాయంకాలం శ్రీనివాసుడి తోమాలసేవ, అర్చన, నివేదనాలంకారానంతరం శ్రీవారిసన్నిధినుండి ఆలయ అర్చకస్వాములు, జియ్యంగార్లు, అధికారులు, సిబ్బంది మంగళ వాద్యాలతో కొత్త పెద్దమట్టి మూకుళ్లతో నేతిజ్యోతులను వెలిగించి శ్రీవారిగర్భాలయంలోను, జయవిజయుల దగ్గరా, గరుడాళ్వార్ దగ్గర, శ్రీవరదరాజస్వామి సన్నిధిలోనూ, పోటు వకుళమాత దగ్గరా, విమానవేంకటేశ్వరుని దగ్గరా, విష్వక్సేనుల దగ్గరా, శ్రీభాష్యకారులసన్నిధిలోను, శ్రీయోగనరసింహస్వామిసన్నిధిలోను, బంగారుధ్వజస్తంభం, బలిపీఠాలదగ్గరా, శ్రీవారి కల్యాణమండపం



లోను, రంగనాయిక, తిరుమలనాయకమండపం, అద్దాలమండ పాల్లోనూ, శ్రీవారిఆలయం ఎదురుగా ఉన్న శ్రీబేడీఆంజనేయ స్వామి దగ్గరా, చివరకు శ్రీవరాహస్వామివారి ఆలయప్రాంగణం లోను నేతిదీపాలజ్యోతులు ప్రతిష్ఠింపబడతాయి.


ప్రతి సంవత్సరం తెలుగుమార్గశిరపున్నమినాడు (అధిక మాసం వచ్చినప్పుడు తెలుగు కార్తికపున్నమినాడు) సాయంవేళ తిరుమల శ్రీవారిసన్నిధిలో జరిగే **"కార్తిక దీపోత్సవం"**లో ఎలాంటి విద్యుత్తుదీపాలు లేకుండా కేవలం నేతి దీపజ్యోతుల కాంతుల కోటి వెలుగుల్లో ప్రకాశించే శ్రీవారి ఆలయశోభలను దర్శించడానికి వేయికన్నులు చాలవు. కార్తికపున్నమివేళ జ్యోతు లన్నింటికే జ్యోతిస్స్వరూపుడైన శ్రీనివాసప్రభువుల దర్శనం ఎన్నెన్ని జన్మల పుణ్యఫలమో!!

### కపిలేశ్వరస్వామి ఆలయంలో కృత్తికా దీపోత్సవం

ప్రతి సంవత్సరం కార్తికమాసంలో కృత్తికానక్షత్రం ఉన్న రోజున ప్రదోష వేళలో శ్రీకపిలేశ్వరస్వామి సన్నిధిలో 'కృత్తికా దీపోత్సవం' మహావైభవంగా జరుపబడుతుంది. ఈ నక్షత్రం కార్తికపౌర్ణమిరోజే రావచ్చును లేదా మరునాడు రావచ్చును ప్రదోషకాలంలో కృత్తికానక్షత్రం ఉండడమే ప్రధానంగా నిర్ణ యించి ఈ దీపోత్సవం జరుపబడుతున్నది. ఉదయం సుప్ర భాతం మొదలుకొని మధ్యాహ్న వేళవరకు అన్ని పూజావిధులు నివేదనలు జరుపబడుతవి. ఆ తర్వాత సాయంత్రం శ్రీకామాక్షీ కపిలేశ్వరస్వామివారలకు అభిషేకాదులు, సహస్రనామార్చనలు మహా నివేదనలు పూర్తి చేస్తారు. పిదప ప్రదోషకాల పూజా సందర్భంలో పంచవాద్య మహానాదసమ్మేళన పూర్వకంగా మహా మంగళహారతి ఈ విధంగా నిర్వహింపబడుతుంది.

ఈ కార్తిక కృత్తికాదీపోత్సవంనాడు విశేషంగా వేలాది మంది భక్తులు శ్రీకపిలేశ్వరక్షేత్రాన్ని సందర్శిస్తారు. అంతేకాదు పుణ్యస్త్రీలు, కన్యలు, పూర్వసువాసినులు.... ఇలా అందరూ కృత్తికాదీపోత్సవంనాడు శ్రీకపిలేశ్వరఆలయంలో తమకు నచ్చిన చోట తమకు తోచిన సంఖ్యలో ప్రమిదలు వెలిగిస్తారు.

ముఖ్యంగా శ్రీకపిలేశ్వరస్వామివారి కల్యాణమండపంలో దేవస్థానం సిబ్బందిచేత పానవట్టంతో కూడిన శివలింగాకారంలో త్రిశూలాకారంలోను, చిత్రం గీసి, ప్రమిదజ్యోతులు వెలిగిస్తారు. శివుడు లింగరూపంలో సాక్షాత్తు జ్యోతి-స్స్వరూపుడుగా దర్శన మిచ్చి భక్తులను ఆనందింపజేస్తాడు. ఇలా సర్వేసర్వత్రజ్యోతు లతో వెలుగుతున్న కపిలేశ్వరక్షేత్రం కార్తికదీపోత్సవంనాడు వేయివెలుగులతో ప్రకాశిస్తూ మైమరపిస్తుంది.



# శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయం, కార్వేటినగరం

– శ్రీ ఇటుగుల్లపాటి హర్షవర్ధన్


లోకోత్తరసుందరమూర్తి, మహాబలపరాక్రమశాలి, రాజనీతి నిపుణుడు అయిన శ్రీకృష్ణభగవానుడు శ్రీవేణుగోపాలస్వామిగా రుక్మిణీసత్యభామ సమేతంగా కొలువుదీరి పూజలందుకుంటూ ఉన్న క్షేత్రం– కార్వేటినగరం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలో తిరుపతి పట్టణంనుంచి 58 కిలోమీటర్ల దూరంలో కార్వేటినగరం ఉంది.

నారాయణవనంను పరిపాలించిన సూర్యవంశరాజులు ఒకసారి వేటకు ఈ ప్రాంతానికి రాగా కుక్కలను కుందేళ్ళు తరుముతుండడం వారి కంటపడింది. దీనిని చూసి ఆశ్చర్యానికి లోనైన వారు ఈ ప్రాంతంలో ఉన్న అడవిని నరికి ఒక ఊరు నిర్మింపజేశారు. అడవిని నరికి కట్టిన ఊరు కనుక ఈ ఊరికి **'కాడువెట్టి నగరం'** అనే పేరు ఏర్పడింది. అది కాలక్రమంలో కార్వేటినగరంగా మార్పు చెందినట్లు స్థలపురాణం వెల్లడిస్తోంది. 1541వ సంవత్సరంనాటి శాసనం ఈ ఊరిని 'కార్వేడు' అని పేర్కొంది. కార్వేటి అనే దేవత ఈ ప్రాంతంలో కొలువుదీరడం వల్ల ఆమె పేరు మీదే కార్వేటినగరం అని ఈ క్షేత్రానికి పేరు వచ్చినట్లు కూడా ప్రచారంలో ఉంది.

శ్రీకృష్ణభగవానుడు ఈ క్షేత్రంలో కొలువుదీరడం వెనుక ఆసక్తికరమైన స్థల పురాణం ప్రచారంలో ఉంది. పూర్వం ఈ ప్రాంతం నారాయణవనం రాజ్యంలో భాగంగా ఉండేది. ఈ రాజ్యాన్ని సూర్య వంశానికి చెందిన కరికాల చోళుడు పరిపాలించాడు. ఆయన కుమారుడు తొండమాన్‌చక్రవర్తి. తొండమాన్‌చక్రవర్తి మునిమనవడు నారాయణరాజు. తన పూర్వీకుల మాదిరే నారాయణరాజు కూడా దైవభక్తి పరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించిన రాజు. అటువంటి నారాయణరాజు మునిమనుమడైన వెంకటరాజు తన పాలనాకాలంలో కార్వేటి నగరం పాలనను పెరుమాళరాజుకు అప్పగించాడు. పెరుమాళరాజుకు ఒకనాటి రాత్రి స్వప్నంలో శ్రీకృష్ణభగవానుడు సాక్షాత్కరించి ఆలయాన్ని నిర్మించి తనను ప్రతిష్ఠించమని పలికాడు. దీనితో ఆయన కార్వేటినగరంలో ఆలయాన్ని నిర్మించి శ్రీరుక్మిణీసత్యభామసమేత శ్రీవేణుగోపాలస్వామివారిని ప్రతిష్ఠింపజేసినట్లు స్థల పురాణం వెల్లడిస్తూ ఉంది.

కార్వేటినగరంలో విశాలమైన ప్రాంగణంలో కన్నులపండుగ చేస్తూ శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయం దర్శనమిస్తుంది. ఆలయానికి సమీపంలో ఉన్న



పుష్కరిణికి 'స్కందపుష్కరిణి' అని పేరు. ఆలయం తూర్పుఅభిముఖంగా ఉంది. ఆలయ ప్రధానప్రవేశద్వారంపై ఐదుఅంతస్తుల గోపురం, పైభాగంలో ఏడుగోపురకలశాలు ప్రతిష్ఠింపబడి దర్శనమిస్తుంది. ఆలయప్రాంగణంలో ప్రధాన ఆలయానికి ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడాళ్వారుమండపం ఉన్నాయి. ప్రధానఆలయం రంగమండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. రంగమండపంలోని స్తంభాలు శిల్పకళాశోభితమై భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ దర్శనమిస్తాయి. ముఖమండపంలో ఆళ్వారులు కొలువుదీరి ఉన్నారు. ముఖమండపంనుంచి అంతరాలయంలోనికి ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా జయ, విజయులు ద్వారపాలకులుగా కొలువుదీరి దర్శనమిస్తారు.

ప్రధానగర్భాలయంలో శ్రీవేణుగోపాలస్వామివారు శ్రీరుక్మిణీసత్యభామాసమేతుడై కొలువుదీరి పూజలందుకుంటూ ఉన్నాడు. స్వామివారు రెండుచేతులతో వేణువును మీటుతూ గోవును ఆనుకొని దివ్యమంగళ స్వరూపంతో ఉండగా, స్వామివారికి ఇరువైపులా శ్రీరుక్మిణిదేవి శ్రీసత్యభామలు కొలువుదీరి ఉన్నారు. ఆలయప్రాంగణంలో శ్రీకోదండరామస్వామి, శ్రీగోదాదేవి, శ్రీరామానుజాచార్యులు, శ్రీవిష్వక్సేనుడువంటి దేవతామూర్తులను దర్శించుకోవచ్చు.

చారిత్రకంగా పరిశీలిస్తే 17వ శతాబ్దంలో ఆలయం నిర్మించినట్లు తెలుస్తోంది. కార్వేటినగరం పాలకులు ఈ ఆలయాన్ని నిర్మింపచేయడంతోపాటు స్వామివారిని సేవించి తరించారు. కాగా వెంకటపెరుమాళ్‌రాజు 1719లో ఆలయాన్ని పునర్నిర్మించారు. 1930వ సంవత్సరంలో దేవాదాయశాఖ ఈ ఆలయపాలన చేపట్టగా, 1989వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ ఆలయపాలనా బాధ్యతలను స్వీకరించారు. 2006వ సంవత్సరంలో గోపురజీర్ణోద్ధరణ చేసి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

ప్రతిరోజు పూజలుజరిగే కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామివారికి ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వైశాఖబహుళపంచమి నుంచి చతుర్దశి వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. శ్రావణమాసంలో శ్రీకృష్ణాష్టమిపండుగ సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. ధనుర్మాసం, వైకుంఠఏకాదశి, సంక్రాంతి సందర్భంగా కూడా ప్రత్యేకఉత్సవాలు, వేడుకలు జరుగుతాయి.

సంతానప్రదాయకుడిగా పేరు పొంది ఆరాధనలందుకుంటున్న కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామివారిని దర్శించి భక్తులు తరించవచ్చు.

## సర్వమంగళరూపము (కీర్తన)

### (ఆపాదమస్తకం శ్రీనివాస స్తుతి)



సర్వమంగళరూపము,
సర్వము తానై నిండిన రూపము
సర్వము తనలో కల్గిన రూపము,
దివ్యమంగళ రూపము.

బండను భామగ మార్చిన పాదము,
భూ నభములను నింపిన పాదము
బలినే బలిగా కోరిన పాదము,
ముసల శకలము తాకిన పాదము

చరచిన ఊర్వశి తరలొచ్చెడి ఊరువు,
బడలిన రాధ చేరెడి ఊరువు,
చాణూరుడిపై కెక్కిన ఊరువు,
హిరణ్యకశిపుకి చివరిశయ్యయై నిలచిన ఊరువు

వెన్న ముద్దలనుఁ దోచిన హస్తము,
వానర విభుని బ్రోచిన హస్తము
కురుసతి మానము కాచిన హస్తము,
చరణ నేత్రమును* చిదిమిన హస్తము

వలపుల శ్రీదేవి చేరిన వక్షము,
భృగు ఘాతమ్మును ఓర్చిన వక్షము
గోపీ రమణులు ముసరిన వక్షము,
కౌస్తుభమ్ము చే శోభిలు వక్షము

భువన భాండములు చుట్టిన అధరము,
వేణు గానమును వీచిన అధరము
ముద్దుభామలు ముద్దిడు అధరము,
గీతామృతమును పంచిన అధరము

అలిగిన ప్రియసఖి తన్నిన శిరముఁ,
నీలాదేవి నిజ కురులద్దిన శిరముఁ,
కొండపై గోవు ను కాచిన శిరముఁ,
సకల దేవతలు మ్రొక్కిడు శిరముఁ,

*చరణ నేత్రము=
భృగు మహర్షి పాదము నందలి కన్ను

- శ్రీ రవీంద్రబాబు తుపిలి


# యువతలో భక్తి-మౌలిక శక్తి

- శ్రీమతి గంగవరం శ్రీదేవి

యువత అంటే అంతరంగంలో పెల్లుబికే ఉత్సాహం, ధైర్యం, కార్యదీక్షలకు సాకారం! యువత అంటే అపారమేథో శక్తితో, అనన్య సామాన్య ప్రతిభాపాటవాలతో సమస్తరంగాలను జాజ్వలమానంగా వెలిగించే జాతి యశఃకిరణాలు!

మరి ఇంతటి ఘనతరమైన యువశక్తి పెడత్రోవలు పెట్టకుండా తల్లిదండ్రులకు కుటుంబానికీ తలదించుకునే పరిస్థితి రాకుండా ఉండడానికి, నిర్మాణాత్మక కార్యశీలురుగా, జాతి పతాకానికి వన్నె తెచ్చే ప్రతిభామూర్తులుగా విరాజిల్లడానికి కావలసిన మౌలికశక్తి ఎక్కడ ఉంది? అది మన సనాతన ధర్మంలో ఉంది! ఈ భవ్య సంస్కృతిలోనే ఉంది! భారతదేశానికి జీవనాడి అయిన ఆధ్యాత్మికతత్త్వంలో వేదాంత విచారంలో ఉంది! భక్తిభావనలో ఉంది!

భక్తి అన్నది ఎప్పుడో ముసలితనంలో రావలసిన, కావలసిన విషయమనే దురభిప్రాయం మనలో ఉంది. కానీ ఆ భక్తిభావన పిల్లలలో యువతలో ఉండడం వలన సిద్ధించే ప్రయోజనం, అపూర్వపరిణామాలు వెలకట్టలేనివి. భగవంతుడే ఈ సమస్తాన్నీ నడిపిస్తున్నాడనీ, అతని సంకల్పం మేరకే ప్రతిదీ జరుగుతుందన్న అవగాహనతో, ఎరుకతో ఆ భగవద్భక్తి పట్ల ఎనలేని శ్రద్ధాసక్తులు కలిగిన వ్యక్తి అంతరంగపు లోతులు సాత్వికతను సంతరించుకుంటాయి. ఆ మనిషి జీవితం సౌశీల్య వంతమౌతుంది. నిజాయితీ, నిష్కాపట్యం, నిస్వార్థం పరోపకార పరాయణత, సత్యనిష్ఠలాంటి సుగుణాలన్నీ ఆ భక్తిభావాన్ని అంటిపెట్టుకుని ఆ వ్యక్తిలో పాదుకుంటాయి. ఆ దైవభక్తి ఒక క్రమశిక్షణ పూర్వకమైన, నైతికనిబద్ధతో కూడిన స్వచ్ఛమైన హృదయాన్ని, జీవితాన్ని ప్రసాదిస్తుంది. సర్వోన్నతమైన ఆ భగవత్భక్తి నిరంతరం తను చేసే పనులను సాక్షిగా గమనిస్తూ, కనిపెడుతూ మంచికి, మంచి చెడుకు చెడుఫలితాలను ప్రసాదిస్తుందన్న స్పృహ మనిషికి పాపభీతిని కలిగిస్తుంది. ప్రధానంగా ఈ పాపభీతి లేకపోవడం వలననే నేటి మన సమాజంలో అనేక అకృత్యాలు, దుర్మార్గాలు, దౌర్జన్యాలు పెచ్చు పెరిగిపోతున్నాయి. భగవంతుడే అన్నిటినీ నడిపిస్తున్నాడనీ, అతడి సంకల్పం మేరకే అన్నీ జరుగుతాయని తెలుసుకున్న భక్తుడు జీవితంలో సంభవించే సుఖదుఃఖాలకు తీవ్రంగా చలించకుండా అంతా ఈశ్వరేచ్ఛ! అన్న గొప్ప అవగాహనతో సానుకూల దృక్పథంతో సాగిపోతాడు. భక్తి అతనికి ఆశావహ దృక్పథాన్ని, ఆత్మస్థైర్యాన్ని ప్రసాదిస్తుంది. అనేకానేక ఒత్తిడులు, ప్రలోభాలు, ఆకర్షణలు వీటి మధ్య సతమవుతున్న యువతకు ఇది అత్యంత అవసరమైన అంశం కదా? యువకులుగా ఉన్నప్పుడు వారు



కోరుకున్న ఉద్యోగం రాలేదని ఇంటర్వ్యూలో ఫైల్ అవడంతో కలిగిన నిస్పృహతో ఆత్మహత్య సైతం చేసుకోవాలనుకున్నప్పుడు ఎంతో మనోధైర్యాన్ని, నైతిక బలాన్ని నింపుతూ "అంతా భగవత్సంకల్పానుసారమే జరుగుతుంది సహనంతో ఉండు" అన్న పెద్దలమాటలు వారి జీవితంలో గొప్ప మలుపును తీసుకు వస్తాయి.

భక్తిభావన ద్వారా సంక్రమించే ఉన్నత గుణాలు, మానవీయ, సౌజన్య, సౌహార్దభావాలూ, ఉదాత్త సంస్కారాలు కలిగిన యువత ఏ రంగంలో మనుగడ సాగిస్తున్నా ఆ రంగంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన శ్రేష్ఠులుగా, ఆదర్శమూర్తులుగా, ఆదరణీయ వ్యక్తులుగా విరాజిల్లుతారన్నది నిర్వివాద అంశం. అందుకు ఈశావాస్యోపనిషత్ లోని మొదటి శ్లోకాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చు-

**ఈశావాస్యమిదం సర్వం, యత్కించ జగత్యాం జగత్।**
**తేన త్యక్తేన భుంజీథా, మాగృధః కస్య స్విద్ధనం॥**


## ఔదార్యం

**ఉదారభావనే ఔదార్యం. ఒక సమన్వయదృష్టి శాంతి కాముకత సంఘర్షణ లేని వాతావరణం నిర్మాణం కావాలనే ఆలోచన వల్ల ఔదార్యగుణం ఏర్పడుతుంది. దయాదాక్షిణ్యాలు కూడా ఔదార్యానికి మూలాలు. ఒక వ్యక్తిలోని తప్పులకన్నా అతని గుణాలకే ప్రాదాన్యమివ్వాలి. మరణశిక్షవిధించే స్థితి ఉన్నా పశ్చాత్తాప పడేడట్లుగా చేయాలి. శ్రీరాముడు, దుర్యోధనుడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, శ్రీకృష్ణుడు ఔదార్యం చూపించిన ఉదాహణలున్నాయి.**

క్షణభంగురమైన ఈ జగత్తులో నశ్వరమైనదంతా ఈశ్వరునిచే ఆవరింపబడి ఉన్నది. త్యాగంచే ఆలంబన పొందు. పరుల ధనానికి ఆశపడవద్దు అని ఈ శ్లోకభావం.

అటువంటి భక్తిభావన చిరుప్రాయంలోనే పండిచుకొన్న పవిత్రచరితులు, మహిమాన్విత వ్యక్తులు- ఒక ప్రహ్లాదుడు! ఒక ధృవుడు! వీరు ఆదర్శం కావాలి.

**విశ్వదాభిరామం** **వేమన పద్యసూక్తి**



## ధనం దాచుకోగూడదు

**ధనము గూడబెట్టి, ధర్మంబు సేయక,**
**తాను దినక, లెస్స దాచు గాక;**
**తేనె నీగ గూర్చి తెరువరి కియ్యదా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** ధర్మంబు= పుణ్యం; లెస్స= చక్కగా; తెరువరి= దారిలో వెళ్లువాడు, బాటసారి.

**భావం:** ధనం కూడబెట్టి ఇతరులకు దానం చేయక, తానూ తినక చక్కగా దాచుకోవచ్చు. అది తేనెటీగ తేనెను చేర్చిపెట్టి దారిన పోయేవానికి ఇచ్చినట్లుంటుంది.

**వివరణ:** అవసరానికి సరిపడా మాత్రమే ధనం కూడ బెట్టడం ఉత్తమం. కాని అధికంగా పోగు చేయగూడదు. అలా కూడబెడితే దాచిపెట్ట గూడదు. ఆ ధనాన్ని అవసరమైనవారికి దానం చేయాలి. లేదా పదిమందికి ఉపయోగపడే విధంగా ధర్మకార్యాలు చేయాలి. అదీ చేయలేక పోతే కనీసం తాను అనుభవించాలి. ఈ పను లలో ఏదీ చేయకపోతే ఆ ధనం దొంగలకో, రాజులకో ఇంకా ఎవరికో చేరిపోతుంది. తేనెటీగలు పోగుచేసిన తేనె ఇంతే కదా! కష్టపడి తిరిగి తిరిగి ఈగలు తేనెను సంపాదించి తెచ్చుకుని దాచి పెడతాయి. దారిన పోయేవాడు ఆ తేనె కనబడగానే, కూడబెట్టిన ఈగలకు లేకుండా, మొత్తం తీసుకుని అనుభవిస్తాడు.

**- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు**

# తిరుమంగై- తిరుప్పాణ్- తొండరడిప్పొడి
## ఆళ్వార్ల రచనావిశిష్టత


- శ్రీమతి ఈ.విజయలక్ష్మి

*అళ్వార్లు అనబడే దివ్యసూరులు అందరూ శ్రీమన్నారాయణుని అనుగ్రహంచేత తత్త్వజ్ఞానాన్ని పరిపూర్ణంగా పొందినవారు. ఆళ్వారులు పన్నెండుమంది. వారిలో, తిరుమంగై ఆళ్వార్, తిరుప్పాణ్ అళ్వార్, తొండరడిప్పొడి ఆళ్వార్ అనే ముగ్గురు ఆళ్వారులప్రబంధాలలోని సారాన్ని సంగ్రహంగా తెలిసికొందాం...*

### తిరుమంగై ఆళ్వారులు

ఆళ్వారుల వరుసలో వీరు చివరివారు. వీరికి తిరు **'మంగైమన్నన్', 'కలియన్'** అని సంప్రదాయంలో పేర్లు ఉన్నాయి. వీరు వృశ్చిక మాసం కృత్తికానక్షత్రంలో జన్మించారు. చతుష్కవి శిఖామణి అనే బిరుదు వీరికి ఉన్నది. అంటే, నాలుగువిధాలైన కవిత్వాలను చెప్పగలిగినవారు అని అర్థం. వీరు రచించిన ప్రబంధాలు ఆరు. అవి, వరుసగా **'పెరియతిరుమొళి, తిరుక్కు ఱుందాండగమ్, తిరువెళు కూర్రిరుక్కై, శిఱియతిరుమడల్, పెరియతిరుమడల్, తిరునెడుందాండకమ్'** అనేవి. ఈ ఆరు ప్రబంధాలు నమ్మాళ్వారుల నాలుగుప్రబంధాలకు వివరణరూపాలు.

వీరి మొట్టమొదటి ప్రబంధం 'పెరియతిరుమొళి' ప్రబంధం. ఇందులో 1084 పాశురాలు ఉన్నాయి. ఈ ప్రబంధంలోని మొదటి దశకంలో నారా యణ నామవైభవాన్ని, తరువాతి దశ కాలలో బదరీక్షేత్రనుండి ఆరంభించి, పలు దివ్య



క్షేత్రాలలోని వైభవాన్ని, అక్కడ ఉండే అర్చామూర్తుల మహిమను కొనియాడారు. కానీ, భగవద్దర్శనం కాలేదు.

రెండవ ప్రబంధమైన **'తిరుక్కుఱుందాండగం'**లో తమ మనసులో భగవంతుని విషయంలో కలిగిన ఆర్తిని సహించడం కోసం భగవంతుని నోరారా కీర్తించి, శిరస్సుతో నమస్కరించి, మనసులో భావించి, ఈ విధంగా త్రికరణాత్మకంగా భగవంతుని సేవించి, ప్రాణాలను ధరించటానికి ప్రయత్నం చేశారు. అయినా, భగవదనుగ్రహం వారికి లభించలేదు.

అపుడు **'తిరువెళుకూత్తిరుక్కై'** అనే మూడవ ప్రబంధంలో కుంభకోణం అనే క్షేత్రంలోని **'ఆరావముదాళ్వార్'** అనే అర్చా మూర్తి విషయంగా ఆళ్వారులు శరణాగతి చేశారు.

వీరు ఈ విధంగా శరణాగతి చేసినప్పటికీ, వీరి ఆర్తి వృద్ధి చెందితే గాని అనుగ్రహించకూడదు? అని భావించిన భగవంతుడు ఆలస్యం చేశాడు. ఆ ఆలస్యాన్ని సహించలేని తిరుమంగై మన్నన్ తమ నాలుగవ ప్రబంధమైన **'శిఱియ తిరుమడల్'**లోను, ఐదవప్రబంధం అయిన **'పెరియతిరుమడల్'** లోనూ, తమను భగవంతుడు అనుగ్రహించ లేదనే ఆర్తిని వ్యక్తం చేశారు. వీరికి ఈ విధంగా కలిగిన ఆర్త్యతిశయాన్ని చూచి సంతోషించి భగవంతుడు తన దర్శనాన్ని అనుగ్రహించగా,ఆ అనుభవాన్ని చివరి ప్రబంధమైన **'తిరునెడుందాండగం'**లో తెలియజేశారు. ఇందులో 30 పాశురాలు ఉన్నాయి. ఇది సంక్షిప్తంగా తిరుమంగైమన్నన్ ప్రబంధాల పరిచయం.

### తిరుప్పాణ్ ఆళ్వార్

వీరికి **మునివాహనులు** అని కూడా పేరు. ఈ ఆళ్వారులు వృశ్చిక మాసం రోహిణీనక్షత్రంలో శ్రీరంగక్షేత్రానికి సమీపంలోని ఉఱైయూర్ అనే ఊరిలో జన్మించారు. వీరు పది పాశురాలను కలిగిన **'అమలనాదిపిరాన్'** అనే ప్రబంధాన్ని రచించారు. ఇది శ్రీరంగనాథుని దివ్యమంగళరూపాన్ని ఆపాద

## 2023, జనవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు

01 - ఆంగ్ల సంవత్సరాది
02 - వైకుంఠఏకాదశి
14 - భోగి
15 - మకరసంక్రాంతి
16 - కనుమ
26 - భారతగణతంత్ర దినోత్సవం
శ్రీపంచమి
28 - రథసప్తమి

మస్తకం వర్ణించే గొప్ప ప్రబంధం. ఈ ప్రబంధాన్ని అనుసరిస్తూ వేదాంతదేశికులు **'భగవద్ధ్యాన సోపానం'** అనే స్తోత్రాన్ని శ్రీరంగనాథుని విషయంగా రచించారు. ఇందులో ఈ ఆళ్వార్లు తమను ఒక ఉత్తమ నాయికగా, శ్రీరంగనాథుని ఉత్తమనాయకునిగా భావించి, ఆ స్వామి సౌందర్యానితో శ్రీరంగనాథుని పాదవర్ణనతో ప్రారంభించి ఈ ప్రబంధంలో, క్రమంగా, ఆ స్వామి ధరించిన పీతాంబరం, నాభి, ఉదరబంధం, వక్షఃస్థలం, కంఠం, అధరం, నేత్రాలు, ఆ స్వామి నల్లని తిరుమేని వర్ణింపబడ్డాయి. చివరి పాశురంలోని "శ్రీరంగనాథుని దర్శించిన నా కన్నులు ఇక వేరు దేనిని దర్శించవు" అనే సూక్తితో ఈ ప్రబంధం పూర్తికావడం వీరి నాయికా భావంలోని పతివ్రతాత్వాన్ని సూచిస్తుంది.



### తొండరడిప్పొడి ఆళ్వార్లు

ఈ ఆళ్వార్లకు **భక్తాంఘ్రిరేణులు, విప్ర నారాయణులు** అని నామాలు ఉన్నాయి. వీరు ధనుర్మాసంలో జ్యేష్ఠానక్షత్రంలో జన్మించారు. తిరుమండం గుడి అనే క్షేత్రం వీరి జన్మస్థలం. వీరు **తిరుమాలై, తిరుప్పళ్ళి ఎళుచ్చి** అనే రెండు ప్రబంధాలను రచించారు.. తిరుమాలై ప్రబంధంలో 40 పాశురాలు, తిరువప్పళ్ళి ఎళుచ్చి ప్రబంధంలో 10 పాశురాలు ఉన్నాయి. వీరు శ్రీరంగనాథుని తప్ప మరి ఏ అర్చామూర్తిని తమ ప్రబంధంలో స్మరించక పోవడం ఒక విశేషం.

**తిరుమాలై** ప్రబంధం శౌనకభగవానులు అనుగ్రహించిన విష్ణుధర్మంలో చెప్పబడిన భగవన్నామ సంకీర్తన వైభవమే ఈ ప్రబంధంలో విశదీకరింపబడినది. ఈ ఆళ్వార్లు "ఎటువంటివానికైనా భగవంతుని నామ సంకీర్తనంవల్ల పరమపురుషార్థం లభిస్తుంది"- అని అంటారు.



వీరికి కలిగిన ఈ జ్ఞానవైశద్యాన్ని చూచి ఆనందించిన శ్రీరంగనాథుడు "వీరినివలెనే, లోకంలోని అందరిని తత్త్వజ్ఞానాన్ని కలిగినవారినిగా ఏ విధంగా చేయాలి?" అని ఆలోచిస్తూ యోగనిద్రలో ఉండగా, వీరు ఆ స్వామిని ఉద్దేశించి సుప్రభాతాన్ని పాడిన ప్రబంధవే **'తిరుప్పళ్ళి ఎళుచ్చి'** ప్రబంధం. ఇందులో వీరు భగవంతునకు సుప్రభాతం పలకడం అనే భగవత్సేవను చేసి, చివరి పాశురంలో ఆ సేవకు పరమావధి అయిన భాగవత సేవను అర్థించి ప్రబంధాన్ని పూర్తిచేశారు. విష్ణ్వాలయాలలో ప్రతిదినం ఉదయకాలారాధనలో ఈ ప్రబంధం నియతంగా అనుసంధింపబడడం దీని ప్రాధాన్యాన్ని తెలుపుతుంది.

*ఆళ్వార్ తిరువడిగళ్ శరణమ్.*



ఎటువంటి వారికైనా భగవంతుని నామసంకీర్తనం వల్ల పరమపురుషార్థం లభిస్తుంది

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-18

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| तव | = నీ యొక్క, నీకు-నీది | पुन: | = మరల | मम | = నా యొక్క, నాకు-నాది |
| बहि: | = వెలుపల | तत् | = అది, ఆ-వారి | अन्त: | = లోపల |
| करिष्यति | = చేయగలడు (చేస్తాడు) | करिष्यसि | = చేయగలవు (చేస్తావు) | करिष्यामि | = చేయగలను(చేస్తాను) |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) तव जनक: अद्य किं करोति?

02) मम जनक: गृहे नास्ति।

03) श्व: पाकं क: करिष्यति?

04) मम अनुज: करिष्यति।

05) तत्-गृहं मम।

06) त्वं झटिति स्नानं करिष्यसि किम्?

07) युष्मद्गृहं अन्तरस्ति।

08) अस्मद्गृहं बहिरस्ति।

09) स: पुन: स्नानं करिष्यति किल।

10) अहमपि करिष्यामि शाकं पाकमपि।

అ) జవాబులు

01) నీ తండ్రి ఇవ్వేళ ఏమి చేయుచున్నాడు?

02) నా తండ్రి ఇంటిలో లేడు.

03) రేపు ఎవరు వంట చేస్తారు?

04) నా తమ్ముడు చేస్తాడు.

05) ఆ ఇల్లు నాది.

06) నీవు త్వరగా స్నానము చేస్తావా?

07) మీ ఇల్లు లోపలున్నది.

08) మా ఇల్లు బయట ఉన్నది.

09) వాడు మరల స్నానము చేస్తాడు కదా!

10) నేను కూడ కూరను, వంటను చేయగలను.

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) మీ ఇల్లెక్కడ ఉండెను?

02) నా యొక్క ఇల్లు మునుపును అక్కడనే యుండెను.

03) ఇపుడిక్కడ ఉన్నది.

04) వారు వంటను ఎపుడు చేయగలరు? (చేస్తారు?)

05) నీవు రేపు నా కొక మంచమును చేయుము.

06) ఇపుడు నీవు మరల ఎందుకు స్నానము చేసినావు?

07) వంటను అక్కడ చేయుచున్నారు; ఆలస్యము చేయవద్దు.

08) నీవు వంటను ఇపుడు చేయవా ఏమి?

09) మా ఇంటిలో నీరు లేదు గావున చెఱువులో స్నానము చేయుము.

10) మీ పిల్లలింటిలో ఉన్నారో, లేరో?

ఆ) జవాబులు

01) युष्मद्गृहं कुत्रासीत्?

02) मम गृहं पूर्वमपि तत्रैवासीत्।

03) अधुना अत्र अस्ति।

04) ते पाकं कदा करिष्यन्ति?

05) त्वं श्व: मह्यम् एकं मञ्चं कुरु।

06) अधुना त्वं पुन: कुत: स्नानं अकरो:?

07) पाकं तत्र कुर्वन्ति; विलम्बं मा कुर्यात्।

08) त्वम् इदानीं पाकं न करोषि किम्?

09) अस्मद्गृहे जलं नास्तीत्यत: तटाके स्नानं कुरु।

10) युष्माकं बालका: गृहे सन्ति, उत न?




# చేయూత ఇచ్చిన శ్రీనివాసుడు

- శ్రీ పంగులూరి శేషగిరిరావు

ఏడుకొండలవాడు ఎందరికిచేయూతనిచ్చాడో, ఎందరికి కాళ్ళు ఇచ్చాడో, ఎందరికి కళ్ళు ఇచ్చాడో స్వామి వారికే తెలియాలి. అయితే అక్షరసత్యంగా నాపట్ల శ్రీవారు అనుగ్రహించిన తీరు స్వామివారు నాకు చేయూతనిచ్చిన ప్రత్యక్ష నిదర్శనం ఇది.

మా కుటుంబంలోని వారు ఏడుతరాలుగా శ్రీవేంకటేశ్వరస్వామిని ఇలవేల్పుగా పూజిస్తున్నాము. ఏలూరుకు దూరంగా ఉన్న పల్లెటూరులో మానాన్న ఎలిమెంటరీస్కూలు టీచర్. అయితే నా దురదృష్టంకొద్దీ మానాన్నగారు నేను ఏడవ తరగతి చదువుతూ ఉండగానే మరణించారు. పెద్దగా చదువుకోని నాతల్లి మాకు ఎప్పుడు శ్రీస్వామివారి మహిమ గురించి చెప్తూ ఉండేది. శ్రీవారినే మా కుటుంబానికి ఆపద్బాంధవుడుగా తలచి కష్టాల కడలి ఈదటం ప్రారంభించాము. కొంత కాలానికి నేను 10వ తరగతిపరీక్షలో పాసైనాను. నాకు కాలేజీలో చేరాలని, ఉన్నతచదువులు చదవాలనే కోరిక ఉండేది. అందుకోసం ఈ గ్రామంనుంచి పట్టణంవెళ్లి చదువుకోవాలి అంటే శక్తిచాలదు. అందువలన ప్రకాశంజిల్లాలో ఉన్న మా తాతయ్యకు నా కోరిక తెలుపుతూ కార్డు వ్రాశాను. మా తాతయ్య సమాధానం వ్రాస్తూ, మాఊరికి దగ్గరగా కాలేజీలో చేరి చదువు కొందువురా! అని వ్రాశాడు. ఆ ఉత్తరాన్ని చూసి సంతోషపడి, మా తాతయ్య ఉండే ఊరువెళ్దాం అనుకొన్నాను, కానీ మా అమ్మని వదిలిపెట్టి వెళ్ళాలి అనుకొన్నందుకు మా అమ్మ బాధపడింది. కానీ నా భవిష్యత్తు కోసం, “శేషూ, మనకి శ్రీవేంకటేశ్వరుడు ఇలవేల్పు. ఏ కష్టం వచ్చినా భయపడకు, బాధపడకు, స్వామిని తల్చుకుంటూ ఉండు, మనకి స్వామివారే అండగా ఉంటారు. చిన్నవాడివి దూరాభారం వెడుతున్నావు జాగ్రత్తగా వెళ్లిరా” అంటూ మా అమ్మ ఆశీర్వదించి పంపింది.

నేను మాఊరు ఏలూరునుంచి ఒంగోలుకు దగ్గరలోని మా తాతయ్య ఊరు వెళ్లాను. మొదటిసారిగా ఆ ఊరు వెళ్ళటం వలన ‘కరణంగారి ఇల్లు ఎక్కడ?’ అని అనగానే గ్రామస్థులు ఇల్లు చూపించారు. మా తాతయ్య ఇల్లుచేరి ఆతృతగా ‘తాతయ్యా’ అంటూ పిలిచాను. మా బామ్మగారు ‘ఎవరు నువ్వు? ఎక్కడ నుంచి వచ్చావు?’ అని అడిగింది. వెంటనే నేను ‘తాతయ్య రమ్మని ఉత్తరం వ్రాస్తే వచ్చాను’ అని చెప్పటంతో, ‘మీ తాతయ్య కాశీకి వెళ్ళాడు, మరొక 15 రోజులకుకానీ తిరిగిరాడు. చదువు కాలేజీల విషయాలు నాకు తెలియవు. నువ్వు వచ్చిన దారినే వెళ్లు’ అంది. ఆ మాటకు- నా నోటమాట రాలేదు. దుఃఖం వచ్చేసింది. ‘సరే వెళ్లివస్తాను’ అంటూ, బయలుదేరి ఒంగోలు చేరాను. దుఃఖం ఆగటంలేదు. ఆశ నిరాశ అయింది. నన్ను ఆదుకొనేవారు, నా బాధ వినేవారు లేరు. అప్పుడు మా అమ్మ చెప్పిన మాటలు గుర్తుకువచ్చి, శ్రీవారిని స్మరించుకుంటూ రైల్లో విజయవాడకు చేరాను. మరికొంతసేపటికి ఏలూరువెళ్లే ప్యాసింజర్ రైలులో వెళ్లటానికి విజయవాడలోని 3వ నెంబరు ప్లాట్ ఫారం మీద వున్న రైలు ఎక్కబోతున్నాను.

అంతలో దూరంగా ‘శేషగిరీ’ అనిఎవరో అన్నారు. శేషగిరి నన్నుకాదు కదా! ఇక్కడ నాకుతెలిసినవారు ఎవ్వరున్నారు? అనుకొని అయినా ముందుకు మరొక అడుగు వేశాను. ‘శేషగిరీనిన్నే.. శేషగిరీనిన్నే’ అంటున్నారు. నన్నేనేమో అనుకుంటూ తలత్రిప్పి అంతా చూశాను. ‘నిన్నే ఆగమంటున్నాను. రైలు ఎక్కకు’ అంటూ నాదగ్గరకు వస్తున్నారు. ఆ వచ్చినవ్యక్తి ఎవరా? అని పరిశీలనగా చూశాను. నుదుటిపైన చక్కటినామము, పంచె, చొక్కా, చొక్కాపైన కండువ, నవ్వుతూ నాముందుకు వచ్చిన తాతయ్యను నువ్వా తాతయ్య! అంటూ అమాంతంగా కౌగలించుకొన్నాను. వెక్కివెక్కి ఏడ్చాను. అలా ఏడుస్తూ మా తాతయ్యను దుఃఖంలో ముంచెత్తాను. మా తాతయ్య ‘నాయనా బాధపడకు’ అంటూ తలని బాగా నిమురుతూ, ‘నువ్వు ఉన్నతవిద్య చదువుతావు అందరూనిన్ను మెచ్చుకొంటారు’

అన్నాడు. 'కానీ తాతయ్య, నాయనమ్మ నువ్వు కాశీవెళ్లావు అని చెప్పింది. నువ్వు ఇక్కడే ఉన్నావు కదా? ఎందుకు ఇలా చెప్పింది' అని అడిగాను. ఆ విషయం తరువాత చెపుతాను. నువ్వు మద్ది పాడువెళ్లు అక్కడ కాలేజీలో నిన్ను చేర్చుకొంటారు. ఒంగోలుకు బయలుదేరు అని చెప్పి నన్ను రైలు ఎక్కించి నాకు పని ఉంది వస్తానంటూ తాతయ్య వెళ్లాడు.

నేను మళ్లీ వెనుకకువచ్చి మద్దిపాడులో ఉన్న జూనియర్ కాలేజీకి వెళ్లి ప్రిన్సిపాల్ గారి దగ్గరకు వెళ్లి నా పేరుచెప్పగానే 'ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరములో నిన్నుచేర్చుకోమని, నిన్ననే నాకు ఎవరోచెప్పారు. నిన్ను ఇప్పుడే చేర్చుకొంటున్నాను' అని చెప్పి తరగతిలో కూర్చోబెట్టారు. నా ఆనందానికి అవధులులేవు. నా మనస్సులో స్వామికి నమస్కరించుకొని, ఈ సంతోషవిషయాన్ని మా అమ్మకు తెలియపర్చాను.

పదిహేనురోజులుగడిచాక మాతాతయ్యకోసం వారింటికి వెళ్లాను. మా తాతయ్య ఉన్నాడు. 'తాతయ్యా! నాకు ఎంతో సహాయం చేశావు. నువ్వు విజయవాడ ప్లాట్‌ఫారం మీద కన్పించి నన్ను వెనుకకు పంపించి ఉండకపోతే నాకు ఈ విద్యాసంవత్సరము నష్టం అయ్యేది' అన్నాను. ఆయన నా మాటలు విని "నేను నీకు విజయవాడ స్టేషన్‌లో కన్పించానా? నీతో మాట్లాడానా? ఏమిట్రా? నీ పిచ్చిమాటలు. నేను ఏమిటి,




నీకు కన్పించడమేమిటి? నువ్వు చెప్పినరోజున నేను కాశీలోనే ఉన్నాను. విజయవాడలో లేను" అన్నాడు. "లేదు! తాతయ్య! నన్ను ఏడిపించకు! నేను ఆ రోజున ఏడుస్తూ నిన్ను కౌగలించు కొన్నాను. నీముఖం మీద నామాన్ని చూశాను. నువ్వు నన్ను తలనిమిరావు. నాతో పాటుగా చాలాసేపు ఉన్నావు" అన్నాను.

ఆమాటలు విని మా తాతయ్య "నేను నిన్ను ఏడి పించటంలేదు. నేను విజయవాడలో లేని మాటనిజం. నేను నుదుటిపైన నామాలు పెట్టుకోను. నువ్వు నామాలు చూశాను అంటున్నావు. అయితే నువ్వు అంత చక్కగా వర్ణించి చెపుతున్నది నేను కాదు నాయనా! నిన్ను కరుణించటానికి నారూపంలో వచ్చిన పురుషోత్తముడే! చిన్నతనంలో ఉన్న నువ్వు గ్రహించలేక పోయావు. నువ్వు శ్రీస్వామివారి అనుగ్రహం పొందావు నాయనా! నాకు చాలా సంతోషంగా ఉంది. ఆ రోజు నువ్వు చూసింది, మాట్లాడింది, కౌగలించుకొంది అంతా ఆ ఆప ద్బాంధవునే". ఈ మాటలు వింటూ నేను ఆశ్చర్యంలో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. "తాతయ్య ఇది నిజమా?" అని మళ్లీ అడిగాను. "నాయనా ఇది ముమ్మాటికి నిజమే!" అనిచెప్పాడు. నన్ను కటాక్షించిన నా స్వామిని గుర్తించలేని నా అజ్ఞానానికి నేను ఎంతో బాధపడ్డాను. తరువాత శ్రీవారి అనుగ్రహంతో నేను అందరి ప్రశంసలు పొందుతూ ఉన్నత విద్యావంతుణ్ణి కావడం, స్వామివారి దయతో ప్రభుత్వఉద్యోగిని కావటం శ్రీవారి ఆశీస్సుల ఫలితమే!

## వైకుంఠపాళి

### :: 83 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ర | ఘు | | 2 ఆ | 3 కా | శం | | 4 శ్యే | 5 ని |
| త్న | | | | ళ | | | | మి |
| 6 గి | న్నె | | 7 అ | హ | ము | | 8 ఉ | ష |
| రి | | 9 సౌ | | స్తి | | 10 తు | | ము |
| | 11 ధౌ | మ్యు | డు | | 12 అ | ల | క | |
| 13 యా | | డు | | 14 సు | | సి | | 15 జీ |
| 16 ద | ధి | | 17 సు | ప్ర | భ | | 18 కా | డి |
| గి | | | | తీ | | | | ప |
| 19 రి | పు | | 20 శా | కం | బ | రి | | ప్పు |




# సర్వకార్యానుకూలతను ప్రసాదించే 'హనుమద్వ్రతం'

– శ్రీమతి కె.విజయలక్ష్మి

మార్గశిరమాసంలో శుక్లపక్ష త్రయోదశి– "హనుమద్వ్రతం". అనన్య శ్రీరామభక్తుడు కేవలం స్మరించినంతనే బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, వాక్పటిమలను ప్రసాదించే శ్రీఆంజనేయస్వామివారి ప్రీత్యర్థంచేసే వ్రతమే– **'హనుమద్వ్రతం'**. ద్వాపరయుగంలో అరణ్యవాస సమయంలో వ్యాస మహర్షి సలహామేరకు పాండవులు ఆచరించగా, శ్రీకృష్ణపరమాత్మ స్వయంగా ద్రౌపదిచేత ఆచరింపచేసినట్లు పురాణకథనం.

హనుమద్వ్రతం ఆచరణలోనికి రావడం వెనుక ఆసక్తికరమైన పురాణగాథ ప్రచారంలో ఉంది. పూర్వం వ్యాసమహర్షి వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ అరణ్యవాసంలో ఉన్న పాండవులను చూసేందుకు ద్వైతవనానికి వెళ్ళాడు. అక్కడ వ్యాసమహర్షి రాకను గమనించిన ధర్మరాజు, ఆయన సోదరులు వ్యాస మహర్షిని సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదలను చేసి,

"మహర్షీ! మేము రాజ్యాన్ని పోగొట్టుకుని అడవులపాలయ్యాం. ఎన్నో కష్టనష్టాలకు గురవుతూ ఉన్నాము. మా సతీమణి ద్రౌపది తీవ్ర అవమానభారంతో కుంగిపోతూ ఉంది. మా కష్టాలు తొలగిపోయి రాజ్యాధికారం తిరిగి లభించే మార్గాన్ని ఉపదేశించండి" అని ప్రార్థించారు. అందుకు–


"నాయనలారా! మీ కష్టాలన్నీ తొలగిపోయే వ్రతాన్ని వివరిస్తాను. శ్రద్ధగా ఆచరించండి. పూర్వం శ్రీరామచంద్రమూర్తి, సీతాదేవి, లక్ష్మణుడులతో కలిసి వనవాసం చేస్తూ ఉన్న సమయంలో రావణాసురుడు సీతాదేవిని అపహరించాడు. ఆమెను వెదకుతూ రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతం వద్దకు చేరుకుని అక్కడ వారు హనుమంతుడిని కలిశారు. హనుమంతుడిని చూసిన శ్రీరాముడు ఆయన పూర్వచరిత్రను గురించి అడుగగా, తాను జన్మించడం, వజ్రాయుధంతో ఇంద్రుడు దవడ పగలగొట్టడం, వాయువు స్తంభింపచేయడం, దేవతలందరూ వచ్చి హనుమంతునికి వరాలను ఇచ్చి శక్తిని ప్రసాదించడం, సూర్యుడి వద్ద విద్యను అభ్యసించడంవంటి విషయాలన్నింటిని హనుమంతుడు వివరించాడు. దేవతలనుండి చిరంజీవిగా వరాన్ని పొందిన హనుమంతుడు సర్వదేవతాస్వరూపుడు. ఆయన సహాయంతో సీతాదేవినే తిరిగి పొందగలిగాడు. కనుక మీరు కూడా హనుమద్వ్రతాన్ని ఆచరించండి" అని వ్యాసమహర్షి పాండవులకు చెప్పాడు.

హనుమద్వ్రతాన్ని మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు ఆచరించాలి. వ్రతం నాటి ముందురోజు రాత్రి ఉపవాస, బ్రహ్మచర్యంలను పాటించాలి. వ్రతంరోజు తెల్లవారుఝామునే నిద్రలేచి తలస్నానం చేసి ఇంటిని శుభ్రం చేసుకుని ముగ్గులు

## భర్తృహరి సుభాషితాలు

**నీచులు విఘ్నాలు వస్తాయన్న భయంతో పనికి పూనుకోరు. మధ్యములు పని ప్రారంభించి.. విఘ్నాలు ఎదురైతే వదిలేస్తారు. ధీరులు ఎన్ని ఆటంకాలు కలిగినా... పూనుకొన్నపని తుద ముట్ట నెరవేరేవరకూ వదలనే వదలరు.**

వేసి, ఇంటి గడపలను శుభ్రపరిచి పసుపు కుంకుమలతో అలంకరించాలి. పూజా మందిరంలోగానీ, ఇంటిలో పూజ చేయ దలచుకున్న చోట ఏర్పాటు చేసుకున్న మండపంపైనగానీ బియ్యపుపిండితో అష్టదళ పద్మమును చిత్రించాలి. దానిపైన బియ్యాన్ని పోసి కలశాన్ని ఏర్పాటు చేసుకుని పసుపు, సింధూరం, గంధంలతో అలంకరించాలి. కలశం ముందువైపు స్వామివారి చిన్న విగ్రహాన్ని కానీ లేదంటే వెనుక వైపు స్వామి వారి చిత్రాపటాన్నిగానీ ఏర్పాటు చేసుకోవాలి.




కలశంలోనికి శ్రీఆంజనేయస్వామి వారిని ఆవాహన చేసుకుని ముందుగా వినా యకుడిని పూజించి, అనంతరం శ్రీఆంజనేయ స్వామివారిని షోడశోపచారాలు, అష్టోత్త రాలతో పూజించి 13 గోధుమ అప్పాలను, గోధుమ రవ్వతో చేసిన కేసరీని గానీ, గోధుమ అన్నాన్ని గానీ నైవేద్యంగా సమర్పిం చాలి. 13 పోగులు ఉన్న దారాన్ని తీసికొని సింధూరం పూసి పూని 13 ముడులలో తోరాన్ని తయారు చేసుకోవాలి. ముందుగా తోరాలను స్వామివారి వద్ద ఉంచి పూజించి తర్వాత ధరించాలి.

తర్వాత వ్రతకథను చెప్పుకుని అక్షతలను వేసి నమస్కరించడంతో పాటు స్వామివారి పాదాల వద్ద ఉన్న అక్షతలను తీసుకుని తలమీది వేసుకోవాలి. ఈ విధంగా వ్రతాన్ని ముగించిన అనంతరం పండితులు, బంధు మిత్రులతో కలిసి భోజనం చేయాలి. సాయంత్రం దీపాలను వెలిగించి పూజించాలి. రాత్రి ఉపవాసం ఉండాలి. మళ్ళీ మరుసటి రోజు పునఃపూజచేసి వ్రతాన్ని ముగించాలి.

తోరాన్ని మరుసటి సంవత్సరం వరకు భద్రంగా ఉంచు కోవాలి. మరుసటి సంవత్సరం దానిని వదిలివేసి నూతన తోరాన్ని ధరించాలి. ఒకవేళ మధ్యలో తోరమ్ జీర్ణమైతే ఏ మాసంలో అయినా శుద్ధత్రయోదశినాడు లేక శనివారంనాడు గానీ పూర్వాభద్రా నక్షత్రం రోజు కానీ నూతన తోరాన్ని తయారు చేసుకుని స్వామివారిని స్మరిస్తూ ధరించాలి. ఇలా వ్రతాన్ని పదమూడు సంవత్సరాల పాటు ఆచరించి ఉద్యాపన చేయాలి. ఒకవేళ మళ్ళీ చేయాలనుకునే వారు తిరిగి ప్రారంభించి పద మూడు సంవత్సరాలు ఆచరించాలి.


ఈ విధంగా వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడంవల్ల సమస్యలు, కష్టాలు తొలగిపోయి కార్యానుకూలత కలగడంతో పాటు సకలసౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలు, జ్ఞానం లభిస్తాయి.

చిత్ర కథ

# తిరుప్పావై జీయర్

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

ఒకనాడు శ్రీరంగంలోని చిత్రవీథిలో శ్రీరామానుజులవారు తిరుప్పావైని అనుసంధానం చేసుకుంటూ భిక్షాటనం చేస్తున్నారు. శిష్యులు ఆచార్యుల వారిని అనుసరిస్తూ పాశురాల్ని పారాయణం చేస్తున్నారు.





శ్రీరామానుజుడు సామాన్యుడు కాదమ్మా. మనసుని బుద్ధిని ఏకం చేస్తాడు. నిన్ను నీళాదేవిగా భావించాడు.
పద చూద్దాం. ఆయన తాదాత్మ్యం!
ఇద్దరూ వాకిట్లోకి వచ్చారు.
రామానుజా! లేచి నిలబడు!
శ్రీరామానుజుడు లేచి నిలబడ్డాడు. నాయనా! ఈమె నీళాదేవి కాదు. నా కూతురు..
పాశురంలో లీనమయ్యావు.
స్వయంగా నీళాదేవి వచ్చిందనుకున్నాను.. ఆచార్యా!
శ్రీరామానుజా! నేటి నుంచి నువ్వు 'తిరుప్పావై జీయర్'గా ప్రసిద్ధి చెందుతావు!

# అతడికి నువ్వేమి ఇవ్వగలవ్వు?

బాలనీతి

– శ్రీమతి వి.స్వర్ణలత

ఒకానొక రైతు రోజూ కావడికుండల్లో ఎంతోదూరం నుండి నీటిని తీసుకొస్తుంటాడు. అతడి కావడికుండల్లో ఒక దానికి ఓ చిల్లి ఉండేది. రెండో కుండకు ఇలాంటి లోపమేమీ లేనందువల్ల బావినుండి తోడిననీటిని ఇంటివరకు పదిలంగా తీసుకు వెళ్లేది. ఈ పరిస్థితిని చూచి చిల్లికుండ చింతిస్తుండేది. సిగ్గుపడుతుండేది.



ఓ రెండు సంవత్సరాల పాటు ఈ సంతాపాన్ని ఓర్చుకొని, చివరకు కావడి మోసుకొచ్చే రైతుతో "నా చేతగానితనానికి, అసమర్థతకూ దుఃఖిస్తున్నాను. నువ్వింత కష్టపడి బావినుండి నీళ్లు తోడి ఇంటికి తీసుకువెళ్తుంటే, నా కుండలోని సగం నీరు వృథాగా దోవలోనే పోగొడుతున్నాను. నేనో పనికిరానిదాన్ని" అని ఆత్మనింద చేసుకుంది.

రైతు ఎంతో జాలితో, "ఎందుకలా బాధపడతావ్? నీ పరిస్థితి నాకు తెలియదంటావా? కానీ మనం నడిచొస్తున్న దోవనెప్పుడైనా గమనించావా?" అని అడిగాడు. ఈసారి ఈ చిల్లికుండ, బాటను జాగ్రత్తగా చూచింది. బాట అంచున ఎన్నో చక్కటి పూలచెట్లూ, వికసించిన పూలూ కనిపించి నాయి. ఆ దృశ్యం చూచి సంతోషించిన ఆ చిల్లికుండ, రైతుతో "బాట పక్కనే కనిపిస్తున్న పూలమొక్కలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయన్నమాట నిజమే! కానీ నన్ను ఎందుకు చూడమన్నావు?" అనింది.

"పూల మొక్కల్ని గమనించావే కానీ అవి బాట కిరు వైపులా కాకుండా, ఒక వంకనే పెరిగి పెద్దవవుతున్నా యనే సంగతి గమనించావా? నా మెడమీది కావడిలో నువ్వు ఏ వైపున ఉన్నావో, ఆ వైపునే ఆ మొక్కలు ఎదుగుతున్నాయి. దోవపొడుగూతా, నీ రంధ్రం నుండి పడుతున్న ఈ కొద్దిపాటి నీటితోనే ఆ మొక్కలు పెరు గుతూ వచ్చినాయి.

ఇంతేకాదు – ఆ పుష్పాలే నేను తీసుకు వచ్చి ఇంట్లో వారికి ఇస్తుంటాను; వాళ్లందరూ వాటిని చూచి ఎంతో ఆనందిస్తుంటారు. దేవుణ్ణి ఆరాధించడానికి వాటినే విని యోగిస్తుంటారు. ఆ పూలమొక్కలకు నువ్వే ఆధారం. అందువల్ల లోపభూయిష్టమైనదానివనీ, నిరర్థకురాలివనీ నిన్ను నువ్వు నిందించుకోవద్దు. పనికిరానివారమని అనుకునేవారుకూడా ఎందుకో ఒకందుకు పనికివస్తారు అని గుర్తుంచుకో" అన్నాడు.

**నీతి–** భగవంతుని సృష్టిలో పనికి రానివారంటూ ఎవరూ లేరు.



పనికిరాని వారమని అనుకునే వారు కూడా ఎందుకో ఒకందుకు పనికి వస్తారు

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: డా॥ ఏ.సంధ్య

## కదంబం

| పంచ యాగములు | పంచ సంస్కారములు |
|---|---|
| 01) అశ్వమేధము | 01) తాపము |
| 02) రాజసూయము | 02) పుండ్రము |
| 03) విశ్వజిత్ | 03) యజనము |
| 04) పుత్రకామేష్టి | 04) నామము |
| 05) సర్పయాగము | 05) మంత్రము |

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) ఉడిపి | అ) శ్రీరాముడు |
| 2) కంచి | ఆ) నారాయణుడు |
| 3) భద్రాచలం | ఇ) కామాక్షి |
| 4) బదరి | ఈ) శివుడు |
| 5) కేదారనాథ్ | ఉ) శ్రీకృష్ణుడు |

జవాబులు: 1-(ఉ); 2-(ఇ); 3-(అ); 4-(ఆ); 5-(ఈ)

## మీకు తెలుసా?

1) పద్మావతీదేవి తండ్రి పేరు?
2) శ్రీనివాసుని తల్లిపేరు ?
3) గోదాదేవి ఆచరించిన వ్రతం పేరు?
4) శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన లింగం?
5) శ్రీరంగక్షేత్రంలోని ప్రాకారాల సంఖ్య?
6) తిరుమలలో శ్రీనివాసునికి భూదానం చేసినవాడు?
7) తిరుమలలో శ్రీవారికి మొదట తోయ(తీర్థ)కైంకర్యం చేసినవాడు?

జవాబులు:
1) ఆకాశరాజు
2) వకుళమాత
3) తిరుప్పావై
4) వాయులింగం
5) ఏడు
6) వరాహస్వామి
7) తిరుమలనంబి

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

ద రి శ్రీ అం రే హ కి రా అం త త్మా

జవాబు:
అందరికి
శ్రీహరే అంతరాత్మ

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

# క్విజ్ 05

01) 'చూడికొడుత్తనాచ్చియార్' అని ఎవరిని పిలుస్తారు? జ)..........
02) శంకరదత్తుడు ఎవరి పుత్రుడు? జ)..........
03) వైష్ణవమతాన్ని స్వీకరించిన పిమ్మట శంకరాదత్తుని పేరు ఏమి? జ)..........
04) 'కోదా' అంటే ఏమి అర్థం? జ)..........
05) అర్చన విధానాలు ఎన్ని రకములు? జ)..........
06) భగవంతుని నాల్గవ రూపము పేరేమి? జ)..........
07) వైఖానసకల్పసూత్రం ప్రకారం దేవతార్చన ఎన్ని విధాలు? జ)..........
08) సంజయుడు ఎవరి కుమారుడు? జ)..........
09) ఏ దేశపు రాజు చేతిలో సంజయుడు ఓడిపోయాడు? జ)..........
10) విదుల వృత్తాంతాన్ని ఎవరు, ఎవరికి చెప్పారు? జ)..........
11) కాలాగ్ని శమనుడు అని ఎవరిని పిలుస్తారు? జ)..........
12) శ్రీమన్నారాయణుని 'గద' పేరేమి? జ)..........
13) శ్రీమహావిష్ణువు యొక్క 'ధనస్సు' పేరు? జ)..........
14) స్థలపురాణం ఆధారంగా కార్వేటినగరం అసలు పేరేమి? జ)..........
15) కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామికి బ్రహ్మోత్సవాలు ఎప్పుడు జరుగుతాయి? జ)..........
16) శ్రీవైష్ణవసంప్రదాయంలో 'కోయిల్'పదం ఏ క్షేత్రానికి వాచకంగా ప్రయోగిస్తారు? జ)..........
17) 'నడై- కొడై- వడై అళకు' అనే సామెత ఏయే క్షేత్రాలకు వర్తిస్తుంది? జ)..........
18) గరుత్మంతుడు శ్వేతమృత్తికను ఎక్కడ నిక్షిప్తం చేశాడు? జ)..........
19) భగవంతునికి 'గజేంద్రవరదుడు' అన్న నామం కల్గిన దివ్యదేశం పేరేమి? జ)..........
20) ఆ దివ్యదేశంలోని అమ్మవారి పేరేమి? జ)..........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందానమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-12-2022.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరిమాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధానపత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోను నెంబరు: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

డిసెంబరు, 2022

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం-** మీరు వృత్తిపరమైన ఎదుగుదలకు అనేక అవకాశాలను కనుగొంటారు, ఆదాయం మరియు లాభాలను పొందుతారు. న్యాయమైన సమస్యలకు సత్వరపరిష్కారం లభిస్తుంది.

**వృషభం-** తలపెట్టిన కార్యక్రమాలు పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాల్లో ఆదాయంతోబాటు ఇంటి ఖర్చులూ పెరుగుతాయి. ఈ సమయంలో కొన్ని అనవసర ఖర్చులు పెరిగే అవకాశం ఉంది.

**మిథునం-**ఆకస్మిక ధనలాభము మిమ్ములను వరిస్తుంది. అధికారం లేదా ప్రభుత్వం నుండి కొంత గుర్తింపు లేదా ప్రతిఫలం వస్తుంది.

**కర్కాటకం-**గ్రహస్థితి అనుకూలంగా ఉంది. పూర్వపు అస్తులు కలసి వస్తాయి. విద్యార్థులకు అనుకూలం. మీరు స్థితి మరియు సంపాదన లకు చేసేప్రయత్నాలు విజయాన్నిస్తాయి.

**సింహం -** వ్యవసాయదారులకు గతం కంటే పంటలు విశేషలాభములనిస్తాయి. మానసిక బలహీనతలు, తల మెడ నరముల నిస్సత్తువలు ఉంటాయి. విద్యార్థులు చదువులవిషయంలో జాగ్రత్త వహించాలి.

**కన్య-** మనోప్రశాంతత, గౌరవము, వృత్తి ఉద్యోగస్థులకు అధికారుల అభివృద్ధి, ఆదరణ లభిస్తుంది. కార్యసిద్ధి. సంపద, ఆస్తి పెరిగే అవకాశం ఉంది. కుటుంబం పట్ల అభిమానం కల్గి ఉంటారు.

**తుల-** శత్రువుల విషయంలో తగుజాగ్రత్త అవసరము. ప్రమోషన్ లేదా జీతం పెరుగుదలను చూస్తారు. పురోగతి, ఆనందం, మంచి ఆరోగ్యం మరియు సంపదలు పెరిగే కాలం.

**వృశ్చికం-**ధనం విషయంలో లోటు ఉండదు. సహోద్యోగులు మరియు స్నేహితుల నుండి చాలా ప్రశంసలు పొందుతారు. మీరు కుటుంబంతో కలసి వినోదకార్యక్రమాల్లో పాల్గొంటారు.

**ధనుస్సు-** దృఢమైన సంకల్పంతో కార్యదీక్ష ప్రారంభిస్తారు. వ్యక్తిగతంగా సంఘటనలు అనుకూలం. మీ మెరుగైన పనితీరుకు అనుగుణంగా మీరు చాలా ప్రశంసలు మరియు ప్రమోషన్ కూడా పొందుతారు.

**మకరం-** సర్వత్రావిజయం, పెట్టుబడులు అధికలాభాలనిస్తాయి, ధనాదాయం పెరుగుతుంది. మీ వృత్తులలో నిబద్ధత చూపిస్తారు. దైవబలంతో దోషములు తొలగి ఐశ్వర్యం మిమ్ములను వరిస్తుంది. కార్యసిద్ధిని పొందుతారు.

**కుంభం-** జీవితంలో సానుకూలత. సంపద, లాభాలలో పెరుగుదల. ఉద్యోగుల ప్రమోషన్లకు అనుకూల సమయం. వృత్తివ్యాపారాలకు అనుకూలం. పరిశోధనలుకు గుర్తింపు వస్తుంది.

**మీనం-** ఆధ్యాత్మికత పెరుగుతుంది. పెద్దలను గౌరవిస్తారు. కార్యసిద్ధితో పాటు మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మీలోని విశ్వాసం శక్తిని కల్పిస్తుంది.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________________

______________________________

______________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐☐

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

తేది :

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా (12 సం॥రాలు) రూ.2400/-లు; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి

83

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | ■ | 2 | 3 | | ■ | 4 | 5 |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 19 | | ■ | 20 | | | | ■ | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)ఈ వంశంలో రాముడు జన్మించడం వల్ల 'రఘునందనుడు' అని పిలుస్తారు(2); 2)మనం నేలపైన ఉంటే మననెత్తిపైన ఉన్నది(3); 4)సంపాతి, జటాయువుల తల్లి(2); 6)వ్యవహారంలో వంటపాత్ర(2); 7)అహరహము-పదంలో పగలు(3); 8)బాణాసురుని కుమార్తె(2) 11)పాండవుల పురోహితుడు(3); 12)సహజంగా కొత్త పెళ్లికొడుకు ఈ పాన్పు ఎక్కుతారు(3); 16)పెరుగు(2); 17)అష్టావక్రుని భార్య(2); 18)ఎడ్లమెడపై ఇది వేస్తారు(2); 19)శత్రువు(2); 20)కూర గాయలతో అలంకరించిన దుర్గాదేవిని ఇలా పిలుస్తారు(4)

### నిలువు

1)ఈ కొండపైన సత్యనారాయణస్వామి వెలిశాడు(4); 3)తిరుపతికి ఉత్తరముఖంగా ఉన్న శివక్షేత్రం(4); 5)తెప్పవైయునంతకాలం(4); 9)సోమరసాన్ని త్రాగిన బ్రాహ్మణుణ్ణి ఇలా పిలుస్తారు(3); 10)తులాభారంలో రుక్మిణి వేసిన దళము(3); 13)భాగ్యనగరానికి దగ్గరలో ఉన్న నృసింహక్షేత్రం(4); 14)భగదత్తుని ఏనుగు పేరు(4); 15)పాయసంలో వేసే పప్పు(4)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.




తిరుమలలో కృత్తికా దీపోత్సవం
(07-12-2022)



తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి లక్షబిల్వార్చన
(10-12-2022)

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-11-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

